మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

శుక్రవారం FRIDAY 3-7-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 2 Volume:2 | సంచిక: 4 Issue: 4

03 జూలై 2026 - శుక్రవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - గ్రీష్మ ఋతువు జ్యేష్ఠ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - తె. 5:49 సూర్యాస్తమయం - సా. 6:50 తిథి తదియ ఉ. 11:18 వరకు తరువాత చవితి సంస్కృత వారం భృగు వాసరః నక్షత్రం శ్రవణ ఉ. 11:36 వరకు తరువాత ధనిష్ఠ యోగం విష్కంభ సా. 4:56 వరకు కరణం విష్టి ఉ. 11:18 వరకు బవ రా. 12:01ం వరకు వర్జ్యం సా. 4:06 నుండి సా. 5:50 వరకు దుర్ముహూర్తం ఉ. 8:26 నుండి ఉ. 9:18 వరకు మ. 12:46 నుండి మ. 1:38 వరకు రాహుకాలం ఉ. 10:42 నుండి మ. 12:20 వరకు యమగండం మ. 3:35 నుండి సా. 5:13 వరకు గుళికాకాలం ఉ. 7:27 నుండి ఉ. 9:05 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:13 నుండి తె. 5:01 వరకు అమృత ఘడియలు రా. 2:28 నుండి తె. 4:12 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:54 నుండి మ. 12:46 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున

Circulated to Telangana
Published from Jagitial






# మూసీ మొదటి దశకు ఆమోదం

## మూసీ ఫేజ్-1కు రూ.7,345 కోట్లు మంజూరు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో జరిగిన మంత్రిమండలి సమావేశం రాష్ట్ర ప్రగతికి దిక్సూ చిగా నిలిచే పలు కీలక, చారిత్రక నిర్ణయాలు తీసుకుంది. సుమారు 3 గంటల పాటు సుదీర్ఘంగా సాగిన ఈ భేటీలో విద్యా, వైద్య, మౌలిక సదుపాయాల కల్పనపై కేబినెట్ ఆమోదముద్ర వేసింది.





- వీబీ జీరామ్‌జీ పథకాన్ని అమలు చేస్తూనే కోర్టులో సవాల్
- ఇక స్కూళ్లు, కాలేజీల్లో టీచర్లకు కూడా మధ్యాహ్న భోజనం
- సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో మొత్తం 6,278 పోస్టుల మంజూరు
- గిడ్డంగులు, నవోదయ విద్యాలయాలకు పలుచోట్ల భూ కేటాయింపులు

### తెలంగాణ కేబినేట్ కీలక నిర్ణయాలు

హైదరాబాద్, జూలై 02: సమావేశం అనంతరం మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ధనసరి అనసూయ (సీతక్క), అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల సిబ్బందికి ఉచిత భోజనం, మూసీ ప్రాజెక్టుకు భారీ నిధులు, ఆసుపత్రుల్లో వేలాది ఉద్యోగాల భర్తీ వంటి చారిత్రాత్మక నిర్ణయాలను వెల్లడించారు. వీటితో పాటు రాష్ట్రంలో గోదాములు, విద్యాసంస్థలకు అవసరమైన స్థలాల కేటాయింపులకు కూడా కేబినెట్ పచ్చజెండా ఊపింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో (12వ తరగతి వరకు) చదువుతున్న విద్యార్థులకే కాకుండా, ఇకపై అక్కడ పనిచేసే బోధన, బోధనేతర సిబ్బందికి కూడా ఉచిత భోజన వసతి కల్పించాలని కేబినెట్ అపూర్వ నిర్ణయం తీసుకుంది. దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సుమారు లక్షా 50 వేల మంది ఉపాధ్యాయులు, లెక్చరర్లు, ఇతర సిబ్బందికి ప్రయోజనం చేకూరనుంది. వీరందరికీ ప్రతిరోజూ ఉచితంగా అల్పాహారం, పాలు, తరువాయి 2 వ పేజీలో...

# సవాల్ చేసి తోకముడిచారు





- జూపల్లి కృష్ణారావు రాజీనామా చేయాలని డిమాండ్
- గురుకుల టెండర్లలో అవకతవకలు జరిగాయని ఆరోపణలు
- చేనేత కార్మికులకు అన్యాయం జరిగిందని విమర్శలు
- విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి టి. హరీశ్ రావు

తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి టి. హరీశ్ రావు రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమ ర్శలు చేశారు. ప్రభుత్వం సవాళ్లు విసిరి చివరకు వెనక్కి తగ్గిందని, గోల్ కొట్టాలని వెళ్లి సెల్ఫ్ గోల్ చేసుకుందని వ్యాఖ్యానిం చారు. రాష్ట్ర అప్పులపై మంత్రి జూపల్లి కృష్ణారావు చేసిన ఆరోప ణలకు ఆధారాలు చూపలేక పోయారని, ఇచ్చిన మాట ప్రకారం ఆయన రాజీనామా చేయాలని హరీశ్ డిమాండ్ చేశారు.

హైదరాబాద్, జూలై 02: రాష్ట్ర అప్పులపై తాము గతంలోనే అసెంబ్లీ వేదికగా పూర్తి లెక్కలు వెల్లడించామని హరీశ్‌రావు తెలిపారు. ఒక రోజు రూ.8 లక్షల కోట్ల అప్పు ఉందని, మరుసటి రోజు రూ.7 లక్షల కోట్ల అప్పు ఉందని ప్రభుత్వం చెబుతోందని విమర్శించారు. చర్చకు తాము సిద్ధంగా ఉన్నప్పటికీ పోలీసులు అడ్డుపెట్టి ప్రభుత్వం వెనక్కి తగ్గిందని ఆరోపించారు. గురుకులాల టెండర్లలో భారీ అవకతవకలు జరిగాయని తాను, ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్, కొప్పుల ఈశ్వర్ ఆధారాలతో సహా వెల్లడించామని హరీశ్‌రావు చెప్పారు. రూ.2 వేల కోట్ల విలువైన టెండర్లలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తే, ప్రభుత్వం మాత్రం వేర్వేరు సందర్భాల్లో వేర్వేరు లెక్కలు చెబుతోందని విమర్శించారు. గురుకుల కిరాణా సరఫరా టెండర్లలో కోట్ల రూపాయల గోల్‌మాల్ జరిగిందనే వార్తలు వచ్చినప్పటికీ ప్రభుత్వం సమాధానం చెప్పలేద న్నారు. చేనేత కార్మికుల ప్రయోజనాలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని హరీశ్‌రావు ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవోలను అమలు చేయకుండా, యూనిఫాంలు, ఇతర వస్తువుల కొనుగోలు టెండర్లను పెద్ద కాంట్రాక్టర్లకు అప్పగించిందన్నారు. ఈ వ్యవహారంలో హైకోర్టు తరువాయి 2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు

బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.14,379 |
| వెండి (కిలో): | రూ.2,50,100 |
| ప్లాటినం (గ్రాము): | రూ.4,896 |



# పేదల ఇళ్లనే కూలుస్తోందని.. హైడ్రాపై హైకోర్టు ఆగ్రహం

హైదరాబాద్: నగరంలోని తార్నాకలో ఎర్రకుంట ఆక్రమణపై తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిపై వాదనల సందర్భంగా.. 8 ఎకరాల చెరువు ఆక్రమణకు గురైందని పిటిషనర్ తరఫు న్యాయవాది విజయ్ గోపాల్ తెలిపారు. జీహెచ్ఎంసీ, హైడ్రా, లేక్ ప్రొటెక్షన్ కమిటీకి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని చెప్పారు. ఈక్రమంలో ఆయా విభాగాల అధికారులపై హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది. హైడ్రా, జీహెచ్ఎంసీ కేవలం పేదల ఇళ్లనే కూలుస్తున్నాయని వ్యాఖ్యానించింది. తదుపరి విచారణను 16వ తేదీకి వాయిదా వేసింది.

# బుల్లెట్ ప్రూఫ్ వాహనాలు తొలగింపు!

## తెలంగాణ పోలీస్ శాఖ కీలక నిర్ణయం





హైదరాబాద్, జూలై 02: తెలంగాణ పోలీస్ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. రిటైర్‌మెంట్ అయిన డీజీపీలను కొందరిని ప్రభుత్వం వివిధ పదవులలో కొనసాగిస్తున్న నేపథ్యంలో.. పదవుల్లో ఉన్నవారికి ప్రస్తుతం కొనసాగిస్తున్న బుల్లెట్ ప్రూఫ్ వాహనాలు తొలగిస్తూ నిర్ణయం తీసుకుంది. 26 మంది మాజీ పోలీస్ ఉన్నతాధికారులతోపాటు ప్రస్తుత అధికారులకు బుల్లెట్ వాహనాలు తీసివేసింది. మాజీ డీజీపీలు స్వరణ్‌జిత్ సేన్, ఏకే ఖాన్, ఏకే మహంతి, దినేష్ రెడ్డి, జితేందర్, మహేందర్ రెడ్డి, అనురాగ్ శర్మ, పూర్ణచందర్రావు, కొత్తకోట తరువాయి 2 వ పేజీలో...



## ఓ డిఎస్పీ అక్రమాస్తుల విలువ 200 కోట్ల పైనే

- కళ్లు చెదిరే ఆస్తులు..బంగారం, వెండి, నగదు
- డిఎస్పీ భీమిరెడ్డి నివాసాల్లో ఎసిబి సోదాలు
- అక్రమాస్తుల కేసులో అరెస్ట్

ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో డీఎస్పీ సంకిరెడ్డి భీమ్‌రెడ్డిని ఏసీబీ అరెస్ట్ చేసింది. పోలీస్ కంప్యూటర్ సర్వీసెస్ (పీసీఎస్) విభాగంలో పనిచేస్తున్న భీమ్‌రెడ్డి.. అక్రమంగా ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలతో గురువారం ఉదయం నుంచి ఏసీబీ అధికారులు సోదాలు కొనసాగించారు. నార్సింగిలో ఆయన ఇల్లు సహా రాష్ట్రవ్యాప్తంగా 16 ప్రాంతాల్లో ఏకకాలంలో తనిఖీలు చేపట్టారు.

హైదరాబాద్, జూలై2: ఈ క్రమంలో కళ్లుచెదిరే రీతిలో ఆస్తులను ఏసీబీ గుర్తించింది. విల్లా, ఇళ్లు, ప్లాట్లు, కమర్షియల్ స్పేస్‌లు, ఓపెన్ ప్లాట్లు, వ్యవసాయ భూములకు సంబంధించిన పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తెలంగాణతో పాటు కర్ణాటకలోనూ భీమ్‌రెడ్డికి వ్యవసాయ భూములు ఉన్నట్లు ఏసీబీ గుర్తించింది. ఆయన ఇంట్లో భారీ స్థిరాస్తులకు సంబంధించిన పత్రాలు, సుమారు రూ.43.06 లక్షల నగదు, దాదాపు 2 కిలోల బంగారు ఆభరణాలు, 20 కిలోల వెండి తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



### భూమికీ గుండె!

భూమికీ గుండె ఉందా? అంటే అవునంటున్నారు భూగర్భ శాస్త్రవేత్తలు. ప్రతి 26 సెకన్లకు ఒకసారి సెస్మిక్ పల్స్‌ను విడుదల చేస్తుందని చెప్తున్నారు. తొలిసారి 1960ల్లో దీన్ని గుర్తించగా, భూమి గుండె చప్పుడుగా వర్ణిస్తున్నారు.




# జులై 20లోపు నీట్-యూజీ రీ-ఎగ్జామ్ ఫలితాలు

- వేగంగా మూల్యాంకన ప్రక్రియ.. ఎంబీబీఎస్ ప్రవేశాలకు ఆటంకం లేదన్న ఎన్‌టీఏ
- 10 వేల అభ్యంతరాల పరిశీలన అనంతరం తుది ఫలితాలు

న్యూఢిల్లీ, జూలై 2: నీట్-యూజీ రీ-ఎగ్జామ్ ఫలితాలను జులై 20లోపు విడుదల చేయనున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) వెల్లడిం చింది. ప్రశ్నాపత్రం లీక్ ఆరోపణల నేపథ్యంలో మే 3న నిర్వహించిన పరీక్షను రద్దు చేసిన అనంతరం జూన్ 21న మళ్లీ పరీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఫలితాల విడుదలకు సంబంధించిన ప్రక్రియ వేగంగా కొనసాగుతోందని ఎన్‌టీఏ సీనియర్ అధికారులు తెలిపారు. అయితే ఫలితాల విడుదలకు సంబంధించి తరువాయి 2 వ పేజీలో...

# యూజర్‌నేమ్ ఫీచర్‌పై వాట్సప్ స్పష్టత

- ఆందోళనల మధ్య సందేహాలకు సమాధానాలు
- కేంద్రం నోటీసుల నేపథ్యంలో వివరణ



మెటా మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ వాట్సప్ ప్రకటించిన యూజర్‌నేమ్ ఫీచర్పై వ్యక్తమవుతున్న ఆందోళనలకు సంస్థ వివరణ ఇచ్చింది. ఈ ఫీచర్ ఇంకా విస్తృత స్థాయిలో అందుబాటులోకి రాలేదని, దశలవారీగా ఈ ఏడాది చివరి నాటికి ప్రపంచవ్యాప్తంగా అందరికీ అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపింది. యూజర్లలో నెలకొన్న సందేహాలకు సమాధానాలు ఇస్తూ పలు కీలక అంశాలను స్పష్టం చేసింది.

న్యూఢిల్లీ, జూలై 2: వాట్సప్ ప్రకారం యూజర్‌నేమ్ పూర్తిగా ఐచ్ఛికం యూజర్లు కోరుకుంటే మాత్రమే తమ పేరును రిజర్వ్ చేసుకోవచ్చు. లేదంటే ఇప్పటిలాగే మొబైల్ నంబర్‌తోనే వాట్సప్‌ను ఉపయోగించవచ్చు. ఒక యూజర్‌నేమ్ ఇప్పటికే ఫేస్‌బుక్ లేదా ఇన్‌స్టాగ్రామ్‌లో చట్టబద్ధమైన ఖాతాదారుల పేరిట ఉంటే, అదే పేరుకు వారికి ప్రాధాన్యత ఉంటుంది. అలాగే ప్రముఖులు, ప్రభుత్వ తరువాయి 2 వ పేజీలో...

## రాశి ఫలాలు

3.7.2026

వృషభం: వృత్తి ఉద్యోగాలలో అధికారులతో వివాదాలకు తగినంత దూరంగా ఉండాలి. ప్రయాణాలు వాయిదా పడుతాయి. చేపట్టిన పనులు సకాలంలో పూర్తికాక చికాకు కలిగిస్తాయి. ఆర్థిక వ్యవహారాలు నిరుత్సాహపరుస్తాయి. నూతన వ్యాపారాలలో ఆలోచించి పెట్టుబడులు పెట్టడం మంచిది.

మిధునం: సన్నిహితుల నుండి నూతన విషయాలు సేకరిస్తారు. గృహమునకు బంధు మిత్రులు ఆగమనం ఆనందం కలిగిస్తుంది. స్త్రీ సంబంధ వ్యవహారాలలో కొంత జాగ్రత్తగా వ్యవహరించాలి. వ్యాపారస్తులకు ఆశించిన లాభాలు అందుతాయి. వృత్తి ఉద్యోగాలలో అనుకూలత పెరుగుతుంది.

కర్కాటకం: మొండి బాకీలు వసూలు అవుతాయి. కుటుంబ వాతావరణం ప్రశాంతంగా ఉంటుంది. శత్రువులు సైతం మిత్రులుగా మారి సహాయ సహకారాలు అందిస్తారు. సమాజంలో కీర్తి ప్రతిష్టలు పెరుగుతాయి. వృత్తి ఉద్యోగమున మంచి పనితీరుతో అధికారులను ఆకట్టుకొంటారు. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి.

సింహం: ముఖ్యమైన వ్యవహారాల్లో పెద్దల సలహాలు తీసుకుని ముందుకు సాగడం మంచిది. దైవ సేవా కార్యక్రమాలకు ధన వ్యయం చేస్తారు. వ్యాపార విస్తరణకు అవరోధాలు కలుగుతాయి. నిరుద్యోగ ప్రయత్నాలు కొంత అనుకూలంగా సాగుతాయి. చిన్ననాటి మిత్రులతో విందు వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు.

కన్య: చేపట్టిన పనులలో ఒత్తిడి అధికమైన సకాలంలో పూర్తిచేస్తారు. విద్యార్థులు పోటీ పరీక్షలలో విజయం సాధిస్తారు. దైవ సేవా కార్యక్రమాల పట్ల ఆసక్తి పెరుగుతుంది. వ్యాపారాలు లాభాలబాటలో సాగుతాయి. ఇతరులకు ధన పరంగా మాట ఇచ్చే విషయంలో కొంత ఆలోచించి ముందుకు సాగడం మంచిది.

తుల: నూతన వ్యాపార ప్రారంభానికి అవరోధాలు కలుగుతాయి. సోదరులతో స్థిరాస్తి వివాదాలు కలుగుతాయి. ఇంటా బయట మీ మాటకు విలువ తగ్గుతుంది. జీవిత భాగస్వామితో దైవ దర్శనాలు చేసుకుంటారు. వ్యాపార వ్యవహారాలు కొంత నిదానంగా సాగుతాయి. వృత్తి ఉద్యోగాలలో మరింత అప్రమత్తంగా వ్యవహరించాలి.

వృశ్చికం: ఆర్థిక పరిస్థితి గందరగోళంగా ఉంటుంది. వృధా ఖర్చులు విషయంలో కొంత జాగ్రత్తగా వ్యవహరించాలి. నేత్ర సంబంధిత అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. ఉద్యోగాలలో అధికారులతో చర్చలు అనుకూలించవు. నిరుద్యోగ ప్రయత్నాలు కొంత మందకొడిగా సాగుతాయి.

ధనస్సు: కుటుంబ సభ్యుల నుండి ఆశించిన ధన సహాయం అందుతుంది. నిరుద్యోగులు పెద్దల అనుగ్రహంతో నూతన అవకాశాలు పొందుతారు. దూర ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి. వృత్తి ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి. వ్యాపారములను విస్తరించి లాభాలు అందుకుంటారు.

మకరం: వృత్తి ఉద్యోగాలలో అధికారులతో సమస్యలు చికాకు పరుస్తాయి. ధన పరంగా ఒడిదుడుకులు అదిగమిస్తారు. దీర్ఘకాలిక ఋణ ఒత్తిడి పెరుగుతుంది. దూర ప్రయాణాలు వాయిదా పడతాయి. దైవ సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. సంతాన విద్యా ఉద్యోగ ప్రయత్నాలు నిరుత్సాహపరుస్తాయి.

కుంభం: వృత్తి వ్యాపారాలు కొంత అనుకూలంగా సాగుతాయి. రాజకీయ ప్రముఖుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. చిన్ననాటి మిత్రుల నుండి అవసరానికి ధన సహాయం అందుతుంది. చేపట్టిన పనులు సకాలంలో పూర్తవుతాయి. వృత్తి ఉద్యోగమున ఆశించిన స్థాన చలనాలుంటాయి.

మీనం: ముఖ్యమైన వ్యవహారాలు శ్రమతో పూర్తి చేస్తారు. నిరుద్యోగులకు లభించిన అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి. దూర ప్రయాణాలలో తొందరపాటు మంచిది కాదు. వృత్తి వ్యాపారాల్లో స్వంత ఆలోచనలు అమలుచేస్తారు. ఉద్యోగమున సహోద్యోగులతో వివాదాలకు దూరంగా ఉండాలి. ఆర్థిక పరిస్థితి కొంత అనుకూలిస్తుంది.

# మూసీ మొదటి దశకు ఆమోదం

మొదటి పేజీ తరువాయి

మరియు మధ్యాహ్న భోజనం అందించనున్నారు. విద్యావ్యవస్థలో రాత్రింబగళ్లు శ్రమించే సిబ్బంది సంక్షేమానికి ఈ నిర్ణయం ఎంతగానో దోహదపడుతుందని మంత్రులు పేర్కొన్నారు.

రాష్ట్రంలో వైద్య రంగాన్ని మరింత బలోపేతం చేస్తూ నిరుద్యోగులకు కేబినెట్ తీపి కబురు అందించింది. కొత్తగా అందుబాటులోకి రానున్న సనత్‌నగర్, ఎల్‌బీ నగర్, అల్వాల్ టిమ్స్ ఆసుపత్రులతో పాటు వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఏకంగా 6,278 ఉద్యోగాల భర్తీకి ఆమోదం తెలిపింది. ఈ నాలుగు ఆసుపత్రులను హైదరాబాద్‌లోని నిమ్స్ తరహాలోనే అత్యున్నత ప్రమాణాలతో, కార్పొరేట్ స్థాయి వసతులతో అభివృద్ధి చేయాలని సర్కారు నిర్ణయించింది. అంతేకాకుండా, ఈ ఆసుపత్రుల్లో పేదలు పొందే వైద్య సేవలకు ఇకపై ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఎల్‌ఓసీ లను సైతం వర్తింపజేయాలని నిర్ణయించడం గమనార్హం.

హైదరాబాద్ నగర రూపురేఖలను మార్చే ప్రతిష్టాత్మక మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టు ఫేజ్-1 పనులకు కేబినెట్ పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. మూసీ సుందరీకరణ కోసం కేంద్ర రక్షణ శాఖ తమ ఆధీనంలో ఉన్న భూములను ఇచ్చేందుకు అంగీకరించిన నేపథ్యంలో ప్రాజెక్టు పనులకు మార్గం సుగమమైంది. గాంధీ సరోవర్ వరకు 21 కిలోమీటర్ల మేర చేపట్టే ఈ మొదటి దశ అభివృద్ధి పనుల కోసం ఏకంగా రూ. 7,345 కోట్లు కేటాయించారు. ఇందుకు సంబంధించి త్వరలోనే టెండర్ల ప్రక్రియను ప్రారంభించి, పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

పేదలకు ఉపాధి భద్రత కల్పించే లక్ష్యంతో 2006లో అప్పటి యూపీఏ ప్రభుత్వం తెచ్చిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం స్థానంలో.. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వీబీజీ రామ్‌జీ పథకంపై న్యాయపోరాటం చేయాలని కేబినెట్ ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈ పథకంపై గతంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నేతృత్వంలో ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం నివేదికపై కేబినెట్ సుదీర్ఘంగా చర్చించింది. ఈ పథకం పేదల హక్కులను హరించేలా ఉందంటూ గతంలోనే రాష్ట్ర శాసనసభ ఏకగ్రీవ తీర్మానం చేసినా కేంద్రం



పట్టించుకోలేదు. అందుకే దీనిపై సుప్రీంకోర్టును ఆశ్రయించాలని భావిస్తున్నారు. అయితే, కోర్టు తీర్పు వచ్చేలోగా గ్రామీణ కూలీలకు నష్టం జరగకూడదనే ఉద్దేశంతో, ప్రస్తుతానికి అనివార్య పరిస్థితుల నేపథ్యంలో ఈ పథకాన్ని రాష్ట్రంలో అమలు చేయాలని నిర్ణయించారు.

ఇదిలా ఉండగా, ఈ ప్రతిష్టాత్మక మంత్రిమండలి సమావేశానికి దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఉద్దేశపూర్వకంగానే గైర్హాజరు కావడం సచివాలయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. విదేశీ పర్యటన ముగించుకుని బుధవారమే నగరానికి వచ్చినప్పటికీ ఆమె కేబినెట్ భేటీకి దూరంగా ఉన్నారు. తన శాఖ పరిధిలోని అత్యంత కీలకమైన యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ బోర్డు ఏర్పాటు విషయంలో తనను కనీసం సంప్రదించలేదన్న తీవ్ర అసంతృప్తితోనే ఆమె ఈ సమావేశానికి డుమ్మా కొట్టినట్లు సచివాలయ వర్గాల్లో బలంగా ప్రచారం జరుగుతోంది.

## బుల్లెట్ ప్రూఫ్ వాహనాలు తొలగింపు!

మొదటి పేజీ తరువాయి

శ్రీనివాస్ రెడ్డి, నవీన్ ఛంద్, డానియల్, వెంకట్రామిరెడ్డి, స్టీఫెన్ రవీంద్ర, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్. డీటీ నాయక్, ఉమేష్ షరీఫ్, రవి గుప్తా, ఇంటెలిజెన్స్ చీఫ్ విజయకుమార్, హైదరాబాద్ పోలీస్ కమిషనర్లకు బుల్లెట్ ప్రూఫ్ వాహనాలను పోలీస్ శాఖ తీసివేసింది.

మాజీ డీజీపీలకు ఉన్న ఎస్కార్ట్ వాహనాలను సైతం తీసివేసింది. పలువురు రాజకీయ నేతలతోపాటు పోలీసు అధికారులకు ఉన్న గన్ మెన్ల సంఖ్య తగ్గించిన పోలీస్ శాఖ చాలావరకు వన్ ప్లస్ వన్ గన్ మెన్‌లకే పరిమితం చేసింది.




## సవాల్ చేసి తోకముడిచారు

మొదటి పేజీ తరువాయి

కూడా చేనేత కార్మికుల జీవనోపాధిని కాపాడాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా ప్రభుత్వం వాటిని అమలు చేయలేదని విమర్శించారు. లిడ్‌క్యాప్, టెస్కో వంటి ప్రభుత్వ సంస్థలకు రావాల్సిన ఆర్డర్లను ప్రైవేటు సంస్థలకు మళ్లించడం వల్ల దళితులు, చేనేత కార్మికులు తీవ్రంగా నష్టపోయారని హరీశ్‌రావు పేర్కొన్నారు. సంబంధిత సంస్థలు ప్రభుత్వానికి పలుమార్లు లేఖలు రాసినా స్పందన రాలేదని, చివరకు న్యాయం కోసం హైకోర్టును ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం ప్రజల ప్రయోజనాల కంటే కాంట్రాక్టర్ల ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తోందని ఆరోపించారు.

## ఓ డిఎస్పీ అక్రమాస్తుల విలువ 200 కోట్ల పైనే

మొదటి పేజీ తరువాయి

వస్తువులు, 23 విదేశీ మద్యం బాటిళ్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇబ్రహీంబాగ్‌లోని వెస్పెల్లా మెడోస్‌లో విల్లా, టెలికాంనగర్‌లో జీప్లస్2 పెంట్‌హౌస్‌తో ఇల్లు, ఒక ప్లాట్, గచ్చిబౌలిలో ఒక ప్లాట్, మణికొండలో 500 గజాల 5 కమర్షియల్ కాంప్లెక్స్‌లో వాటా, 3,000 చదరపు అడుగుల కమర్షియల్ స్పేస్‌లను గుర్తించారు. తెల్లాపూర్‌లో రెండు ప్లాట్లు, ప్రగతి రిసార్ట్స్ సమీపంలో 500 గజాల ప్లాట్, సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో 3.5 ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నట్లు తేల్చారు. కర్ణాటకలో పెద్ద ఎత్తున వ్యవసాయ భూములు ఉన్నట్లు గుర్తించారు. వేర్వేరు చోట్ల దాదాపు 45 ఎకరాలు ఉన్నట్లు పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. నాగోల్ కామినేని ఆస్పత్రి సమీపంలో 200 గజాల ప్లాట్, పటాన్‌చెరు జీపీఆర్ హౌసింగ్ సొసైటీ సమీపంలో 400 గజాల ప్లాట్, పటాన్‌చెరులో మరో 200 గజాల ప్లాట్, వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట్‌లో 1,000 గజాల స్థలం, 2 ఎకరాల వ్యవసాయ భూమి, శ్రీరాఘవేంద్ర రాక్‌శాండ్ మినరల్స్‌లో రూ.75 లక్షల పెట్టుబడి, వికారాబాద్ జిల్లాలో 4.20 ఎకరాల వ్యవసాయ భూమి గుర్తించారు. డీఎస్పీ బ్యాంకు ఖాతాల్లో రూ.19.91 లక్షల నిల్వలు ఉన్నట్లు ఏసీబీ అధికారులు తేల్చారు. ఆయనపై అక్రమాస్తుల కేసు నమోదు చేశారు. ఆయన తన చట్టబద్ధమైన ఆదాయ వనరులకు మించి అవినీతి, అక్రమ మార్గాల ద్వారా భారీగా ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలతో

అవినీతి నిరోధక చట్టం కింద ఈ చర్యలు తీసుకున్నారు. ఈ ఆస్తుల యొక్క అసలు మార్కెట్ విలువ డాక్యుమెంట్లలో చూపిన దానికంటే చాలా రెట్లు ఎక్కువగా ఉండే అవకాశం ఉందని ఏసీబీ అధికారులు వెల్లడించారు. అలాగే, సోదాల సమయంలో సదరు అధికారి నివాసంలో 23 విదేశీ మద్యం బాటిళ్లను కూడా అధికారులు గుర్తించి, ఎక్సైజ్ శాఖకు సమాచారం అందించారు. భీమ్ రెడ్డికి సంబంధించి ఇంకా అదనంగా ఉన్న ఆస్తులపై ప్రస్తుతం ధృవీకరణ పక్రియ , కేసు విచారణ కొనసాగుతోంది.

## జులై 20లోపు నీట్-యూజీ రీ-ఎగ్జామ్ ఫలితాలు

మొదటి పేజీ తరువాయి

ఖచ్చితమైన తేదీని మాత్రం ఇంకా ప్రకటించలేదు. రీ-ఎగ్జామ్ అనంతరం జూన్ 25న ఎన్‌టీఏ ప్రొవిజనల్ ఆన్సర్ కీని విడుదల చేసింది. అభ్యర్థులు తమ అభ్యంతరాలను జూన్ 28 వరకు నమోదు చేసుకునే అవకాశం కల్పించింది. ఈ సందర్భ ంగా దేశవ్యాప్తంగా దాదాపు 10 వేల అభ్యంతరాలు వచ్చినట్లు అధికా రులు వెల్లడించారు. ప్రతి అభ్యంతరాన్ని నిపుణుల కమిటీ విడివిడిగా పరిశీలించి తుది నిర్ణయం తీసుకోనుందని తెలిపారు. ప్రతి ప్రశ్నపై అభ్యంతరం నమోదు చేయడానికి రూ.200 ఫీజు నిర్ణయించినట్లు ఎన్‌టీఏ పేర్కొంది. అభ్యర్థి చేసిన అభ్యంతరం సరైందని తేలితే చెల్లించిన ఫీజును తిరిగి చెల్లిస్తామని వెల్లడించింది. నిపుణుల పరిశీలన పూర్తైన అనంతరం తుది ఆన్సర్ కీని విడుదల చేసి, దాని ఆధారంగానే ఫలితాలను ప్రకటించనున్నట్లు అధికారులు తెలిపారు. ఫలితాలు వెలువడిన వెంటనే మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ (ఎంసీసీ) దేశవ్యాప్తంగా 15 శాతం ఆల్ ఇండియా కోటా సీట్లతో పాటు ఎయిమ్స్, జిప్‌మర్, కేంద్ర విశ్వవిద్యాలయాలు, డీమ్డ్ విశ్వవిద్యాలయాల కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను విడుదల చేయనుంది. అనంతరం ఆయా రాష్ట్రాలు తమ పరిధిలోని 85 శాతం రాష్ట్ర



కోటా సీట్లకు ప్రత్యేకంగా కౌన్సెలింగ్ నిర్వహించనున్నాయి. ఎంబీబీఎస్ ప్రవేశ ప్రక్రియలో ఎలాంటి జాప్యం ఉండదని ఎన్‌టీఏ స్పష్టం చేసింది. కౌన్సెలింగ్ ప్రక్రియను వేగంగా పూర్తి చేసి గత ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా తొలి సంవత్సరం ఎంబీబీఎస్ తరగతులను నిర్ణీత సమ యంలో ప్రారంభిం చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. విద్యార్థులు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని సూచించారు. ఎగ్జామ్‌కు హాజరైన విద్యార్థులు ఫలితాల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తుది ఆన్సర్ కీ, ఫలితాల విడుదల అనంతరం ప్రవేశాల ప్రక్రియ ప్రారంభం కానుండటంతో వైద్య విద్యలో చేరాలనుకునే వేలాది మంది అభ్యర్థులకు ఈ ఫలితాలు కీలకంగా మారనున్నాయి.



## యూజర్‌నేమ్ ఫీచర్‌పై వాట్సప్ స్పష్టత

మొదటి పేజీ తరువాయి

సంస్థలు, మెటా ధ్రువీకరించిన ఖాతాలకు సంబంధించిన కొన్ని పేర్లను ముందుగానే రిజర్వ్ చేసినట్లు సంస్థ వెల్లడించింది. అలాంటి సందర్భాల్లో ప్రత్యామ్నాయ పేర్లను సూచించే యూజర్‌నేమ్ జనరేటర్ సదుపాయాన్ని కూడా అందించనున్నట్లు తెలిపింది.

**మోసాలను అడ్డుకునేందుకు అదనపు భద్రత**

యూజర్‌నేమ్‌లను ఉపయోగించి మోసాలకు పాల్పడే అవకాశం ఉందన్న ఆందోళనలపై వాట్సప్ స్పందించింది. కొత్త వ్యక్తి నుంచి సందేశం వస్తే అది ఏ దేశం నుంచి వచ్చిందో చూపిస్తామని, మొదటిసారి హెచ్చరిక సందేశం కూడా ప్రదర్శిస్తామని పేర్కొంది. అలాగే బ్లాక్, రిపోర్ట్ వంటి భద్రతా సదుపాయాలు యథాతథంగా కొనసాగుతాయని తెలిపింది.

**యూజర్‌నేమ్‌ను సెర్చ్ చేయలేరు**

ప్రస్తుతం వాట్సప్‌లో మొబైల్ నంబర్లను సెర్చ్ చేయలేని విధంగానే, భవిష్యత్తులో యూజర్‌నేమ్‌లను కూడా నేరుగా సెర్చ్ చేసే అవకాశం ఉండదని సంస్థ స్పష్టం చేసింది. అపరిచితులు సులభంగా గుర్తించకుండా ఉండేందుకు ప్రత్యేకమైన యూజర్‌నేమ్‌ను ఎంచుకోవాలని సూచించింది.

**'యూజర్‌నేమ్ కీ'తో మరింత భద్రత**

యూజర్‌నేమ్‌తో పాటు అదనపు రక్షణ కోసం యూజర్‌నేమ్ కీ అనే భద్రతా ఫీచర్‌ను కూడా ప్రవేశపెడుతోంది. దీనిని ఎనేబుల్ చేస్తే కొత్త వ్యక్తి సంప్రదించాలంటే యూజర్‌నేమ్‌తో పాటు ఆ కీ కూడా అవసరం అవుతుంది. అవసరమైతే ఆ కీని రీసెట్ చేసుకునే అవకాశం కూడా ఉంటుంది.

**మెటా ఖాతాల లింకింగ్ ఐచ్ఛికమే**

ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లో ఉన్న అదే యూజర్‌నేమ్‌ను వాట్సప్‌లో కూడా ఉపయోగించాలనుకునే వారు తమ ఖాతాలను లింక్ చేయాల్సి ఉంటుంది. దీంతో ఆ ఖాతాకు తామే అసలు యజమానులని నిర్ధారించుకోవచ్చని సంస్థ తెలిపింది. అవసరమైతే తర్వాత అన్‌లింక్ చేసుకునే అవకాశం కూడా ఉంటుంది.

**కేంద్రం ఆందోళన**

ఈ ఫీచర్ వల్ల ప్రముఖ సంస్థలు, వ్యక్తులను పోలిన పేర్లతో నకిలీ ఖాతాలు సృష్టించి అమాయకులను మోసం చేసే ప్రమాదం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం మెటాకు నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. సైబర్ నేరాల ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకుని, ఐటీ చట్టం ప్రకారం ఎందుకు చర్యలు తీసుకోకూడదో వివరణ ఇవ్వాలని కోరినట్లు కథనాలు వెల్లడించాయి. అలాగే సమగ్ర పరిశీలన పూర్తయ్యే వరకు భారత్‌లో ఈ ఫీచర్‌ను అమలు చేయవద్దని సూచించినట్లు సమాచారం.

# లక్ష ఇళ్లకు త్వరలో టెండర్లు!




### గోషామహల్ పరిధిలో ఇళ్ల పట్టాలు పంపిణీ చేసిన మంత్రులు

### పేదలున్న చోటే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం: మంత్రి పొంగులేటి

**హైదరాబాద్, జూలై 02:** క్యూర్ పరిధిలోని ఇన్నర్ రింగ్ రోడ్ ప్రాంతంలో లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే టెండర్లు పిలవనుందని గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు మూడు కార్పొరేషన్ల పరిధిలో ఇందుకు అవసరమైన స్థల సేకరణ మరో రెండు మూడు రోజుల్లో పూర్తి కానుందని వెల్లడించారు. గోషామహల్ నియోజకవర్గంలో లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, మహ్మద్ అజారుద్దీన్, అడ్లూరి లక్ష్మణ్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, స్థానికఎమ్మెల్యే రాజాసింగ్ తదితరులతో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి పేద కుటుంబానికి సొంతిల్లు అందించాలనే లక్ష్యంతో ముందుకెళ్తోందన్నారు. ఇందులో భాగంగానే క్యూర్ పరిధిలోని 19 నియోజకవర్గాల్లో పైలట్ ప్రాజెక్ట్ కింద కనీసం 500 నుంచి 1000 ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభిస్తామని, ఆ తర్వాత దశలవారీగా మరిన్ని మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికే నియోజకవర్గానికి 5,500 చొప్పున ఇళ్లు కేటాయించామని, పట్టణ ప్రాంతాల్లో ఎకరా భూమి విలువ రూ.100 నుంచి రూ.200 కోట్లు ఉన్నప్పటికీ వెనకాడకుండా పేదలకు వారున్న ప్రాంతాల్లోనే ఇళ్లు నిర్మించి పట్టాలు ఇస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. గత ప్రభుత్వాల్లాగా పేదలను నగరానికి 30 కిలోమీటర్ల దూరం తరలించకుండా, వారి ఉపాధికి దగ్గరగా, అదే నియోజకవర్గ పరిధిలో ఇళ్లు కట్టించి ఇవ్వడమే కాంగ్రెస్ ప్రభుత్వ విధానమన్నారు. ధూల్‌పేటలో గత ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా ఆగిపోయిన 125 ఇళ్ల నిర్మాణాన్ని పూర్తిచేసి అర్హులకు అందిస్తున్నామని, మిగిలిన పేదలకు కూడా ఇళ్లు మంజూరు చేసేలా పరిసర ప్రాంతాల్లో స్థలాలను గుర్తించాలని కలెక్టర్‌ను ఆదేశించినట్లు పొంగులేటి వివరించారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నిర్మించిన ఇళ్ల కంటే తమ కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం రెండున్నరేళ్లలోనే ఎక్కువ ఇళ్లు నిర్మించి చూపిస్తుందని మంత్రి సవాల్ విసిరారు. ఇది సాధ్యం కాకపోతే తాను రానున్న ఎన్నికల్లో పోటీ చేయనని ఛాలెంజ్ చేసినా బీఆర్ఎస్ నేతల నుంచి ఇప్పటికీ ఎలాంటి స్పందనా రాలేదని ఎద్దేవా చేశారు. పేదల ఇళ్ల నిర్మాణంలో తమకు ఎలాంటి ప్రయోజనం ఉండదన్న ఉద్దేశంతోనే బీఆర్ఎస్ ప్రభుత్వం భారీ ప్రాజెక్టుల పేరుతో అవినీతికి పాల్పడిందని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఆ నిధులను ప్రజల సంక్షేమం కోసమే వెచ్చించి, ఇందిరమ్మ ఇళ్ల ద్వారా గుడిసెల్లేని తెలంగాణ లక్ష్యాన్ని సాధించి తీరుతుందని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.



### 'సర్' పోస్టర్, ఉపాధి హామీ బ్రోచర్‌ను ఆవిష్కరించిన మంత్రి దుర్గేష్

**నిడదవోలు, జూలై 02:** ఉండ్రాజవరం మండలం తాడిపర్రులో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ గురువారం పర్యటించి, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (SIR-2026) అవగాహన పోస్టర్‌తో పాటు, ఉపాధి హామీ రోజులను 125 రోజులకు పెంచుతూ రూపొందించిన నూతన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఓటు అనేది ప్రతి ఒక్కరి భవిష్యత్తును మార్చే శక్తివంతమైన ఆయుధమని, జులై 14లోగా ముగిసే ఈ సమగ్ర సవరణ ప్రక్రియలో 18 ఏళ్లు నిండిన అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకుని, జాబితా సవరణకు బూత్ లెవెల్ అధికారులకు (BLO) సహకరించాలని పిలుపునిచ్చారు. అలాగే కేంద్ర, రాష్ట్ర కూటమి ప్రభుత్వాల చొరవతో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన "వీబీ జీరాంజీ" (VB-GRAMJI) చట్టం ద్వారా ఉపాధి హామీ పనిదినాలను 100 రోజుల నుండి 125 రోజులకు పెంచడం జరిగిందని, సమయానికి కూలీ చెల్లింపులు, ఆలస్యమైతే పరిహారం వంటి ఎన్నో ప్రయోజనాలు ఉన్న ఈ నూతన విధానం గ్రామీణ నిరుపేదలకు ఒక వరమని కొనియాడారు; అనంతరం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ల సంయుక్త నాయకత్వాన్ని శ్లాఘిస్తూ ఆయన నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఏవియేషన్ హబ్‌గా ఏపీ అభివృద్ధి





### బనగానపల్లెకు రూ.6.95 కోట్ల సీఎస్ఆర్ నిధుల ప్రతిపాదన

### ఢిల్లీ, హర్యానాల్లో మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి పర్యటన

**అమరావతి, జూలై 02:** రాష్ట్రంలో ఏవియేషన్ రంగ అభివృద్ధి, కొత్త ఎయిర్‌పోర్టుల ఏర్పాటుపై పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి.. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడుతో ఢిల్లీలో భేటీ అయ్యారు. ప్రతి 150 కిలోమీటర్ల పరిధిలో ఒక ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేయాలనే వ్యూహాత్మక లక్ష్యంతో, రాబోయే 20 ఏళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రాన్ని ఏవియేషన్ హబ్‌గా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఏవియేషన్ కార్యాచరణ ప్రణాళిక, పెండింగ్ అనుమతుల క్లియరెన్స్, సీ ప్లేన్ కార్యకలాపాల కోసం 10 ప్రాంతాల్లో వాటర్ ఏరోడ్రోమ్ ప్రాజెక్టులు, హెలిపోర్టుల అభివృద్ధి, పుట్టపర్తి సమీపంలో ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ కోసం ప్రత్యేక ఎయిర్‌స్పేస్ ఏర్పాటు వంటి పలు కీలక అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ చర్చల్లో ఆర్అండ్‌బీ, ఐఅండ్ఐ స్పెషల్ చీఫ సెక్రటరీ ఎం.టీ. కృష్ణబాబు, మారిటైమ్ బోర్డు సీఈవో ప్రవీణాదిత్య తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. మరో పర్యటనలో భాగంగా, హర్యానాలోని గురుగ్రామ్‌లో ఉన్న పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ప్రధాన కార్యాలయంలో ఆ సంస్థ చైర్మన్ ఉమేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) బుర్రా వంశీ రామమోహన్‌ను మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. నంద్యాల జిల్లా బనగానపల్లె నియోజకవర్గ పరిధిలోని కొలిమిగుండ్ల మండలం నందిపాడులో జరుగుతున్న హై వోల్టేజ్ ట్రాన్స్‌మిషన్ లైన్స్ ప్రాజెక్టును ప్రస్తావిస్తూ, ఈ ప్రాంత అభివృద్ధికి కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కింద రూ.6.95 కోట్ల నిధులు మంజూరు చేయాలని కోరారు. ఇందులో వర్షాకాలంలో ముంపునకు గురవుతున్న జుర్రేరు వాగు సురీకరణ, వరద నివారణ రిటైనింగ్ వాల్ నిర్మాణానికి రూ.4.95 కోట్లు, అలాగే బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు ఆధునిక వైద్య పరికరాల కోసం రూ.2 కోట్లు కేటాయించాలని విజ్ఞప్తి చేయగా, సీఎండీ సానుకూలంగా స్పందించి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

# శ్రీసిటీలో వర్క్ స్టడీ మోడల్ యూనివర్సిటీ

### ప్రారంభించిన మంత్రి నారా లోకేష్




శ్రీసిటీ (తిరుపతి), జూలై 02: విద్యార్థులు చదువుకుంటూనే పరిశ్రమల్లో పనిచేస్తూ నైపుణ్యాలు, ఉద్యోగ అనుభవంతో పాటు ఆదాయం కూడా పొందే వర్క్--స్టడీ డ్యుయల్ మోడల్ ఆధారంగా ఏర్పాటు చేయడాన్ని మంత్రి నారా లోకేష్ ప్రశంసించారు. శ్రీసిటీ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ (ఎస్ఐయూ)ను గురువారం మంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐయూ గ్లోబల్ అడ్వైజరీ కౌన్సిల్ సభ్యులు, గవర్నింగ్ బోర్డు ప్రతినిధులు, పరిశ్రమల భాగస్వాములు పాల్గొన్నారు. దేశంలో ప్రతి సంవత్సరం 90 లక్షల మందికి పైగా పట్టభద్రులు వివిధ విశ్వవిద్యాలయాల నుంచి బయటకు వస్తున్నప్పటికీ, వారిలో కేవలం 42.6 శాతం మంది మాత్రమే పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు కలిగి ఉన్నారని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయని, మిగిలిన వారిలో నైపుణ్యాల కొరత కారణంగా చాలామంది తమ అర్హతలకు తగ్గ ఉద్యోగాలు పొందలేకపోతున్నారని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ పరిస్థితిని మార్చేందుకు విద్యతో పాటు ఉద్యోగ అనుభవాన్ని అందించే విధంగా ఎస్ఐయూను రూపొందించినట్లు నిర్వాహకులు తెలిపారు. శ్రీసిటీ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ యూనివర్సిటీస్ చట్టం ప్రకారం సెక్షన్ 8 కంపెనీగా లాభాపేక్షలేని విద్యాసంస్థగా ఎస్ఐయూ ఏర్పాటైంది. ఈ వర్క్ స్టడీ విధానంలో విద్యార్థులు తమ విద్యా కాలంలో మూడోవంతు సమయం మాత్రమే క్యాంపస్‌లో చదువుకుని, మిగిలిన సమయంలో పరిశ్రమల్లో ఇంటర్న్‌షిప్‌లు చేస్తారు.

మొదటి సంవత్సరం నుంచే ప్రతి విద్యార్థికి కనీసం నెలకు రూ.10,000 స్టైపెండ్ అందించనుండగా, పనిలో నైపుణ్యం పెరిగే కొద్దీ పరిశ్రమలు స్టైపెండ్‌ను పెంచుతాయి. నాలుగేళ్ల డిగ్రీ పూర్తయ్యే సమయానికి విద్యార్థులు రెండేళ్లకు పైగా వాస్తవ ఉద్యోగ అనుభవం పొందేలా విద్యా ప్రణాళిక రూపొందించారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా కోర్సులను రూపొందిస్తూ, ప్రతి ఏడాది కృత్రిమ మేధ (ఏఐ), సాంకేతిక రంగాల్లో వస్తున్న మార్పులకు అనుగుణంగా పాఠ్యాంశాలను నవీకరిస్తామని యాజమాన్యం తెలిపింది. విద్యార్థుల్లో పారిశ్రామికవేత్తల ఆలోచనలను ప్రోత్సహించేందుకు క్యాంపస్‌లో స్టేషన్--ఎస్ పేరుతో ఇంక్యుబేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. జ్ఞాన్ సర్కిల్ వెంచర్స్ సహకారంతో ఇప్పటికే 10 స్టార్టప్‌లు కార్యకలాపాలు ప్రారంభించాయి. ఇక్కడ పరిశ్రమలకు అవసరమైన విద్యతో పాటు జీవన నైపుణ్యాలు, సృజనాత్మకతను కూడా పెంపొందిస్తారు. 2026--27 విద్యా సంవత్సరానికి బీటెక్--కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్, బీటెక్--అడ్వాన్స్‌డ్ మ్యాన్యుఫ్యాక్చరింగ్, బీబీఏ--ఫైనాన్స్ అండ్ అకౌంట్స్, బీబీఏ--డిజిటల్ మీడియా అండ్ కమ్యూనికేషన్స్ కోర్సుల్లో ప్రవేశాలు ప్రారంభమైనట్లు యాజమాన్యం ప్రకటించింది. ప్రవేశాల కోసం www.thesiu.org వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించింది.

మీరిచ్చే ప్రతి పైసా..
ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.

# 'మావిగన్'తో వైసీపీ భూస్థాపితం ఖాయం

### మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డోలా బాల వీరాంజనేయస్వామి ధ్వజం

అమరావతి/ఒంగోలు, జూలై 02: ఆంధ్రుల కలల రాజధాని అమరావతిపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కక్ష కట్టారని రాష్ట్ర ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తీవ్రస్థాయిలో విమర్శించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, గతంలో అమరావతి రాజధానికి అసెంబ్లీ సాక్షిగా అంగీకారం తెలిపిన జగన్, అధికారంలోకి వచ్చాక మూడు రాజధానుల పేరుతో కాలయాపన చేసి రాష్ట్ర భవిష్యత్తును దెబ్బతీశారని మండిపడ్డారు. ఐదేళ్లలో మూడు ప్రాంతాల్లో ఒక్క ఇటుక కూడా వేయకుండా తన కోసం మాత్రం రూ.450 కోట్లతో ప్యాలెస్ నిర్మించుకున్నారని ఆరోపించారు. మూడు రాజధానుల ప్రతిపాదనను తిరస్కరించి ప్రజలు వైసీపీని 11 స్థానాలకే పరిమితం చేసినా జగన్‌కు బుద్ధి రాలేదని, ఇప్పుడు మళ్లీ 'మావిగన్' పేరుతో చేస్తున్న వ్యాఖ్యల వల్ల ఆ పార్టీ పూర్తిగా భూస్థాపితం కావడం ఖాయమని మంత్రి గొట్టిపాటి హెచ్చరించారు. మరోవైపు ఒంగోలులో జరిగిన మీడియా సమావేశంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ.. రాజధాని అమరావతి అంశంపై జగన్ తరచూ మాటలు మారుస్తూ మారీచుడిలా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. జగన్ రాజకీయ ఎజెండా మోసం చేయడం, ఆచరణలో ప్రజలను వంచించడమేనని విమర్శించారు. ఒకప్పుడు మూడు రాజధానులంటూ గందరగోళం సృష్టించి, ఇప్పుడు 'మావిగన్' పేరుతో కొత్త నినాదాన్ని తీసుకురావడం చూసి చిన్నపిల్లలు సైతం నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. పార్లమెంట్ ఆమోదంతో పాటు కేంద్ర గెజిట్ నోటిఫికేషన్ పొందిన అమరావతి విషయంలో కూటమి ప్రభుత్వం స్పష్టమైన వైఖరితో ఉంటూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి నేతృత్వంలో నిర్మాణ పనులను వేగవంతం చేస్తోందని మంత్రులు ఇద్దరూ స్పష్టం చేశారు.

# రిచ్ డాడ్' జీవితాన్ని మార్చిన భారతీయ గురువు

ప్రపంచవ్యాప్తంగా అత్యధికంగా చదివే పర్సనల్ ఫైనాన్స్ పుస్తకాలలో ఒకటైన 'రిచ్ డాడ్ పూర్ డాడ్' రచయిత రాబర్ట్ కియోసాకి మరోసారి తన ఆలోచనలతో చర్చనీయాంశంగా మారారు. డబ్బు సంపాదించడమే జీవిత పరమావధి కాదని, ప్రతి వ్యక్తి తన జీవితం అసలు ఉద్దేశాన్ని గుర్తించి దాని కోసం పనిచేయాలని ఆయన సూచించారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో చేసిన పోస్టు వైరల్‌గా మారింది. కొన్నేళ్ల క్రితం ఓ భారతీయ గురువు చెప్పిన మాట తన జీవితాన్ని పూర్తిగా మార్చిందని కియోసాకి వెల్లడించారు. "మీ శరీరం లక్ష్యం.. మీ ఆత్మ లక్ష్యాన్ని నెరవేర్చడమే" అనే ఆ బోధ అప్పట్లో తనకు పూర్తిగా అర్థం కాలేదని, ఆ సమయంలో తాను కేవలం డబ్బు



## వ్యవసాయ భూమి నుంచి వస్తుండగా ట్రాక్టర్ ఢీకొని రిటైర్డ్ పోస్టుమాస్టర్ మృతి

**సూర్యాపేట, జూలై 2**

సూర్యాపేట జిల్లా సూర్యాపేట నియోజకవర్గంలోని పెన్‌పహాడ్ మండలం చీదేళ్ల గ్రామంలో శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ పోస్టుమాస్టర్ కన్మంతరెడ్డి కృపాకర్ రెడ్డి (70) దుర్మరణం పాలయ్యారు. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. కృపాకర్ రెడ్డి వ్యవసాయ భూమి నుంచి సైకిల్‌పై ఇంటికి తిరిగి వస్తుండగా, సాయంత్రం సుమారు 4.50 గంటల సమయంలో అదే గ్రామానికి చెందిన వెన్న గోపిరెడ్డికి చెందిన ట్రాక్టర్‌ను డ్రైవర్ రాంబాబు అతివేగంగా, నిర్లక్ష్యంగా నడుపుతూ వెనుక నుంచి బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కృపాకర్ రెడ్డి కిందపడగా, ట్రాక్టర్ చక్రం ఆయన తలపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



## నూతన కోర్టు భవన నిర్మాణ పనులు వేగవంతం చేయాలి: సీనియర్ సివిల్ జడ్జి కే. సురేష్

**కోదాడ, జూలై 2**

కోదాడ పట్టణంలో నిర్మాణంలో ఉన్న నూతన నాలుగు కోర్టుల సముదాయం (కోర్టు కాంప్లెక్స్) భవన నిర్మాణ పనులను సీనియర్ సివిల్ జడ్జి కే. సురేష్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతి, కోర్టు హాళ్లు, న్యాయమూర్తుల చాంబర్లు, కార్యాలయ గదులు, ఇతర మౌలిక సదుపాయాల ఏర్పాటును ఆయన పరిశీలించి, పనుల నాణ్యతపై గుత్తేదారుకు పలు సూచనలు చేశారు. నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులోగా పూర్తి చేసి త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో కోదాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి, దేవబత్తిని నాగార్జున, ఉపాధ్యక్షుడు గట్ల నరసింహారావు, కార్యదర్శి రామకృష్ణ, రంజాన్ పాషా, రంగారావు, పెద్దబ్బాయి, కె.వి. రావు తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్ల పునర్వ్యవస్థీకరణ వేగవంతం చేయాలి: డీజీపీ సీవీ ఆనంద్

**హైదరాబాద్, జూలై 2**

హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి, ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ల పరిధిలో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న పోలీస్ స్టేషన్ల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) సీవీ ఆనంద్ అధికారులను ఆదేశించారు. గత ఏడాది డిసెంబరులో ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులకు అనుగుణంగా ఈ ప్రక్రియను పూర్తిచేయాలని సూచించారు. గురువారం జరిగిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పోలీస్ స్టేషన్ల పునర్వ్యవస్థీకరణ వల్ల ప్రజాకేంద్రిత, సమర్థవంతమైన పోలీసింగ్‌కు మరింత బలం చేకూరడంతో పాటు ప్రజలకు అందే పోలీసు సేవల నాణ్యత మెరుగుపడుతుందని పేర్కొన్నారు. మున్సిపల్ పరిమితులు, రెవెన్యూ డివిజన్లు, కోర్టుల అధికార పరిధులను పరిగణనలోకి తీసుకుని పోలీస్ స్టేషన్ల సరిహద్దులను పునర్నిర్వచించాలని కమిషనర్లకు ఆదేశించారు. భవిష్యత్‌లో నగర విస్తరణ, జనాభా పెరుగుదలను దృష్టిలో ఉంచుకుని ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. అలాగే ప్రజలు, ప్రభుత్వ శాఖలు, న్యాయవ్యవస్థకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సంబంధిత వర్గాలతో సంప్రదింపులు జరిపి పరిధి వివాదాలను పరిష్కరించాలని డీజీపీ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్, ఫ్యూచర్ సిటీ కమిషనర్ తరుణ్ జోషి, సైబరాబాద్ కమిషనర్ రమేష్ రెడ్డి, మల్కాజిగిరి కమిషనర్ సుమతి, సంయుక్త పోలీస్ కమిషనర్లు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలి

### బీసీ జేఏసీ పిలుపుతో మిర్యాలగూడలో కళాశాలల బంద్ విజయవంతం



**మిర్యాలగూడ, జూలై 2**

రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ జేఏసీ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు గురువారం మిర్యాలగూడ పట్టణంలో చేపట్టిన కళాశాలల బంద్ విజయవంతమైందని బీసీ జేఏసీ పట్టణ కన్వీనర్ బంటు వెంకటేశ్వర్లు ముదిరాజ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అధికారంలోకి రాకముందు బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పుడు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయకుండా పేద విద్యార్థుల చదువులకు ఆటంకం కలిగిస్తోందని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులు ఫీజులు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారని, పూర్తి ఫీజు చెల్లిస్తేనే ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇస్తామని కళాశాల యాజమాన్యాలు చెబుతున్నాయని అన్నారు. దీంతో విద్యార్థుల ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు తీవ్రంగా దెబ్బతింటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.10 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే, గతంలో అమలులో ఉన్న విధంగానే ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని కొనసాగించాలని, 10 వేల ర్యాంకు నిబంధనను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు యర్రబెల్లి దుర్గయ్య రజక, బీసీ మహిళా సంఘం జిల్లా కార్యదర్శి బంటు కవిత, బీసీ యువజన సంఘం పట్టణ నాయకులు ఎస్.పీ. నాయుడు, బీసీ విద్యార్థి సంఘం పట్టణ కార్యదర్శి నక్క నాగరాజు ముదిరాజ్, ఎస్సీ మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు చిత్రం ఉమా, ఎంఆర్‌పీఎస్ నాయకులు ఉబ్బపల్లి శంకర్, సిరి గణేష్, శాంతికుమార్తో పాటు శ్రీజ, శ్రీవల్లి, గాయత్రీ, సహస్ర, మానస, శ్రీవాణి, సిరి, సాయికుమార్, గౌతమ్, అశోక్ కుమార్, వెన్నెల, పావని, కరుణాశ్రీ తదితరులు పాల్గొన్నారు.

# పామాయిల్ తోటలతో రైతులకు సిరుల పంట

### వరిని వీడి పామాయిల్ సాగు వైపు మళ్లాలి: కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**సూర్యాపేట, జూలై 2**

రైతులు సంప్రదాయ వరి సాగుకు బదులుగా దీర్ఘకాలికంగా అధిక ఆదాయం అందించే పామాయిల్ సాగు వైపు అడుగులు వేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ పిలుపునిచ్చారు. సూర్యాపేట మండలం కాసరాబాద్ గ్రామంలో పామాయిల్ తోటలను గురువారం పరిశీలించిన ఆయన, పామాయిల్ సాగు చేస్తున్న రైతు ఆశబోయిన మల్లేష్‌తో మాట్లాడి సాగు వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పామాయిల్ రైతులకు స్థిరమైన ఆదాయాన్ని అందించే లాభసాటి పంటగా మారుతోందన్నారు. వరి సాగుతో పోలిస్తే పెట్టుబడి భారం తక్కువగా ఉండటంతో పాటు, ఒకసారి తోటను ఏర్పాటు చేస్తే నాలుగో సంవత్సరం నుంచి సుమారు 30--35 సంవత్సరాల పాటు ఆదాయం పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. పామాయిల్ సాగును ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి 70 నుంచి 90 శాతం వరకు సబ్సిడీ అందిస్తున్నాయని పేర్కొన్నారు. అదనంగా తోట నాటిన తొలి నాలుగు సంవత్సరాల వరకు ఎకరానికి రూ.4,200 చొప్పున పెట్టుబడి సహాయం కూడా ప్రభుత్వం అందజేస్తోందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పామాయిల్ మొక్కలు పూర్తిగా ఎదిగే తొలి మూడు సంవత్సరాల వరకు కోకో, వక్క, మిరియాలు, తమలపాకు వంటి అంతర పంటలను సాగు చేసి అదనపు ఆదాయం పొందవచ్చని కలెక్టర్ తెలిపారు. మూడున్నర నుంచి నాలుగు సంవత్సరాల తర్వాత పామాయిల్ దిగుబడి ప్రారంభమై రైతులకు ప్రధాన ఆదాయ వనరుగా మారుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణయ్య, జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి తీగల నాగయ్య, వ్యవసాయ అధికారి కృష్ణ సందీప్, వ్యవసాయ విస్తరణ అధికారి ముత్తయ్య, సూర్యాపేట డివిజన్ ఉద్యాన అధికారి కట్ట స్వాతి, ఉద్యాన విస్తరణ అధికారులు యారాల సుధాకర్ రెడ్డి, రంగు ముత్యం రాజు, వంగూరి అనిల్, ఆయిల్ ఫెడ్ జిల్లా కోఆర్డినేటర్ నిమ్మ గోపికృష్ణ, ఫీల్డ్ ఆఫీసర్ భవిష్యతో పాటు రైతులు వెదిరే లక్ష్మీనరసింహారెడ్డి, కిషన్ రెడ్డి, ఆశబోయిన మల్లేష్, బొమ్మగాని సైదులు, రామకృష్ణ, తన్నీరు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్‌కు దూరంగా ఉంటేనే యువతకు ఉజ్వల భవిష్యత్

### కెఆర్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాదకద్రవ్యాల నివారణపై అవగాహన సదస్సు



**కోదాడ, జూలై 2**

సమాజాన్ని మాదకద్రవ్యాల మహమ్మారి నుంచి కాపాడాలంటే యువతే ముందుండాలని, డ్రగ్స్‌కు దూరంగా ఉండటం ద్వారా ఆరోగ్యవంతమైన, బాధ్యతాయుతమైన జీవితాన్ని నిర్మించుకోవాలని కోదాడ పట్టణ సబ్ ఇన్‌స్పెక్టర్ బి. సుధీర్ కుమార్ పిలుపునిచ్చారు. కె.ఆర్.ఆర్. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ సేవా పథకం (ఎన్‌ఎస్‌ఎస్) విభాగం, కోదాడ పోలీసు శాఖ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం "మాదకద్రవ్యాల నివారణ"పై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి తెలుగు లెక్చరర్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ అధికారి వేముల వెంకటేశ్వర్లు స్వాగతం పలకగా, కళాశాల ప్రిన్సిపాల్ నారు రమణారెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్య వక్తగా పాల్గొన్న ఎస్ఐ బి. సుధీర్ కుమార్ మాట్లాడుతూ, మాదకద్రవ్యాల వినియోగం యువత ఆరోగ్యాన్ని దెబ్బతీయడమే కాకుండా మానసిక, ఆర్థిక, సామాజిక జీవితాలను కూడా నాశనం చేస్తుందని హెచ్చరించారు. చిన్న వయస్సులోనే డ్రగ్స్‌కు అలవాటు పడితే వ్యసనపరులుగా మారే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. డ్రగ్స్ విక్రయించినా, కొనుగోలు చేసినా, వినియోగించినా చట్టపరంగా నేరమని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుని జైలు శిక్ష విధిస్తారని స్పష్టం చేశారు. మాదకద్రవ్యాల రవాణా, వినియోగాన్ని అరికట్టడంలో ప్రతి యువకుడు సామాజిక బాధ్యతతో ముందుకు రావాలని సూచించారు. సదస్సు అనంతరం విద్యార్థులతో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించి, మాదకద్రవ్యాల నివారణపై అవగాహన కల్పించే పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పోలీసు డ్రగ్ కమిటీ సభ్యుడు హుస్సేన్ గౌడ్, కళాశాల డ్రగ్స్ కమిటీ సభ్యులు జి. నాగరాజు, ఆర్. పిచ్చిరెడ్డి, జి.యాదగిరి, వి.బాలభీమారావు, ఆర్. రమేష్, ఎం.రత్నకుమారి, బి.రమేష్, జి.వెంకన్న, కె. రామరాజు, జి. రవికిరణ్, కె. సతీష్, పి. తిరుమల, గోపీకృష్ణ, ఇ.నరసింహారెడ్డి, ఎస్.కె. ముస్తఫా, తిరుపతయ్య, ఎస్.కె.ఆరిఫ్, కె. శాంతయ్య, ఎన్. జ్యోతిలక్ష్మి, ఆర్.చంద్రశేఖర్, ఎస్. వెంకటేశ్వరచారి, టి. మమత, పోలీసు సిబ్బంది, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వైద్యుల సేవలు దైవసమానం: అదనపు డీసీపీ పి.వెంకటరమణ

### శాతవాహన లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్స్ డే, సీఏ డే, పోస్టల్ వర్కర్స్ డే, సేవా కార్యక్రమాలు







**కరీంనగర్, జూలై 1**

ప్రజారోగ్య పరిరక్షణలో నిబద్ధతతో సేవలందిస్తూ అనేక మంది ప్రాణాలను కాపాడుతున్న వైద్యులు దైవ స్వరూపులని కరీంనగర్ జిల్లా అదనపు డీసీపీ పి. వెంకటరమణ అన్నారు. జాతీయ డాక్టర్స్ డే సందర్భంగా శాతవాహన లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన డాక్టర్ల సన్మాన కార్యక్రమం, ఉచిత నోటి–గొంతు క్యాన్సర్ నిర్ధారణ శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాత్రింబవళ్లు రోగుల ప్రాణాలను కాపాడేందుకు శ్రమిస్తున్న వైద్యులు తమ వ్యక్తిగత, కుటుంబ జీవితాలకు కూడా సమయం కేటాయించలేని పరిస్థితి నెలకొంటోందని పేర్కొన్నారు. వారి ఆరోగ్య పరిరక్షణ బాధ్యతను కూడా సమాజం పంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గౌరవ అతిథి లయన్ డాక్టర్ ఎడవెల్లి విజయేందర్ రెడ్డి మాట్లాడుతూ, వైద్యులు ప్రజల కళ్లముందే కనిపించే ప్రాణదాతలని, వారి సేవలకు తగిన గుర్తింపు, గౌరవం లభించాలన్నారు. కార్యక్రమ చైర్మన్ లయన్ డాక్టర్ సీహెచ్ రమణాచారి మాట్లాడుతూ, వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స చేయడం కంటే వ్యాధులు రాకుండా ప్రజల్లో అవగాహన కల్పించడమే ముఖ్యమన్నారు. పొగాకు, గుట్కా, మద్యం వంటి దురలవాట్ల వల్ల నోటి, గొంతు క్యాన్సర్లు అధికంగా వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వివిధ స్పెషాలిటీ వైద్యులను శాతవాహన లయన్స్ క్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించారు. అనంతరం ప్రజలకు ఉచిత నోటి, గొంతు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. శాతవాహన లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మర్రిపల్లి మహేందర్, కార్యదర్శి ఎన్. వేణుగోపాల్, కోశాధికారి ఎం. ప్రవీణ్, లయన్ కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి, ఈ. రమేష్, వి. జగదీశ్వరాచారి, డాక్టర్ వి. శ్రీనివాస్, ఎం. వేణు, ఎం. అరవింద్ బాబు, సురేందర్, రఘునందన్ రావు, కిరణ్, ఆసుపత్రి సిబ్బంది, పలువురు ప్రముఖ వైద్యులు పాల్గొన్నారు.

#### చార్టర్డ్ అకౌంటెంట్లకు ఘన సత్కారం

జాతీయ చార్టర్డ్ అకౌంటెంట్స్ డే సందర్భంగా ప్రముఖ చార్టర్డ్ అకౌంటెంట్లు సీఏ డి. నిరంజనాచారి, సీఏ ఎం. ప్రవీణ్ కుమార్ తదితరులను శాతవాహన లయన్స్ క్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీఏ డి. నిరంజనాచారి మాట్లాడు తూ, వ్యక్తులు, సంస్థల ఆర్థిక వ్యవస్థను సక్రమంగా నడిపించడంలో చార్టర్డ్ అకౌంటెంట్ల పాత్ర కీలకమని, వారికి సమాజంలో తగిన గౌరవం, గుర్తింపు కల్పించాలని కోరారు.

#### వృద్ధాశ్రమానికి చీరలు, బెడ్‌షీట్లు పంపిణీ

వెదురు గ్రామ సమీపంలోని స్పందన వృద్ధాశ్రమంలో లయన్ కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి చొరవతో చీరలు, బెడ్‌షీట్లు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వృద్ధాశ్రమ నిర్వాహకుడు శ్రీనివాస్‌ను ఘనంగా సత్కరించారు.

#### పోస్టల్ వర్కర్స్ డే సందర్భంగా పోస్టుమెన్ల సన్మానం

జాతీయ పోస్టల్ వర్కర్స్ డే సందర్భంగా ఇద్దరు పోస్టుమెన్లను శాతవాహన లయన్స్ క్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించారు. ప్రజలకు నిరంతరం సేవలందిస్తున్న పోస్టల్ సిబ్బంది సేవలను ఈ సందర్భంగా కొనియాడారు.

# జర్నలిస్టుల హక్కుల సాధనకు జిల్లా మహాసభ..

- జర్నలిస్టుల సమస్యలే అజెండా
- ఇంటి స్థలాలు, హెల్త్ కార్డులపై దృష్టి
- మహాసభ నిర్వహణకు కమిటీల ఏర్పాటు
- అనారోగ్య పాత్రికేయులకు ఆర్థిక సాయం
- సంగారెడ్డిలో భారీ ఏర్పాట్లు





**సంగారెడ్డి ప్రతినిధి, జూలై 02**

సంగారెడ్డి జిల్లా కేంద్రంలో టియుడబ్ల్యూజే(ఐజేయు) జిల్లా మహాసభను ఈనెల 9న భారీ స్థాయిలో నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.ఏ.కే పైసల్, జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి, జిల్లా ప్రధాన కార్యదర్శి విష్ణు ప్రసాద్ వెల్లడించారు. మహాసభ ఏర్పాట్లపై సంగారెడ్డిలోని టీఎన్జీవో భవన్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లాలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం సభ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. అర్హులైన పలువురు జర్నలిస్టులకు ఇంటి స్థలాలు ఇంకా అందకపోవడం, హెల్త్ కార్డుల సమస్య పెండింగ్‌లో ఉండటం, ఉద్యోగ భద్రత లేకపోవడం వంటి అంశాలు చర్చకు రానున్నాయని వివరించారు. జిల్లాలో ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా, చిన్న, మధ్య తరహా పత్రికలు, ఉర్దూ పత్రికలు, కేబుల్ టీవీ, ఫోటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు దశాబ్దాలుగా వృత్తిపైనే ఆధారపడి జీవిస్తున్నారని, వారి సంక్షేమం కోసం యూనియన్ కట్టుబడి ఉందని తెలిపారు. అర్హులైన వారందరికీ ఇంటి స్థలాలు, హెల్త్ కార్డులు, అక్రిడేషన్ కార్డుల సాధనకు కృషి కొనసాగుతుందని స్పష్టం చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఇద్దరు పాత్రికేయులకు పదివేల రూపాయల చొప్పున ఆర్థిక సాయం అందజేస్తున్నట్లు ప్రకటించారు. మహాసభ నిర్వహణ కోసం ఆహ్వాన, రిజిస్ట్రేషన్, ఆహార, వేదిక అలంకరణ కమిటీలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ, ప్రధాన కార్యదర్శి రామనారాయణతో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు, ఇతర ప్రముఖులు హాజరవుతున్నందున అన్ని మండలాలు, నియోజకవర్గాల నుంచి పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

## హరీశ్ రావు అరెస్టుపై చింత

# ప్రభాకర్ ఆగ్రహం

### పోరాటం కొనసాగిస్తామని స్పష్టం

**సంగారెడ్డి ప్రతినిధి, జూలై 02**

గురుకుల టెండర్ల అంశంపై ఆధారాలు వెల్లడించేందుకు వెళ్తున్న మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీశ్ రావును పోలీసులు అరెస్టు చేయడం ప్రజాస్వామ్య వ్యతిరేక చర్యగా సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ విమర్శించారు. గురుకుల టెండర్లలో జరిగిన అవకతవకల అంశాన్ని ప్రజల ముందుకు తీసుకురావడానికి ప్రయత్నిస్తున్న సమయంలో ఈ చర్య చేపట్టడం తీవ్ర ఆందోళనకరమని పేర్కొన్నారు. ప్రతిపక్షం లేవనెత్తుతున్న అంశాలకు సమాధానం ఇవ్వాల్సింది పోయి పోలీసు వ్యవస్థను వినియోగించి అడ్డుకునే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. గురుకుల టెండర్లలో అక్రమాలు జరగలేదని అధికార పక్ష నాయకులు ప్రకటిస్తూ బహిరంగ చర్చకు సవాళ్లు విసిరిన నేపథ్యంలో, వాటిని స్వీకరించి ఆధారాలతో ముందుకు వస్తున్న పరిస్థితిలో అరెస్టులు జరగడం అనుమానాలకు తావిస్తోందని వ్యాఖ్యానించారు. ఆధారాలపై ప్రజల సమక్షంలో చర్చకు రావాలని, ప్రశ్నించే హక్కును అణచివేసే చర్యలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. అరెస్టులు, నిర్బంధాలతో రాజకీయ పోరాటాలను అడ్డుకోలేరని, గురుకుల వ్యవస్థకు సంబంధించిన అంశాలపై తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.



## సికింద్రాబాద్‌లో గోల్డెన్ పామ్

# కాంప్లెక్స్ ప్రారంభం

### సైనికులు, మాజీ సైనికుల సంక్షేమానికి మరో అడుగు

### వసతి సౌకర్యాలను వర్చువల్‌గా ప్రారంభించిన దక్షిణ భారత్ ఏరియా జీఓసీ

**సికింద్రాబాద్, జూలై 2**

సికింద్రాబాద్ మిలిటరీ స్టేషన్ పరిధిలో నూతనంగా నిర్మించిన 'గోల్డెన్ పామ్ కాంప్లెక్స్'ను దక్షిణ భారత్ ఏరియా జనరల్ ఆఫీసర్ కమాండింగ్ (జీఓసీ) గురువారం వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ–ఆంధ్ర సబ్ ఏరియా ప్రధాన కార్యాలయ జనరల్ ఆఫీసర్ కమాండింగ్‌తో పాటు సికింద్రాబాద్ మిలిటరీ స్టేషన్‌కు చెందిన సేవలో ఉన్న సైనికులు, మాజీ సైనికులు పాల్గొన్నారు. సికింద్రాబాద్ నగరంలోని ప్రధాన ప్రాంతంలో, జూబ్లీ బస్ స్టేషన్, రెండు మెట్రో స్టేషన్లకు సమీపంలో ఈ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేశారు. దీంతో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే సైనికులు, వారి కుటుంబ సభ్యులకు రాకపోకలు మరింత సులభంగా ఉండనున్నాయి. ఈ కాంప్లెక్స్‌లో త్రివిధ దళాలు, భారత తీర రక్షక దళానికి చెందిన సేవలో ఉన్న సిబ్బంది, మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యులకు స్వల్పకాలిక, దీర్ఘకాలిక బస కోసం అందుబాటు ధరల్లో ఆధునిక వసతి సౌకర్యాలు కల్పించారు. ఒకరికి, ఇద్దరికి అనువైన గదులను ఏర్పాటు చేసి సౌకర్యవంతమైన వాతావరణాన్ని కల్పించారు. దక్షిణ భారత్ ఏరియా ప్రధాన కార్యాలయం ఆధ్వర్యంలో బెంగళూరు, చెన్నై నగరాల్లో ఇప్పటికే ఇలాంటి గోల్డెన్ పామ్ వసతి సముదాయాలు అందుబాటులో ఉన్నాయని అధికారులు తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో చెన్నైలోని గోల్డెన్ పామ్ కాంప్లెక్స్‌ను ప్రారంభించినట్లు వెల్లడించారు. సైనికులు, మాజీ సైనికులు, వారి కుటుంబాల సంక్షేమానికి భారత సైన్యం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని అధికారులు పేర్కొన్నారు. ఇటువంటి వసతి కేంద్రాల ఏర్పాటు ద్వారా సైనిక కుటుంబాలకు మరింత భద్రత, సౌకర్యాలు కల్పించడమే లక్ష్యమని తెలిపారు.



## చేనేత పోరు బరిలో నేతన్నల

# వారసులు..

### జోగిపేట ఎన్నికల్లో పెరిగిన ఆసక్తి

### నామినేషన్ల తొలి రోజు సందడి

### నేతన్న బిడ్డల జోరు

### సంక్షేమమే ప్రధాన ఎజెండా

### సంఘ ఎన్నికలపై పెరిగిన ఉత్కంఠ

**జోగిపేట చేనేత సహకార విక్రయ ఉత్పత్తి సంఘం ఎన్నికల నామినేషన్ ప్రక్రియ తొలి రోజే ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. ఈ నెల 10న జరగనున్న ఎన్నికల కోసం గురువారం నామినేషన్ల స్వీకరణ చేపట్టగా మొత్తం నాలుగు నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల అధికారి విజరాత్ అలీ వెల్లడించారు.**

**సంగారెడ్డి ప్రతినిధి, జూలై 02**

తొలి రోజే చేనేత కార్మిక కుటుంబాల వారసులు బరిలోకి దిగడం ప్రత్యేక ఆకర్షణగా మారింది. గత 35 సంవత్సరాలుగా చేనేత వృత్తిలో కొనసాగుతున్న మెట్టు మల్లమ్మ, వెంకటేశం దంపతుల కుమారుడు మెట్టు రమేష్, సంఘ మాజీ అధ్యక్షుడిగా సేవలందించిన కీర్తిశేషులు చిట్యాల పెంటయ్య కుమారుడు చిట్యాల మధు నామినేషన్లు దాఖలు చేశారు. కార్మిక కుటుంబాల నుంచి యువ నాయకత్వం ఎన్నికల రంగంలోకి రావడంతో సంఘ సభ్యుల్లో ఆసక్తి పెరిగింది. చేనేత కార్మికుల సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యమని, మగ్గం కష్టం తెలిసిన వారిగా కార్మికుల సమస్యలకు పరిష్కారం చూపడంతో పాటు సంఘాన్ని అభివృద్ధి, లాభాల దిశగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని అభ్యర్థులు పేర్కొన్నారు. పాత నాయకత్వ అనుభవం, కొత్త తరం ఆశయాల మధ్య ఈ ఎన్నికలు ఆసక్తికరంగా మారగా, నామినేషన్ల గడువు కొనసాగుతున్న నేపథ్యంలో మరిన్ని దరఖాస్తులు వచ్చే అవకాశముందని అధికారులు తెలిపారు.

# పోక్సో, అత్యాచార బాధితుల రక్షణకు శాఖల సమన్వయం కీలకం

- స్టేక్‌హోల్డర్స్ సమావేశంలో కీలక చర్చలు
- బాధితులకు సమగ్ర సేవలపై దృష్టి
- రీ-విక్టిమైజేషన్ నివారణకు చర్యలు
- అవగాహన, పునరావాసానికి ప్రాధాన్యం



**సంగారెడ్డి ప్రతినిధి, జూలై 02**

మహిళలు, చిన్నారులపై జరిగే పోక్సో, అత్యాచార కేసుల్లో బాధితుల రక్షణ, సంక్షేమానికి అన్ని ప్రభుత్వ శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ సూచించారు. తెలంగాణ రాష్ట్ర మహిళా విభాగం డీజీపీ ఆదేశాల మేరకు జిల్లా భరోసా సెంటర్ ఆధ్వర్యంలో జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన జిల్లా స్థాయి స్టేక్‌హోల్డర్స్ కన్వర్జెన్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. బాధితులకు వైద్య సేవలు, కౌన్సెలింగ్, న్యాయ సహాయం, పునరావాసం వంటి సేవలను ఒకే వేదికపై సమర్థవంతంగా అందించడంతో పాటు మానసికంగా మళ్లీ ఇబ్బందులు ఎదురుకాకుండా రీ–విక్టిమైజేషన్ నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. భరోసా కేంద్రంలో వైద్యాధికారి నియామకం, వైద్య నివేదికల నాణ్యత పెంపు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సమావేశాల నిర్వహణ, విక్టిమ్ పరిహారం పెండింగ్ కేసుల పురోగతి, చదువు మధ్యలో నిలిచిపోయిన బాధిత బాలికలకు తిరిగి విద్యా అవకాశాలు కల్పించడం వంటి అంశాలపై సమావేశంలో చర్చించినట్లు తెలిపారు. పోక్సో చట్టాలపై విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, వివిధ శాఖల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాలని సూచించారు. అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి మాట్లాడుతూ అన్ని శాఖలు బాధ్యతా యుతంగా వ్యవహరిస్తే బాధితులకు వేగవంతమైన న్యాయం, వైద్య సహాయం, కౌన్సెలింగ్, పునరావాస సేవలు మరింత సమర్థవంతంగా అందుతాయని తెలిపారు. సమావేశంలో పాల్గొన్న వివిధ శాఖల ప్రతినిధులు తమ సేవలను వివరించి బాధితులకు నాణ్యమైన, త్వరిత గతిన సేవలు అందించేందుకు సూచనలు చేశారు.

# పరిశ్రమల స్థిరాభివృద్ధికి పటిష్ట నీటి నిర్వహణ అవసరం

- నీటి భద్రతపై ఉన్నత స్థాయి సదస్సు
- జీరో లిక్విడ్ డిశ్చార్జ్ విధానానికి ప్రాధాన్యం
- సీఎస్ఆర్ నిధులతో చెరువుల పునరుద్ధరణకు పిలుపు
- స్మార్ట్ సాంకేతికత వినియోగంపై నిపుణుల సూచనలు




**హైదరాబాద్ ప్రతినిధి, జూలై 02**

పరిశ్రమల విస్తరణతో పాటు పర్యావరణ పరిరక్షణ, సహజ వనరుల సంరక్షణకు తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి పేర్కొన్నారు. ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ది పార్క్ హోటల్‌లో నిర్వహించిన "నీటి భద్రత – పారిశ్రామిక స్థిరత్వం" ఉన్నత స్థాయి సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొని ఆమె మాట్లాడారు. నీటి భద్రత లేకుండా శాశ్వత పారిశ్రామిక వృద్ధి సాధ్యం కాదని పేర్కొంటూ, భవిష్యత్తులో ఏర్పాటు చేసే ప్రతి పారిశ్రామిక పార్కులో జీరో లిక్విడ్ డిశ్చార్జ్ విధానం, అధునాతన మురుగు నీటి శుద్ధి ప్లాంట్లను తప్పనిసరి చేస్తామని వెల్లడించారు. పరిశ్రమలు తమ సామాజిక బాధ్యత నిధులను స్థానిక చెరువుల పునరుద్ధరణ, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సదుపాయాల మెరుగుదలకు వినియోగించాలని పిలుపునిచ్చారు. భూగర్భ జలాల మట్టాలు తగ్గుతున్న పరిస్థితుల్లో పరిశ్రమలు ఐఓటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి సాంకేతికతలను వినియోగించి నీటి వృథా, లీకేజీలను నివారించాలని సదస్సులో పాల్గొన్న నిపుణులు సూచించారు. కార్యక్రమంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 100 మందికి పైగా పారిశ్రామిక ప్రతినిధులు, పర్యావరణ నిపుణులు, ఉన్నతాధికారులు పాల్గొని నీటి నిర్వహణ, పారిశ్రామిక స్థిరాభివృద్ధిపై విస్తృతంగా చర్చించారు.

# గురుకులాల్లో పార్ట్‌టైం ఉపాధ్యాయ నియామకాలు

### అర్హుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

### 12 విద్యాసంస్థల్లో ఖాళీల భర్తీ


### జూలై 7 వరకు దరఖాస్తుల గడువు

### డెమో తరగతుల ద్వారా ఎంపిక

### పోస్టుల వారీగా గౌరవ వేతనాలు

**సంగారెడ్డి ప్రతినిధి, జూలై 02**

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో 2026–27 విద్యా సంవత్సరానికి సంగారెడ్డి జిల్లా పరిధిలోని 12 గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో పార్ట్‌టైం ఉపాధ్యాయుల నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించినట్లు జిల్లా సమన్వయ అధికారి జి. కల్పన వెల్లడించారు. చిట్కుల్, ఇస్నాపూర్, ఆందోల్, రంజోల్, రాయికోడ్ బాలికల గురుకుల పాఠశాలలు, అంబేద్కర్ కళాశాల, హత్నూర, కొండాపూర్, నారాయణఖేడ్, నల్లవాగు, సింగూర్, న్యాల్కల్ బాలుర గురుకుల పాఠశాలల్లో ఈ నియామకాలు చేపట్టనున్నట్లు తెలిపారు. జూనియర్ లెక్చరర్, పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్, ట్రెయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్, స్పెషల్ టీచర్ పోస్టులకు సంబంధిత నిబంధనల ప్రకారం విద్యార్హతలు కలిగి ఉండాలని సూచించారు. అర్హులైన అభ్యర్థులు జూలై 7 సాయంత్రం 4 గంటలలోపు దరఖాస్తులు సమర్పించాలని, జూలై 8 ఉదయం 10 గంటలకు చిట్కుల్‌లోని జిల్లా సమన్వయ అధికారి కార్యాలయంలో డెమో తరగతుల ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు ఒరిజినల్ విద్యార్హత ధ్రువపత్రాలు, అనుభవ పత్రాలు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలతో హాజరు కావాలని సూచించారు. నెలవారీ గౌరవ వేతనంగా జూనియర్ లెక్చరర్‌కు రూ.23,400, పీజీటీ, టీజీటీలకు రూ.18,200, స్పెషల్ టీచర్లకు రూ.14,200 చెల్లించనున్నట్లు వెల్లడించారు. నియామకాల విషయంలో సంస్థ నిర్ణయమే తుది నిర్ణయమని, అవసరమైతే నియామక ప్రక్రియలో మార్పులు చేసే అధికారం సంస్థకు ఉంటుందని స్పష్టం చేశారు.



## వార్డెన్ అలీకి ఘన సన్మానం



**ఆసిఫాబాద్ టౌన్ :**
జిల్లా కేంద్రంలోని పోస్ట్ మెట్రిక్ బాలికల వసతి గృహంలో పనిచేసి, ఇటీవల బదిలీపై వెళ్లిన సంక్షేమ అధికారి అలీని గురువారం పి.ఎం.ఆర్.సి కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఏటీడీఓ చిరంజీవి, జీసీడీఓ కొట్నాక్ శకుంతల, టీఎస్టీడ బ్ల్యూటీయూ జిల్లా అధ్యక్షుడు రాథోడ్ రవీందర్, కోశాధికారి కూడ్మేత అనంత్ ఆయనకు శాలువా కప్పి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా జీసీడీఓ శకుంతల మాట్లాడుతూ.. అలీ విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేస్తూ, విద్యార్థుల సంక్షేమం, వసతి గృహ అభివృద్ధికి విశేష కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ సరిత, పీఎంఆర్సీ సిబ్బంది చంద్రమోహన్, ధనలక్ష్మి , చిరంజీవి, మహేష్, తిరుమల తదితరులు పాల్గొన్నారు.

## లారీ ఢీకొని వృద్ధురాలు మృతి

**రోడ్డు దాటుతుండగా ప్రమాదం**






**తాండూర్:**
మండలంలోని రేపల్లెవాడ గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కోట భూదేవి (70) అనే వృద్ధురాలు మృతి చెందినట్లు తాండూర్ ఏఎస్సై రాజ మొగిలి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. భూదేవి తన కుమారుడు శంకర్ ఇంటికి వెళ్లి తిరిగి స్వగృహానికి వెళ్తుండగా జాతీయ రహదారిపై డివైడర్ దాటుతున్న సమయంలో చంద్రాపూర్ నుంచి బెల్లంపల్లి వైపు వెళ్తున్న ఓ లారీ వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆమె రెండు కాళ్లు, నడుము భాగం నుజ్జు నుజ్జు అయ్యింది. స్థానికులు వెంటనే 108 అంబులెన్స్కు సమాచారం అందించారు. ఆమెను చికిత్స నిమిత్తం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. మృతురాలి కుమారుడు కోట శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వివరించారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు పక్షపాతి

**కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్**

**బోథ్లో ఘనంగా రైతు భరోసా సంబరాలు**



**బోథ్:** రైతుల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం పనిచేస్తోందని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తూ రైతు భరోసా నిధులను విడుదల చేయడాన్ని పురస్కరించుకుని గురువారం బోథ్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రైతు భరోసా సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. అనంతరం ఆడే గజేందర్ మాట్లాడుతూ కేవలం తొమ్మిది రోజుల్లోనే రూ.9వేల కోట్ల రైతు భరోసా నిధులను విడుదల చేయడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. రైతులకు సబ్సిడీపై పత్తి, కందులు, సోయాబీన్ విత్తనాలు అందించడంతో పాటు స్ప్రింక్లర్లు, డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు, స్ప్రేయర్లు, ఉద్యానవన పథకాల ద్వారా అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. రైతులు పండించే ప్రతి గింజను గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయడంతో పాటు రైతు రుణమాఫీ అమలు చేయడం వంటి నిర్ణయాలతో తెలంగాణ ప్రభుత్వం నిజమైన రైతు పక్షపాతిగా నిలిచిందని అన్నారు. ఈ కార్యక్రమంలో బోథ్ బ్లాక్ ఆత్మ చైర్మన్ గొర్ల రాజు యాదవ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మెరుగు భోజన్న, టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుర్మే మహేందర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి, మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ దాస్, మాజీ ఎంపీటీసీ చాట్ల ఉమేష్, మార్కెట్ డైరెక్టర్ రాజు రెడ్డి, మాజీ డైరెక్టర్ అబ్రార్, ఆత్మ డైరెక్టర్లు అబుద్, రహీమొద్దీన్, కుచ్లాపూర్ ఉప సర్పంచ్ అరుణ్ రెడ్డి, సీనియర్ నాయకులు మొహమ్మద్, హసీబ్, అనుపట్ల సంజీవ్, అచ్యుతానంద రెడ్డి, బీరం రవి, గడ్డల నారాయణ, భీమా భూచన్న, ఎండీ సద్దాం, జగన్, షేక్ షాకీర్, మారుతి తదితరులు పాల్గొన్నారు.

# పేదలు చావాలా...?

- **విధులకు రాకుండానే సంతకాలు చేస్తారా..?**
- **ప్రభుత్వ ఆసుపత్రి ముందు సీపీఐ భారీ ధర్నా**




**ఆసిఫాబాద్:**
జిల్లా కేంద్రంలోని ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రిలో చోటుచేసుకున్న వైద్యుల తీవ్ర నిర్లక్ష్యంపై భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) నిప్పులు చెరిగింది. ఆసుపత్రిని నిర్లక్ష్యానికి నిలయంగా మార్చిన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో ప్రధాన ఆసుపత్రి ముందు గురువారం ధర్నా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆత్మకూరి చిరంజీవి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో ఆసుపత్రి సూపరింటెండెంట్, కొందరు వైద్యుల లీలలు బయటపడటం ప్రభుత్వ వైద్య వ్యవస్థలో నెలకొన్న తీవ్రమైన నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు. వైద్యులు విధులకు హాజరు కాకుండానే ముందుగానే సంతకాలు చేయడం, మరికొందరు హాజరు నమోదు చేసిన తర్వాత ఆసుపత్రి నుంచి మాయమవ్వడం అత్యంత ఆందోళనకరమని అన్నారు. పేదలు, గిరిజనులు, కూలీలు, సామాన్య ప్రజలకు చివరి ఆశ్రయమైన ప్రభుత్వ ఆసుపత్రిలో ఇలాంటి బాధ్యతారాహిత్యం వల్ల రోగుల ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యుల విధులను నిరంతరం పర్యవేక్షించాల్సిన ఆసుపత్రి సూపరింటెండెంట్ తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించడంలో పూర్తిగా విఫలమయ్యారని చిరంజీవి విమర్శించారు. పర్యవేక్షణ లోపాలు ఉండటం వల్లే ఇటువంటి ఘటనలు పునరావృతమవుతున్నాయని, దీనివల్ల ప్రజలు ప్రభుత్వ వైద్యంపై విశ్వాసం కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు.విధులకు హాజరు కాకుండానే హాజరు నమోదు చేసిన వైద్యులపై, విధులను మధ్యలో వదిలి వెళ్లిన వారిపై వెంటనే శాఖాపరమైన, కఠిన క్రమశిక్షణ చర్యలు చేపట్టాలని సీపీఐ జిల్లా శాఖ డిమాండ్ చేసింది. ఆసుపత్రిలో బయోమెట్రిక్ హాజరు విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని, నిరంతర ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా పటిష్ఠమైన పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కలెక్టర్ను కోరినట్లు తెలిపారు. ప్రజల ఆరోగ్యంతో రాజీ పడే ఎలాంటి నిర్లక్ష్యాన్నైనా సీపీఐ సహించదని, బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకోకపోతే ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బోయిరే ప్రకాష్, పిడుగు శంకర్, జిల్లా కౌన్సిల్ సభ్యులు కొదురుపాక మహేష్, వర్కోల్ రాకేష్, పిప్పిరి వెంకటేష్, శ్రీరామ్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## నెట్బాల్ జాతీయ స్థాయి పోటీలలో ఆదర్శ కళాశాల విద్యార్థినుల ప్రతిభ

**బ్రాంజ్ మెడల్ కైవసం**



**ఆసిఫాబాద్:** జిల్లా కేంద్రంలోని ఆదర్శ పాఠశాల మరియు కళాశాల విద్యార్థినులు జాతీయ స్థాయి నెట్ బాల్ పోటీలలో అద్భుత ప్రతిభ కనబరిచి బ్రాంజ్ మెడల్ సాధించారు. ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థినులు శివరాత్రి సంజన, సిరికొండ సాయి శివ మల్లికలు జాతీయ స్థాయిలో రాణించి కళాశాలకు, జిల్లాకు మంచి పేరు తెచ్చిపెట్టారు.గత నెల జూన్ 24 నుండి 25 వరకు మహబూబ్ నగర్ జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి నెట్ బాల్ పోటీలలో వీరిద్దరూ అద్భుత ప్రతిభను కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఆ తర్వాత కేంద్రపాలిత ప్రాంతమైన పాండిచ్చేరిలో జూన్ 28 నుండి 30 వరకు నిర్వహించిన జాతీయ స్థాయి నెట్ బాల్ పోటీలలో దేశవ్యాప్తంగా ఉన్న పలు జట్లతో తలపడి, అత్యుత్తమ ఆటతీరుతో బ్రాంజ్ మెడల్ కైవసం చేసుకున్నారు. జాతీయ స్థాయిలో మెడల్ సాధించి విజేతలుగా నిలిచిన విద్యార్థినులను కళాశాల ప్రిన్సిపల్ దుర్గం మహేశ్వర్, ఉపాధ్యాయులు ఎం. మల్లేష్, ఎస్. శ్రీ వర్ధన్, ఫిజికల్ డైరెక్టర్ బి. తిరుపతి ప్రత్యేకంగా అభినందించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ జాతీయ స్థాయికి ఎదిగి పతకాలు సాధించడం గర్వకారణమని, రాబోయే రోజుల్లో వీరు మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ప్రిన్సిపల్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థినుల తల్లిదండ్రులు, తోటి విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ వారికి శుభాకాంక్షలు తెలిపారు.

## పేద విద్యార్థుల చదువులపై ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలి

- **బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్ రూపనార్**




**ఆసిఫాబాద్ టౌన్:** రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థుల ఉన్నత చదువులపై నిర్లక్ష్య వైఖరిని వీడాలని బీసీ సంక్షేమ సంఘం, బీసీ జేఏసీ జిల్లా అధ్యక్షుడు రమేష్ రూపనార్ డిమాండ్ చేశారు. జాతీయ, రాష్ట్ర బీసీ జేఏసీల పిలుపు మేరకు జిల్లాలో గురువారం నిర్వహించిన కాలేజీల బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా విద్యార్థి, యువజన సంఘాల నాయకులతో కలిసి ఆయన మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను విడుదల చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని మండిపడ్డారు. పాత పద్ధతిలోనే రీయింబర్స్మెంట్ విధానాన్ని కొనసాగిస్తూ, పెండింగ్ నిధులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వ విద్యా వ్యతిరేక విధానాల వల్ల ఫీజులు చెల్లించలేక రాష్ట్రంలో ఇప్పటికే తొమ్మిది మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమన్నారు. కాంట్రాక్టర్లకు వేల కోట్ల రూపాయల బిల్లులు చెల్లిస్తున్న పాలకులు, లక్షలాది మంది పేద విద్యార్థుల భవిష్యత్తుకు ముడిపడి ఉన్న 7 వేల కోట్ల రూపాయల ఫీజు బకాయిలను ఎందుకు ఆపుతున్నారని ప్రశ్నించారు. ఈ నెల 15వ తేదీలోగా బకాయిలు విడుదల చేయకుంటే రాష్ట్ర జేఏసీ ఆధ్వర్యంలో హైదరాబాద్లో పెద్ద ఎత్తున ధర్నా, రాస్తారోకో కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు లోబడే లహు కుమార్, యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు మామిడి కిరణ్, డివిజన్ అధ్యక్షుడు బొట్టుపల్లి ప్రశాంత్, మండల అధ్యక్షుడు సిరికొండ సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఆధునిక సాగు పద్ధతులతో అధిక దిగుబడి

- **ఏఎంసీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి**



**ఉద్యమ కెరటం ఆదిలాబాద్ :** మావల మండలకేంద్రంలోని రైతు వేదికలో 'మిషన్ ఫర్ కాటన్ ప్రొడక్టివిటీ – కాపస్ క్రాంతి' కార్యక్రమంలో భాగంగా గురువారం రైతులకు పత్తి విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి, ఆత్మ చైర్మన్ సంతోష్, జిల్లా వ్యవసాయాధికారి రవీందర్ సింగ్ అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ రైతులు అధిక సాంద్రత పద్ధతిని అనుసరించడం ద్వారా తక్కువ విస్తీర్ణంలోనే ఎక్కువ దిగుబడి సాధించే అవకాశం ఉందని వివరించారు. ఈ ఆధునిక సాగు పద్ధతులను పాటించడం వల్ల పెట్టుబడి వ్యయాన్ని తగ్గించుకుని, అధిక లాభాలు పొందవచ్చని సూచించారు. రైతులు ఎప్పటికప్పుడు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తూ మంచి పంట దిగుబడిని అందుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు, మండల వ్యవసాయాధికారి, మావల, వాఘపూర్ సర్పంచులు ధర్మపురి చంద్రశేఖర్, దినేష్ లు,ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## ఓటు హక్కు ప్రతి ఒక్కరి బాధ్యత

- **కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దౌలత్ రావు**



**గుడిహత్నూర్:** ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ప్రతి పౌరుడికి అత్యంత విలువైన రాజ్యాంగబద్ధమైన హక్కు అని గుడిహత్నూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తొడసం దౌలత్ రావు అన్నారు. మండలంలోని మన్నూర్, శంభుగూడ, మామిడిగూడ గ్రామాల్లో నిర్వహించిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువతి, యువకులు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. ఓటరు జాబితాలో పేరు నమోదు, మార్పులు, చేర్పులు, సవరణలు, కొత్త ఓటరు నమోదు కోసం స్థానిక బీఎల్ఓలను సంప్రదించి నిర్ణీత గడువులోపు దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. అర్హత ఉన్న ఒక్క ఓటరు కూడా ఓటరు జాబితా నుంచి మినహాయింపుకు గురికాకుండా అధికారులు పారదర్శకంగా ప్రక్రియను నిర్వహించాలని అన్నారు. ఓటర్ల నమోదుకు సంబంధించిన ఏవైనా సమస్యలు ఎదురైతే తమను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఏలు, బీఎల్ఓలు, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చదువును మధ్యలో ఆపవద్దు...





- **ఉన్నత విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యం**
- **ఐటీడీఏ ఉట్నూర్ పీ ఓ మంద మకరందు**

**ఆసిఫాబాద్ టౌన్:** సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ఉట్నూర్ ప్రాజెక్టు అధికారి మంద మకరందు గురువారం ఆసిఫాబాద్ లోని టిడబ్ల్యూ మోడల్ స్పోర్ట్స్ స్కూల్ ను సందర్శించి పదో తరగతి విద్యార్థులకు ప్రేరణాత్మక (మోటివేషన్) తరగతిని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉన్నత విద్య, కెరీర్ ప్రణాళిక, లక్ష్య సాధన, పోటీ పరీక్షలు భవిష్యత్తులో అందుబాటులో ఉన్న వివిధ అవకాశాలపై సమగ్రంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి పూర్తయిన తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ చదువును మధ్యలో నిలిపివేయవద్దని సూచించారు. ఇంటర్మీడియట్ అనంతరం ఉన్నత విద్య, సాంకేతిక విద్య, నైపుణ్యాభివృద్ధి కోర్సులు, ప్రభుత్వ ఉద్యోగాలు, పోటీ పరీక్షలు తదితర రంగాల్లో ఎన్నో అవకాశాలు అందుబా టులో ఉన్నాయని తెలిపారు. ప్రతి విద్యార్థి స్పష్టమైన లక్ష్యంతో కృషి చేస్తూ విద్య ద్వారానే తన భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల్లో ఆంగ్ల భాషా నైపుణ్యాలను పెంపొందించేందుకు వోకాబ్యులరీ ఆధారిత పదాల ఆటలను నిర్వహించి వారిలో ఉత్సాహాన్ని నింపారు. విద్యార్థులు చురుకుగా పాల్గొని ఆంగ్ల పద సంపదను పెంపొందించుకోవడంతో పాటు నేర్చుకునే ప్రక్రియను ఆనందదాయకంగా మార్చుకున్నారు. అనంతరం ప్రాజెక్టు అధికారి ఆసిఫాబా ద్‌లోని యువజన శిక్షణ కేంద్రం (వైటీసీ)ను సందర్శించి శిక్షణా కార్యక్రమాల పురోగతిని పరిశీలించారు. శిక్షణ పొందుతున్న యువతతో మాట్లాడి, ప్రభుత్వం కల్పిస్తున్న నైపుణ్యాభివృద్ధి అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉపాధి, స్వయం ఉపాధి దిశగా ముందుకు సాగాలని సూచించారు. కేంద్రంలో అందిస్తున్న శిక్షణ నాణ్యత, హాజరు, సౌకర్యాలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి అవసరమైన సూచనలు చేశారు. ఈ కార్యక్రమాల్లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, అధ్యాపకులు, యువజన శిక్షణ కేంద్రం అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# సమాజానికి దిక్సూచిలాంటి పుస్తకాలు రావాలి

- **తెలంగాణ మీడియా అకాడమీ ఛైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి**

**హైదరాబాద్:** సమాజంలో ఆలోచనలను రేకెత్తించే, సరికొత్త దృక్పథాలను ఆవిష్కరించే దిక్సూచిలాంటి పుస్తకాలు మరిన్ని రావాలని తెలంగాణ మీడియా అకాడమీ ఛైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి ఆకాంక్షించారు. హైదరాబాద్‌లోని మీడియా అకాడమీ కార్యాలయంలో 'నేటి నిజం' పత్రిక ప్రచురించిన "ఆలోచన ఆవిష్కరణ" పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కె. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పత్రికా రంగంతో పాటు సాహిత్య, సామాజిక రంగాలకు 'నేటి నిజం' అందిస్తున్న సేవలను కొనియాడారు. సమాజ హితం కోరే ఇటువంటి ప్రచురణలు పాఠకులకు ఎంతో జ్ఞానాన్ని అందిస్తాయని పేర్కొన్నారు. 'నేటి నిజం' యాజమాన్యం సమాజానికి ఉపయోగపడే మంచి పుస్తకాన్ని ప్రచురించి, పాఠకులకు అందించడం అభినందనీయమని అన్నారు. ఈ



కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్ రెడ్డి, నేటి నిజం మేనేజింగ్ డైరెక్టర్ బైసా వీణాదాస్, నేటి నిజం ఎడిటర్ బైసా దేవదాస్, టుడే ఫ్రీడమ్ ఎడిటర్ ఆజం ఖాన్ పాల్గొన్నారు.

# నాలుగో రోజుకు చేరిన సింగరేణి అధికారుల రిలే నిరాహార దీక్షలు

**సత్తుపల్లి:** సింగరేణి అధికారుల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ భారత బొగ్గు గనుల అధికారుల సంఘం (సీఎంఓఏఐ) సింగరేణి శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం సత్తుపల్లి సింగరేణి ప్రాంతంలో నాలుగో రోజుకు చేరుకున్నాయి. దీక్షా శిబిరంలో పాల్గొన్న




అధికారులకు తోటి అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పెద్ద ఎత్తున సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ సింగరేణి సంస్థ అభివృద్ధికి రాత్రింబవళ్లు కృషి చేస్తున్న అధికారుల పట్ల యాజమాన్యం, ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని వీడి న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని కోరారు. అధికారుల ప్రధాన డిమాండ్లలో పనితీరు ఆధారిత ప్రోత్సాహక వేతనం (పీఆర్పీ) బకాయిలను వెంటనే విడుదల చేయడం, పెండింగ్లో ఉన్న వేతనాల ఉన్నతీకరణను అమలు చేయడం ప్రధానమైనవని తెలిపారు. ఈ అంశాలపై పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల సమస్యలు పరిష్కారం కాకపోతే సంస్థ పనితీరుపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. సింగరేణి అభివృద్ధిలో అధికారుల సేవలు కీలకమైనవని, వారి సమస్యలను పరిష్కరించడం యాజమాన్యం బాధ్యత అని స్పష్టం చేశారు. ఈనెల 13 వరకు రిలే నిరాహార దీక్షలు నిరంతరాయంగా కొనసాగుతాయని, అప్పటికీ యాజమాన్యం స్పందించని పక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి తదుపరి కార్యాచరణను ప్రకటిస్తామని స్పష్టం చేశారు. అధికారుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించి సింగరేణి సంస్థలో సానుకూల వాతావరణం నెలకొల్పాలని ప్రభుత్వం, యాజమాన్యాన్ని కోరారు.

# అభ్యాసన సామర్థ్యాల పెంపునకు అధ్యాపకులు కృషి చేయాలి

**జిల్లా కలెక్టర్ రాజర్షిషా**

**ఆదిలాబాద్:** విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాలను పెంపొందించేందుకు, తరగతి గదుల్లో వారిని క్రియాశీలకంగా ఉంచేందుకు అధ్యాపకులు నిరంతరం కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని డీఐఈఓ కార్యాలయంలో ఫిజిక్స్ లెక్చరర్ల కు నిర్వహించిన ప్రత్యేక ఓరియంటేషన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేవలం సిలబస్ పూర్తి చేయడం మాత్రమే కాకుండా, విద్యార్థులకు సబ్జెక్టులపై స్పష్టత వచ్చేలా బోధనా పద్ధతుల్లో మార్పులు తీసుకురావాలని సూచించారు. ఇంగ్లీష్ మీడియం విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించడంతో పాటు, అధ్యాపకులు తమ కమ్యూనికేషన్ స్కిల్స్ను మెరుగుపర్చుకోవాలని సూచించారు. కళాశాలల్లో నూతన పాఠ్యపుస్తకాల లభ్యతను పరిశీలించి, ఎక్కడైనా కొరత ఉంటే వెంటనే ప్రిన్సిపాల్, డీఐఈఓల దృష్టికి తీసుకెళ్లాలని పేర్కొన్నారు. సైన్స్ సబ్జెక్టులో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ వినియోగాన్ని పెంచాలని, ఆన్లైన్ ప్లాట్ఫారమ్ల ద్వారా లభించే విద్యా విషయాలను తరగతి గదుల్లో ప్రాక్టీస్ చేయించాలని సూచించారు. విద్యార్థుల ప్రగతిని అంచనా వేసేందుకు ప్రతిరోజూ హోంవర్క్ ఇవ్వాలని, చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని స్పష్టం చేశారు. వారి ఆత్మవిశ్వాసాన్ని పెంచేందుకు సులువైన ప్రశ్నలు, ఆపై మధ్యస్థ, కఠినమైన ప్రశ్నలతో సాధన చేయించాలన్నారు. ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా నెలవారీ సమీక్షలు, ఈ విద్యా సంవత్సరంలో 3 నుంచి 4 కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో డీఐఈఓ జాదవ్ గణేష్ కుమార్, జిల్లా అకాడమిక్ కమిటీ సభ్యులు సూరజ్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు రమాకాంత్, తిరుపతి, వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, కేజీబీవీలు, ఇతర జూనియర్ లెక్చరర్లు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# పేట రోటరీ క్లబ్ సేవలకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు.

**సదాశివపేట**

సదాశివపేట రోటరీ క్లబ్ ప్రారంభించిన మొదటి సంవత్సరంలోనే ప్రత్యేకమైన కార్యక్రమాలు చేసి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తెచ్చుకొని అవార్డ్స్ సాధించిందని క్లబ్ అధ్యక్షులు ఓదెల ప్రభు గుప్త తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాలలో కలిపి మంచి సేవ కార్యక్రమాలను చేసిన రోటరీ క్లబ్ కి ఇచ్చే అవార్డ్స్ కార్యక్రమం శోభితం 2025-26 హైదరాబాద్ లో జరిగింది. ఇందులో సదాశివపేట రోటరీ క్లబ్ ఒక బంగారు పథకము నాలుగు వెండి పథకాలతో పాటు కాకతీయ రీజన్ లో నూతనంగా ఏర్పడ్డ క్లబ్బుల ప్రదర్శన ఆధారంగా రెండవ స్థానంలో నిలిచింది. ఇంత తక్కువ పీరియడ్ రాష్ట్రస్థాయిలో ఈ విధంగా గుర్తింపు రావడం తమకు గర్వంగా ఉందని సదాశివపేట క్లబ్ అధ్యక్షులు ఓదెల ప్రభు గుప్త తెలిపారు. క్లబ్ ఎలక్టెడ్ కార్యదర్శి మఠం రాచన్న మాట్లాడుతూ ఈ. సంవత్సర కాలంలోచేసిన పనుల గురించి తెలుపుతూ మొదటగా మెగా క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహించామని, అందులో 200 కి పైన స్క్రీనింగ్ జరిగాయని, దానికోసం హైద్రాబాద్ నుండి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం తో కుండిన క్యాన్సర్ స్క్రీనింగ్ వాహనం పిసుకువచ్చి అందరికీ స్క్రీనింగ్ చేశామని తెలిపారు. ఇదే కాకుండా హెల్త్ క్యాంప్, కాలేజీ విద్యార్థులు చెడు అలవాట్ల కు బానిసలు కాకుండా ఉండడానికి వారికి అవేర్ నెస్ కోసం నిపుణులతో కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. వీటితో పాటు విద్యార్థులు ఇంటర్ తరువాత ఏ దారిలో వెళ్ళాలి,ఏది చదివితే మంచి ఉపాధి అవకాశాలు వస్తాయనే విషయంలో పారిశ్రామిక వేత్తలతో వారికి అవగాహన కల్పించడం జరిగింది. అలాగే ఈ ఎన్ టి స్క్రీనింగ్ కార్యక్రమము 100కుగా విద్యార్థులకు చేయడం జరిగింది. మన ప్రాంతంలో అతి పెద్ద కర్మాగారం అయిన మహీంద్రా కంపెనీ లో ఉద్యోగాల కోసం జాబ్ మేళాని నిర్వహించి సదాశివపేట మండలం లోని కొందరికి ఉపాధి కల్పించడం జరిగిందని తెలిపారు.వీటితోపాటు సేవా దృక్పథంతో నడపబడుతున్న సరస్వతి శిశు మందిర్ పాఠశాలకి మొయినాబాద్ క్లబ్ వారి సహకారంతో నూతన అంతస్తు నిర్మించి ఇవ్వడం.

# అటవీ సంరక్షణలో డీఎఫ్ఓ ప్రశాంత్ ముద్ర

**మూడేళ్లలో విశేష విజయాలు.. నిజామాబాద్కు బదిలీ**
**జిల్లాలో మూడు పులుల సంచారం గుర్తింపు**



**ఆదిలాబాద్:** ఆదిలాబాద్ జిల్లా అటవీ శాఖాధికారి (డీఎఫ్ఓ) ప్రశాంత్ బాజీరావు పాటిల్ నిజామాబాద్ జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన తన మూడేళ్ల పదవీ కాలంలో జిల్లాలో చేపట్టిన అటవీ సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, ఎకో టూరిజం అభివృద్ధి కార్యక్రమాల గురించి 'ఉద్యమ కెరటం'తో ప్రత్యేకంగా మాట్లాడారు. తన హయాంలో అటవీ ప్రాంతాల్లోని 15 ఆదివాసీ గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించడంలో కీలకపాత్ర పోషించినట్లు తెలిపారు. ఆక్రమణకు గురైన 1,250 ఎకరాల ప్రభుత్వ భూమిని తిరిగి స్వాధీనం చేసుకుని అక్కడ విస్తృతంగా మొక్కలు నాటించినట్లు చెప్పారు. దశాబ్ద కాలంగా పెండింగ్లో ఉన్న సుమారు 200 కిలో మీటర్ల ఎవెన్యూ ప్లాంటేషన్ పనులను పూర్తి చేసినట్లు వివరించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలైన పొచ్చెర, కుంటాల జలపాతాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.5కోట్ల నిధులు మంజూరు చేయించామని తెలిపారు. ఉట్నూర్ అర్బన్ పార్కు అభివృద్ధికి రూ.2 కోట్లు, కేంద్ర ప్రభుత్వం నుంచి మరో రూ.4 కోట్ల నిధులు సాధించి యాపల్గూడ, దుర్గానగర్ పార్కులను అభివృద్ధి చేసినట్లు పేర్కొన్నారు. మావల ఎకో టూరిజం పార్కును కూడా ఆకర్షణీయంగా తీర్చిదిద్దినట్లు చెప్పారు. అడవుల సంరక్షణలో భాగంగా అటవీ స్మగ్లింగ్ను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామని, అటవీ నేరాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుని ప్రతి ఏడాది రూ.80లక్షల నుంచి రూ.కోటి వరకు జరిమానాలు విధించినట్లు తెలిపారు. అడవుల్లో ప్రత్యేక కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా జిల్లా పరిధిలో మూడు పులుల సంచారాన్ని అధికారికంగా గుర్తించినట్లు చెప్పారు. ఆదిలాబాద్ జిల్లా ప్రజలు, గిరిజనులు, అటవీ శాఖ సిబ్బంది అందించిన సహకారాన్ని ఎప్పటికీ మరువలేనని తెలిపారు. ఇదే అంకితభావంతో నిజామాబాద్ జిల్లాలోనూ అటవీ అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు.

# బాధలో ఉన్న కుటుంబానికి సర్పంచ్ భరోసా

**మృతుడి కుటుంబానికి రూ.3వేల ఆర్థిక సాయం**



**జైనూర్:** ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలవడమే నిజమైన ప్రజాప్రతినిధి బాధ్యత అని నిరూపించారు పవర్గూడా గ్రామ సర్పంచ్ తొడసం రాజేందర్. కుటుంబ పెద్దను కోల్పోయిన బాధలో ఉన్న ఇంటికి వెళ్లి ఓదార్చడంతో పాటు ఆర్థిక సాయం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. జైనూర్ మండలం పవర్గూడా గ్రామానికి చెందిన మేశ్రం కళాబాయి భర్త జ్ఞానేశ్వర్ గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలుసుకున్న సర్పంచ్ ఆమె నివాసానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని వారికి మనోధైర్యం కల్పించారు. అనంతరం తనవంతు సహాయంగా రూ.3వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. అవసరమైన ప్రతి సందర్భంలో గ్రామపంచాయతీ తరఫున సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఆయన చూపిన ఆప్యాయతను గ్రామస్తులు అభినందించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, స్థానికులు కూడా మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కష్టసమయంలో పరస్పరం అండగా నిలవడం గ్రామ గొప్ప సాంప్రదాయమని వారు పేర్కొన్నారు.

# తులం బంగారం ఎప్పుడిస్తారు..?

**బీజేపీ యువ నాయకుడు దుర్గం ప్రశాంత్**



**వాంకిడి:** ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని జిల్లా బీజేపీ యువ నాయకుడు దుర్గం ప్రశాంత్ డిమాండ్ చేశారు. కళ్యాణలక్ష్మి , షాదీ ముబారక్ పథకాల కింద లబ్ధిదారులకు రూ.1లక్షతో పాటు ఒక తులం బంగారం అందిస్తామని ప్రకటించి ప్రభుత్వం ఏర్పడి చాలాకాలం గడిచినా అమలు చేయకపోవడం బాధాకరమని అన్నారు. గురువారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలు ప్రభుత్వం ప్రకటించిన హామీ అమలుపై ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నాయని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కళ్యాణలక్ష్మి , షాదీ ముబారక్ లబ్ధిదారులకు ప్రకటించిన అదనపు ప్రయోజనాలను ఎప్పటి నుంచి అమలు చేస్తారో ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వాలని కోరారు. ఇకపై జాప్యం చేయకుండా ఎన్నికల హామీలను అమలు చేసి లబ్ధిదారులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

# నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**వాంకిడి:** వాంకిడి సబ్స్టేషన్లో 33 కేవీ ఇంటర్లింక్ పనులు, స్థానిక ఫీడర్ల డైవర్షన్ పనులు చేపడుతున్న నేపథ్యంలో శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ ఎం.రవీందర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సరఫరా నిలిచిపోయే సమయంలో ఇబ్బందులు తలెత్తకుండా విద్యుత్కు సంబంధించిన పనులు, తాగునీటి నిల్వ వంటి అవసరాలను ఉదయం 10 గంటలలోపు పూర్తి చేసుకోవాలని వినియోగదారులకు సూచించారు. అభివృద్ధి పనుల దృష్ట్యా విద్యుత్ సరఫరా నిలిపివేయాల్సి వస్తోందని, ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

## సంక్షేమ పథకాల అమలులో వివక్ష వద్దు

**రాష్ట్ర లేబర్ కమిషనర్కు భవన నిర్మాణ కార్మికుల వినతి**



**సత్తుపల్లి:** భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాల అమలులో వివక్ష చూపవద్దని, కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ అనుబంధ తెలంగాణ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గంలోని వేంసూరు, కల్లూరు మండలాలకు చెందిన కార్మికులు గురువారం హైదరాబాద్లోని టంగుటూరి అంజయ్య కార్మిక సంక్షేమ భవనంలో రాష్ట్ర అదనపు లేబర్ కమిషనర్లు గంగాధర్, వెంకటరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లూరు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్లోని ఆసుపత్రుల్లో ప్రసవం జరిగిన తెలంగాణ భవన నిర్మాణ కార్మికుల భార్య, కుమార్తెలకు సంక్షేమ బోర్డు అందించే రూ.30వేల ప్రసూతి ఆర్థిక సాయం కోసం మీసేవ కేంద్రాల్లో దరఖాస్తులు ఆన్లైన్లో స్వీకరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సర్వర్లో మార్పులు చేసి ఏ రాష్ట్రంలో ప్రసవం జరిగినా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని కోరారు. అదేవిధంగా సిఎస్ సి హెల్త్ టెస్టుల లీజు విధానాన్ని రద్దు చేసి కార్మికులకు నేరుగా వైద్య పరీక్షల కోసం ఆర్థిక సాయం అందించాలని, కార్మికుల పిల్లలకు విద్యా స్కాలర్షిప్లు మంజూరు చేయాలని, సొంత ఇంటి నిర్మాణానికి సంక్షేమ బోర్డు ద్వారా రూ.5లక్షల వరకు ఆర్థిక సహాయం అందించాలని కోరారు. 55 సంవత్సరాలు పూర్తి చేసుకున్న భవన నిర్మాణ కార్మికులకు నెలకు రూ.6వేల పెన్షన్ మంజూరు చేయాలని, కార్మిక సంఘాల ప్రతినిధులతో సంక్షేమ బోర్డు అడ్వైజరీ కమిటీ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. సహజ మరణానికి ప్రస్తుతం అందిస్తున్న రూ.2లక్షల ఆర్థిక సాయాన్ని రూ.5లక్షలకు పెంచడంతో పాటు ప్రసూతి, వివాహ సమయంలో ఇచ్చే రూ.30వేల సాయాన్ని రూ.లక్షకు పెంచాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ప్రైవేట్ ఇన్సూరెన్స్ సంస్థల ప్రమేయం లేకుండా అన్ని సంక్షేమ పథకాలను నేరుగా ప్రభుత్వం సంక్షేమ బోర్డు ద్వారా అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెంకటాపురం గ్రామ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు షేక్ బాజీ, మండల మహిళా నాయకురాలు పర్సా సరోజిని, చిన్నమల్లేల గ్రామ నాయకుడు పుచ్చకాయల వెంకటేశ్వరరావు, కల్లూరు మండల బాధ్యుడు ఇనపనూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## తాండూర్లో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం



**తాండూర్:** తాండూర్ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా గురువారం బూత్ స్థాయిలో ఓటరు జాబితా పరిశీలన, దరఖాస్తుల స్వీకరణ, పత్రాల ధ్రువీకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు ప్రజల నుంచి అవసరమైన వివరాలు, సంబంధిత ధ్రువపత్రాలను స్వీకరించి ఓటరు జాబితా సవరణ ప్రక్రియ చేపట్టారు. అర్హత కలిగిన ప్రతిఒక్కరూ తమ పేరు ఓటరు జాబితాలో నమోదు చేసుకోవడంతో పాటు అవసరమైన మార్పులు, చేర్పులు, సవరణలు గడువులోపు పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బూత్ లెవల్ సూపర్వైజర్ అధికారి, తాండూర్ ఆర్ఐ బి.పద్మజ, కంప్యూటర్ ఆపరేటర్ దాసరి మహేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎండి. ఈసా, తాండూర్ యూత్ అధ్యక్షుడు పెట్టెం విష్ణుకళ్యాణ్, జిల్లా యూత్ కార్యదర్శి ఎండి.జుబేర్, బీఎల్ఓలు విజయలక్ష్మి , సుజాత, బీఎల్ఏ అబ్దుల్ రెహమాన్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## మల్లంపేటలో రోడ్డు రచ్చతో రోడ్డెక్కిన గ్రామస్తులు

**గ్రామం మధ్యలో 100 ఫీట్ల రోడ్డు వద్దంటూ నిరసన**
**పెద్దలకు ఒక న్యాయం...పేదలకు మరొకటా?**
**పేదల ఇళ్లపై మాస్టర్ ప్లాన్ బుల్డోజర్?**

**కుత్బుల్లాపూర్**

మల్లంపేట గ్రామంలో మాస్టర్ ప్లాన్ రహదారి వివాదం ఉద్రిక్తతకు దారితీసింది. దుండిగల్ మున్సిపల్ సర్కిల్ మల్లంపేట ఓఆర్ఆర్ ఎగ్జిట్ నుండి బాచుపల్లి వెళ్లే ప్రధాన రహదారిపై గ్రామస్తులు భారీ ధర్నా నిర్వహించారు. ఫ్లెక్సీలు, ప్లేకార్డులు చేత పట్టుకుని నిరసన పాదయాత్ర చేపట్టిన స్థానికులు "మాకు న్యాయం కావాలి", "ఓల్డ్ హైదరాబాద్ రోడ్డు తెరవాలి", "మాస్టర్ ప్లాన్ పేరుతో గ్రామాన్ని నాశనం చేయొద్దు" అంటూ నినాదాలతో నిరసన వ్యక్తం చేశారు.గ్రామస్తుల ఆవేదన ప్రకారం... పాత మాస్టర్ ప్లాన్లో గ్రామానికి మూడు ప్రధాన రహదారులు ఉండగా, ప్రస్తుతం ప్రతిపాదిస్తున్న కొత్త రహదారి సవరణలతో గ్రామం తీవ్రంగా నష్టపోతుందని పేర్కొన్నారు. ఇప్పటికే అపార్ట్మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీల వాహన రద్దీతో గ్రామ ప్రజలు ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇలాంటి పరిస్థితుల్లో కొత్తగా 100 ఫీట్ల రహదారి ప్రతిపాదన గ్రామ ఉనికికే ప్రమాదమని ఆరోపించారు.

### పేదల ఇళ్లపై అభివృద్ధి బుల్డోజర్

ధర్నాలో పాల్గొన్న బీజేపీ దుండిగల్ మున్సిపాలిటీ సర్కిల్ ఉపాధ్యక్షుడు ఆంజనేయులు మాట్లాడుతూ... "మల్లంపేటకు మోడీ బిల్డర్ రోడ్డు, 110 సర్వే నంబర్ రోడ్డు, ఓల్డ్ హైదరాబాద్ రోడ్డు వంటి మూడు ప్రధాన రహదారులు ఇప్పటికే ఉన్నాయి. అయినప్పటికీ ఊరు మధ్యలోనే 100 ఫీట్ల రహదారి తీసుకురావడం అన్యాయం" అని మండిపడ్డారు."500 ఏళ్ల చరిత్ర ఉన్న గ్రామంలో చిన్న చిన్న దుకాణాలు పెట్టుకుని జీవిస్తున్న పేద, మధ్యతరగతి కుటుంబాలపై ఈ నిర్ణయం తీవ్ర ప్రభావం చూపుతుంది. 30 లేదా 40 ఫీట్లు విస్తరణ వరకు ప్రజలు అర్థం చేసుకుంటారు. కానీ ఏకంగా 100 ఫీట్ల రహదారి పేరుతో గ్రామాన్ని చీల్చేయడం సరైంది కాదు" అని ఆయన వ్యాఖ్యానించారు.పెద్దలకు ఒక న్యాయం...పేదలకు మరో న్యాయమా?ప్రభుత్వం అభివృద్ధి పేరుతో పేదల జీవితాలతో ఆడుకుంటోందని ఆరోపించిన గ్రామస్తులు... పెద్ద పెద్ద రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులకు అనుకూలంగా మాస్టర్ ప్లాన్ మార్పులు చేస్తున్నారని విమర్శించారు. "పేదలకు ఒక న్యాయం... పెద్దలకు మరో న్యాయమా?" అనే ప్రశ్నలు ధర్నా ప్రాంగణంలో గట్టిగా వినిపించాయి.స్పందించకపోతే భారీ ఉద్యమంముఖ్యమంత్రి, సంబంధిత అధికారులు, హెచ్ఎండిఏ వెంటనే స్పందించి ప్రతిపాదిత 100 ఫీట్ల రహదారిని ఉపసంహరించుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

# సత్తుపల్లి అభివృద్ధే ధ్యేయం

- **ఎమ్మెల్యే రాగమయి దయానంద్**
- **రూ.2.50 కోట్లతో చెరువు పునరుద్ధరణ**
- **నూతన రేషన్ దుకాణం ప్రారంభం**



**సత్తుపల్లి:**
సత్తుపల్లి పట్టణ అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పలు మౌలిక సదుపాయాల పనులను వేగవంతం చేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. గురువారం పట్టణంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. మొదటగా సుమారు రూ.2.50 కోట్ల వ్యయంతో చేపట్టనున్న వేశ్యకాంతుల చెరువు పునరుద్ధరణ పనులకు రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ రైతులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి శంకుస్థాపన చేశారు. చెరువు కట్టకు స్టోన్ పిచ్చింగ్, ఇరువైపులా స్టీల్ రైలింగ్ ఏర్పాటు, జంగిల్ క్లియరింగ్, కట్టపై వాకింగ్ ట్రాక్ మరమ్మత్తులు, బతుకమ్మ ఘాట్ నిర్మాణం వంటి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ పనులు పూర్తయితే చెరువు సుందరీకరణతో పాటు రైతులకు, ప్రజలకు ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. అనంతరం జేవీఆర్ పార్క్ సమీపంలోని డబుల్ బెడ్రూమ్ అపార్ట్మెంట్ వద్ద రూ.45 లక్షల వ్యయంతో చేపట్టనున్న డ్రైనేజీ నిర్మాణ పనులను పరిశీలించారు. తహశీల్దార్, మున్సిపల్ కమిషనర్తో కలిసి భూసేకరణ, స్థల సేకరణ అంశాలపై సమీక్ష నిర్వహించి, పనులు వేగంగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అపార్ట్మెంట్ నివాసితులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. తదుపరి సత్తుపల్లి మున్సిపాలిటీ 7వ వార్డులోని రాజీవ్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన రేషన్ షాప్ ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు స్వయంగా సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తూ ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ నరసింహ, తహశీల్దార్, మున్సిపల్ చైర్మన్ రిహనా బేగం కమల్ పాషా, ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, మున్సిపల్ కౌన్సిలర్లు తోట సుజాల రాణి, హకీమ్, నసీమా షరీఫ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గాదె చెన్నారావు, మున్సిపల్ ఏఈ, ఇరిగేషన్ జేఈ, సీనియర్ నాయకులు బొంతు వేణు, విరివాడ భూషణం, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రేషన్ డీలర్లు, రైతులు, అపార్ట్మెంట్ నివాసితులు, రాజీవ్ కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధే 'ఆరోగ్య పాఠశాల' లక్ష్యం

**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**

**ఆదిలాబాద్:** జిల్లాలోని విద్యార్థుల ఆరోగ్యం, విద్య, భద్రత, వ్యక్తిత్వ వికాసాన్ని సమగ్రంగా పెంపొందించడమే 'ఆరోగ్య పాఠశాల' కార్యక్రమం ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. గురువారం బజార్హత్నూర్ మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల, కళాశాలలో నిర్వహించిన మూడో విడత ఆరోగ్య పాఠశాల కార్యక్రమాన్ని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు, విద్యార్థులు ఆరోగ్య పాఠశాల అంశాలపై పాటలు, నృత్యాలు, నాటికల ద్వారా అవగాహన కల్పించారు. అనంతరం అధికారులు వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం, మానసిక ఆరోగ్యం, మాదకద్రవ్యాల నివారణ, కాలానుగుణ వ్యాధుల నియంత్రణ, వ్యక్తిత్వ వికాసం వంటి ఆరు ప్రధాన అంశాలపై విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత రెండేళ్లుగా జిల్లాలో ఆరోగ్య పాఠశాల కార్యక్రమం విజయవంతంగా అమలవుతూ రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందిందని తెలిపారు. ఈ విద్యా సంవత్సరం నుంచి విద్యార్థుల రక్షణ కోసం పాక్సో చట్టంపై ప్రత్యేక అవగాహన కల్పించడంతో పాటు పాక్సో క్యాలెండర్ ను విడుదల చేశామని చెప్పారు. పాఠశాలల్లో విద్యార్థులు తమ సమస్యలను గోప్యంగా తెలియజేసేందుకు ఫిర్యాదుల పెట్టెలు ఏర్పాటు చేస్తున్నామని, ప్రతినెల మొదటి తేదీన వాటిని తెరిచి సమస్యలను పరిష్కరిస్తామని వివరించారు. వర్షాకాలంలో వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, బహిరంగ మలమూత్ర విసర్జనకు దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థుల్లో ఇంగ్లీష్ భాషా నైపుణ్యాలు పెంపొందించేందుకు ప్రముఖుల జీవిత చరిత్రలను చదివించాలని, గణితం, సైన్స్లో పట్టు సాధించేందుకు ఖాన్ అకాడమీ వేదికను వినియోగించుకోవాలని సూచించారు. ఈ ఏడాది జిల్లా నుంచి రికార్డు స్థాయిలో 67 మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీ బాసరకు ఎంపిక కావడం ఆనందదాయకమని పేర్కొన్నారు. అనంతరం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు మంచి ఆరోగ్యం, నాణ్యమైన విద్య రెండూ సమానంగా అవసరమన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లలో ప్రవేశాలకు డిమాండ్ పెరగడం ప్రభుత్వ విద్యపై ప్రజల విశ్వాసానికి నిదర్శనమని అన్నారు. జిల్లాలో ఆరోగ్య పాఠశాల, విద్యా క్యాలెండర్ అమలు ద్వారా జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం అభినందనీయమని కొనియాడారు. మోడల్ స్కూల్లో సీసీ రోడ్డు, బోర్వెల్ సదుపాయాలు కల్పించడంతో పాటు అన్ని కేజీబీవీలు, మోడల్ స్కూళ్లలో మంచినీటి శుద్ధి ప్లాంట్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమంపై జిల్లా కలెక్టర్ చూపుతున్న చొరవ ప్రశంసనీయమని కొనియాడారు. ప్రతి పాఠశాలలో గ్రంథాలయాల ఏర్పాటు కోసం కృషి చేస్తానని, విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా పాక్సో చట్టం క్యాలెండర్ ను ఆవిష్కరించడంతో పాటు పోషకాహార తోటను ప్రారంభించి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ రవీందర్, తహశీల్దార్ శ్యాంసుందర్, ఎంపీడీఓ మహేందర్ రెడ్డి, ఎంఈఓ రాంకిషన్, అకడమిక్ కోఆర్డినేటర్లు లక్ష్మణ్, అజయ్, స్థానిక సర్పంచ్ సాయన్న, ప్రిన్సిపాల్ సంగీత, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# అంతర్రాష్ట్ర దొంగనోట్ల ముఠా గుట్టురట్టు

- **12 మంది అరెస్ట్.. ముఠాలో టీజీఎస్పీ కానిస్టేబుల్, రిజర్వ్ ఏఎస్సై**
- **రూ.17.60 లక్షల నగదు స్వాధీనం**



**సత్తుపల్లి:** ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలో సంచలనం సృష్టించిన అంతర్రాష్ట్ర దొంగనోట్ల ముఠా గుట్టును పోలీసులు ఛేదించారు. ఈ కేసులో 12 మంది నిందితులను అరెస్టు చేసి రిమాండ్కు తరలించగా, మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు ఏసీపీ వసుంధర యాదవ్ తెలిపారు. గురువారం సత్తుపల్లి ఏసీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. సత్తుపల్లి సీఐ టి.శ్రీహరి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు సత్తుపల్లి, గంగారం ప్రాంతాలను కేంద్రంగా చేసుకుని కార్యకలాపాలు సాగిస్తున్న ముఠాపై నిఘా పెట్టి సాంకేతిక ఆధారాలు, కాల్ డేటా విశ్లేషణ, గూఢచారి సమాచారంతో ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించి నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. విచారణలో ముఠాలో టీజీఎస్పీ 15వ బెటాలియన్కు చెందిన ఓ కానిస్టేబుల్, రిజర్వ్ ఏఎస్సై సభ్యులుగా ఉన్నట్లు పేర్కొన్నారు. నిందితులు తమను పోలీసు అధికారులమని పరిచయం చేసుకుని నకిలీ దాడులు నిర్వహిస్తూ ప్రజలను బెదిరించి డబ్బులు వసూలు చేసేవారు. అలాగే "మీ డబ్బును రెట్టింపు చేసి ఇస్తాం" అంటూ నమ్మించి భారీ మొత్తాల్లో మోసాలకు పాల్పడినట్లు విచారణలో తేలిందన్నారు. నకిలీ కరెన్సీ కట్టలను చూపించి బాధితులను మోసం చేసినట్లు గుర్తించడం జరిగిందన్నారు. నిందితుల వద్ద నుంచి రూ.17.60 లక్షల నగదుతో పాటు రెండు ఇన్నోవా, ఒక ఎర్టిగా, ఒక ద్విచక్ర వాహనం, 16 సెల్ఫోన్లు, పోలీస్ యూనిఫాంలు, సంకెళ్లు, నకిలీ కరెన్సీ నోట్ల కట్టలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ సామగ్రిని నకిలీ దాడులు, మోసాలకు ఉపయోగించినట్లు తెలిపారు. ఈ ముఠా తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల్లో కూడా మోసాలకు పాల్పడినట్లు అనుమానిస్తున్నామని, పరారీలో ఉన్న మరో ఇద్దరి కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయని పేర్కొన్నారు. నకిలీ కరెన్సీ మూలాలు, ముఠా కార్యకలాపాలపై సమగ్ర దర్యాప్తు కొనసాగుతోందన్నారు. పోలీసుల పేరుతో ఎవరైనా డబ్బులు అడిగినా, డబ్బును రెట్టింపు చేస్తామని ఆశ చూపినా ప్రజలు నమ్మవద్దని, అనుమానాస్పద వ్యక్తుల గురించి వెంటనే సమీప పోలీస్ స్టేషన్కు సమాచారం ఇవ్వాలని సూచించారు. కేసును ఛేదించిన ప్రత్యేక పోలీసు బృందాన్ని అభినందించారు.

# విద్యారంగ సమస్యలు పరిష్కరించకుంటే సమరశీల పోరాటాలు

- **ఈనెల 10న రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ ను జయప్రదం చేయండి**

**హన్మకొండ:** రాష్ట్రంలో విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 10న కేజీ నుంచి పీజీ వరకు అన్ని విద్యాసంస్థల బంద్కు పిలుపునిచ్చినట్లు వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, తల్లిదండ్రులు, ప్రజాస్వామ్యవాదులు బంద్కు సహకరించి విజయవంతం చేయాలని కోరారు. హన్మకొండ ప్రెస్క్లబ్లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి భాషబోయిన సంతోష్, ఏఐఎఫ్డీఎస్ జిల్లా కార్యదర్శి మాస్ సావిత్రి, పీడీఎస్యూ జిల్లా కార్యదర్శులు బొక్క నరసింహారావు, మర్రి మహేష్, ఏఐఎస్బీ జిల్లా కన్వీనర్ సతీష్, ఏఐడీఎస్ఓ జిల్లా కార్యదర్శి వెంకటేష్ తదితరులు మాట్లాడారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది కొరత, మౌలిక వసతుల లేమి, హాస్టళ్లలో దయనీయ పరిస్థితులు, ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిలు, ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీ, విద్యార్థుల భద్రత వంటి సమస్యలు తీవ్రంగా ఉన్నప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక, అధ్యాపకేతర పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, అన్ని విద్యాసంస్థల్లో మౌలిక వసతులు కల్పించాలని, హాస్టళ్లలో నాణ్యమైన భోజనం, తాగునీరు, వైద్య సేవలు అందించాలని, ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల నియంత్రణకు చట్టాన్ని కఠినంగా అమలు చేయడంతో పాటు మహిళా విద్యార్థుల భద్రత కోసం ప్రతి విద్యాసంస్థలో అంతర్గత ఫిర్యాదుల కమిటీలను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా మరింత ఉధృతమైన ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం అనంతరం బంద్కు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు స్టాలిన్, జస్వంత్, అజయ్, యూసఫ్ తదితర విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.



# ఆపదలో బాలికలకు "షీ" టీమ్ అండగా ఉంటుంది

- "షీ" టీమ్ పోలీసులు
- విద్యార్థినుల్లో చట్టాలపై అవగాహన,ఆత్మరక్షణపై సూచనలు
- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS ఆదేశాల మేరకు

**నారాయణపేట, జులై,02**



జిల్లా కేంద్రంలోని మార్కెట్ లైన్ ప్రభుత్య ఉన్నత పాఠశాలలో "షీ" టీమ్ పోలీసులు సామాజిక అంశాలు, మహిళల భద్రత, చట్టపరమైన రక్షణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినులకు మహిళల రక్షణ కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న చట్టాలు, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సైబర్ నేరాల నివారణ, వేధింపులపై ఫిర్యాదు చేసే విధానం గురించి వివరించారు.ఈ సందర్భంగా "షీ" టీమ్ పోలీసులు కవిత, జ్యోతి లు మాట్లాడుతూ... మహిళలు, బాలికల భద్రతకు తెలంగాణ పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పాఠశాలలు, కళాశాలలు, బహిరంగ ప్రదేశాలు, సామాజిక మాధ్యమాల్లో ఎలాంటి వేధింపులు ఎదురైనా భయపడకుండా వెంటనే "షీ" టీమ్‌ను సంప్రదించాలని సూచించారు.ఎవరైనా ఈవ్ టీజింగ్, వెంటపడటం, అసభ్యకరంగా మాట్లాడటం, సోషల్ మీడియాలో వేధించడం, అసభ్య సందేశాలు పంపడం లేదా ఇతర రూపాల్లో ఇబ్బందులకు గురి చేస్తే వెంటనే షీ టీమ్ మొబైల్ నంబర్ 8712670398కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. విద్యార్థినులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని, అపరిచితులతో వ్యక్తిగత వివరాలు పంచుకోవద్దని, సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలని సూచించారు. అలాగే అత్యవసర పరిస్థితుల్లో వెంటనే కుటుంబ సభ్యులకు, ఉపాధ్యాయులకు లేదా పోలీసులకు సమాచారం అందించాలని చెప్పారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, "షీ" టీమ్ పోలీసులు బాలరాజు, చెనప్ప, విద్యార్థినులు పాల్గొన్నారు.

# అధికారుల మాట నమ్మి ఇల్లు కూల్చింది

- ఇప్పుడు నిలువ నీడ లేక అవస్థలు.
- ఇందిరమ్మ ఇల్లుకోసం ఆశగా ఎదురుచూపు.

**రాయపోల్,జూలై 2:**





అధికారుల సూచనలను నమ్మి ఉన్న ఏకైక పాత ఇంటిని కూల్చివేసిన ఓ మహిళకు ఎనిమిది నెలలు గడిచినా ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాకపోవడంతో నిలువ నీడ లేక అవస్థలు పడుతున్న ఘటన మండల కేంద్రం రాయపోల్‌లో వెలుగుచూసింది.

రాయపోల్ గ్రామానికి చెందిన ఉషణగళ్ల కవిత తెలిపిన వివరాల ప్రకారం.. మొదటి విడతలో తమ కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరైందని అధికారులు చెప్పడంతో, కొత్త ఇంటి నిర్మాణం కోసం పాత ఇంటిని కూల్చివేయాలని సూచించారు. అధికారుల మాట నమ్మి ఉన్న ఇంటిని పూర్తిగా కూల్చివేశారు. అనంతరం ఇంటి స్థలంలో గుర్తులు (ముగ్గు) వేయడానికి వచ్చిన అధికారులు, ఆన్‌లైన్‌లో పేరు మిస్సైందని చెప్పి వెళ్లిపోయారు. అప్పటి నుంచి సమస్యను పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్నారని కవిత ఆరోపించారు. ఇల్లు కూల్చివేసి దాదాపు ఎనిమిది నెలలు గడిచినా ఇప్పటికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాలేదని, అధికారుల కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఎలాంటి స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల నివాసం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ఆన్‌లైన్‌లో నమోదైన లోపాన్ని వెంటనే సరిచేసి తమకు మంజూరైన ఇందిరమ్మ ఇంటిని అందజేసి న్యాయం చేయాలని బాధితురాలు ప్రభుత్వాన్ని, సంబంధిత అధికారులను కోరారు.

# నగరం ముంపు నివారణకు స్ట్రాం వాటర్ డ్రైన్ల ఏర్పాటుపై సమీక్ష

**వరంగల్, జూలై 2**

నగరంలో వర్షాకాలంలో ముంపు సమస్యలు తలెత్తకుండా స్ట్రాం వాటర్ డ్రైన్ల ఏర్పాటును వేగవంతం చేయాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వెంకన్న అధికారులను ఆదేశించారు. జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలో గురువారం శుభ్ కన్సల్టెంట్ ప్రతినిధులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన సమీక్షలో కమిషనర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కన్సల్టెంట్ ప్రతినిధులు నగరంలో చేపట్టిన సర్వే వివరాలను ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జలవనరులు, బొంది వాగు, వడ్డేపల్లి చెరువు, బాటిల్‌నెక్ ప్రాంతాలు, స్ట్రాం వాటర్ డ్రైన్ల నిర్మాణానికి అవసరమైన ప్రభుత్వ, ప్రైవేటు భూములు, పరిహారం అంశాలు, ఇరుకైన ప్రాంతాల్లో చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. సమావేశంలో సూపరింటెండింగ్ ఇంజనీర్ రాజ్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవికుమార్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజ్‌కుమార్, కన్సల్టెంట్ ప్రతినిధి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# వికారాబాద్ పట్టణంలో విస్తృత ప్రత్యేక తనిఖీలు

- గంజాయి స్వాధీనం, వాహనాల స్వాధీనం – ప్రజల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యం
- వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPS ఆదేశాల మేరకు,

**వికారాబాద్, జులై,02**




వికారాబాద్ డీఎస్పీ పర్యవేక్షణలో రాత్రి వికారాబాద్ పట్టణంలోని రైల్వే స్టేషన్, బస్ స్టాండ్, నిర్మానుష్య ప్రాంతాలు, రాత్రి వేళల్లో తెరిచి ఉన్న దుకాణాలు తదితర ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించబడినాయి. ఈ తనిఖీలలో వికారాబాద్ టౌన్ ఇన్స్పెక్టర్ రఘు కుమార్ , ఐదుగురు సబ్-ఇన్స్పెక్టర్లు, పోలీసు సిబ్బంది, క్విక్ రెస్పాన్స్ టీమ్ (QRT) సభ్యులు పాల్గొని Populan Device సహాయంతో అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. తనిఖీల సందర్భంగా బస్ స్టాండ్ సమీపంలో సుమారు 15 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకొని, సంబంధిత వ్యక్తిపై చట్టపరమైన చర్యలు ప్రారంభించారు. అలాగే వాహనాలకు సంబంధించిన చెల్లుబాటు అయ్యే పత్రాలను చూపించలేకపోయిన ఎనిమిది ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకుని, మోటార్ వాహనాల చట్టం ప్రకారం కేసులు నమోదు చేశారు.ఈ ప్రత్యేక తనిఖీల ద్వారా నేరచరిత్ర కలిగిన వ్యక్తులు, అనుమానాస్పదంగా సంచరించే వ్యక్తుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచడంతో పాటు, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడం, మాదకద్రవ్యాల రవాణా మరియు వినియోగాన్ని నియంత్రించడం,దొంగతనాలు, ఇతర నేరాలను నివారించడం, ప్రజలకు సురక్షితమైన వాతావరణాన్ని కల్పించడం లక్ష్యంగా చర్యలు చేపట్టడం జరిగింది అని వికారాబాద్ డీఎస్పీ అంజయ్య తెలిపినారు.జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు వికారాబాద్ సబ్ డివిజన్ పోలీసులు నిరంతరం కట్టుబడి పనిచేస్తున్నారని, ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండి అనుమానాస్పద వ్యక్తులు లేదా చట్టవ్యతిరేక కార్యకలాపాల గురించి వెంటనే సమీప పోలీసు స్టేషన్‌కు లేదా డయల్-100కు సమాచారం అందించాలని తెలిపినారు. ప్రజల సహకారంతోనే నేరాలను సమర్థవంతంగా అరికట్టడం సాధ్యమవుతుందని డీఎస్పీ అంజయ్య తెలిపారు.

# కామ్రేడ్ కోలా శంకర్ ఆశయాల సాధనకు ఉద్యమాలే మార్గం

- కొలనుపాకలో 36వ వర్ధంతి సభ.. విద్యా హక్కుల పరిరక్షణకు పోరాటం చేయాలని పిలుపు

**ఆలేరు, జూలై 2:**



విద్యార్థులు, యువజనులు, రైతులు, కూలీల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన అమరజీవి కామ్రేడ్ కోలా శంకర్ ఆశయాలను నేటి తరం ముందుకు తీసుకెళ్లాలని పీడీఎస్‌యూ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఎం శ్రీనివాస్ పిలుపునిచ్చారు. కోలా శంకర్ 36వ వర్ధంతి సందర్భంగా ఆలేరు మండలం కొలనుపాకలో గురువారం ఘనంగా వర్ధంతి సభ నిర్వహించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు మామిడాల ప్రవీణ్ జెండా ఆవిష్కరించగా, అనంతరం కోలా శంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ, విద్యార్థుల సమస్యల పరిష్కారంతో పాటు రైతులు, వ్యవసాయ కార్మికులు, శ్రామిక ప్రజల హక్కుల కోసం కోలా శంకర్ నిరంతరం పోరాడారని గుర్తు చేశారు. ప్రజా సమస్యలపై ఆయన చూపిన నిబద్ధతను తట్టుకోలేక అప్పటి ఆర్‌ఎస్‌యూకు చెందిన వ్యక్తులు కిరాతకంగా హత్య చేశారని పేర్కొన్నారు. వ్యక్తిని హత్య చేయగలిగినా, ఆయన ఆశయాలను, పోరాట స్ఫూర్తిని ఎవరూ అంతం చేయలేరని అన్నారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా రంగాన్ని ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ దిశగా తీసుకెళ్తున్నాయని విమర్శించారు. విద్య హక్కును పరిరక్షించేందుకు, పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్య అందేలా ఉద్యమాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాస్వామిక విలువలను కాపాడడంలో విద్యార్థి ఉద్యమాలు కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. అమరుల త్యాగాలను జయంతులు, వర్ధంతి కార్యక్రమాలకే పరిమితం చేయకుండా, వారు చూపిన పోరాట మార్గంలో నడిచినప్పుడే వారి ఆశయాలను సాకారం చేయగలమన్నారు. విద్యా రంగ సమస్యలు, నిరుద్యోగం, సామాజిక అన్యాయాలకు వ్యతిరేకంగా యువత పోరాటాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడాల భిక్షపతి, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ ఉదయ్, ఏఐకేఎంఎస్ జిల్లా గౌరవాధ్యక్షుడు మామిడాల సోమయ్య, జిల్లా అధ్యక్షుడు కల్లెపు అడివయ్య, ప్రధాన కార్యదర్శి బేజాడి కుమార్, పీఓడబ్ల్యూతో పాటు ఐఎఫ్‌టీయూ, పీవైఎల్, అరుణోదయ తదితర ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రాఘవ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ అందజేత

## రాజానగరం పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



**ఆలేరు, జూలై 2:**

విద్యార్థుల్లో విద్యాభివృద్ధికి తోడ్పాటుగా రాఘవ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆలేరు మండలం రాజానగరం ప్రభుత్వ పాఠశాలలో గురువారం నోట్‌బుక్స్, స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ కంపరాజు వెంకటేశ్వర రాజు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు విద్యాసామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రిని అందించడం అభినందనీయమైన కార్యక్రమమని పేర్కొన్నారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు విద్యార్థుల్లో చదువుపై ఆసక్తిని పెంపొందించడంతో పాటు వారి భవిష్యత్తుకు ఉపయోగపడతాయని అన్నారు. ప్రధానోపాధ్యాయులు హేమలత మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రాఘవ స్వచ్ఛంద సేవా సంస్థ అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు అందించిన స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకుని విద్యలో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎండీ ఖాజా, రాఘవ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు గుండ్రాజు నరసింహ రాజు, కొత్వాల్ సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ మలిదశ ఉద్యమకారుల ముందస్తు అరెస్టు

## పోలీసుల అదుపులో ఉద్యమకారులు




**ఆలేరు, జులై 02:**

రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ మలిదశ ఉద్యమకారులకు హామీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ గురువారం హైదరాబాద్ ఉప్పల్ వద్ద చేపట్టిన ధర్నా కార్యక్రమంనకు బయలుదేరిన ఆలేరు పట్టణ ఉద్యమకారులను ఆలేరు పోలీసులు అదుపులో తీసుకున్నారు. పోలీసులు తమను అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఖండిస్తూ, అక్రమ అరెస్టులతో ఉద్యమాల్ని ఆపలేరని అన్నారు. తమ సమస్యలను పరిష్కరించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల మలిదశ ఉద్యమకారుల కమిటీ వేయడం జరిగిందని, కానీ కమిటీ హామీల అమలులో కదలిక లేదని, రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ మలిదశ ఉద్యమకారులకు హామీ ఇచ్చిన ప్రకారం ఉద్యమకారులను గుర్తించి ఉద్యమకారులకు 250 గజాల స్థలము, పెన్షన్ సౌకర్యం, హెల్త్ కార్డు వెంటనే ఇచ్చి అమలు చేయాలని డిమాండ్ చేసారు. తమ డిమాండ్లను పరిష్కరించని పక్షంలో రాబోయే రోజుల్లో తెలంగాణ మలిదశ ఉద్యమకారుల హక్కుల సాధనకై పెద్ద ఎత్తున ఉద్యమాలను తీవ్రతరం చేస్తామని తెలియపరచుచున్నాము. అరెస్ట్ అయిన వారిలో పసుపు నూరి వీరేశం, రాచకొండ జనార్ధన్, చెక్క వెంకటేష్, తమ్మిడి పద్మారావు, బదుగు జహంగీర్ ఉన్నారు.

# మృతుడి కుటుంబానికి ఆర్థిక చేయూత



రూ.3 వేల నగదు, 50 కిలోల బియ్యం అందజేత

**ఆలేరు, జూలై 2:**

ఆలేరు మండలం కొల్లూరు గ్రామానికి చెందిన ఏదుల వెంకటేష్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందడంతో ఆయన కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పారునంది భాస్కర్ మృతుడి కుటుంబానికి మూడు వేల రూపాయల ఆర్థిక సహాయం అందించి ధైర్యం చెప్పారు. టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనగాం ఉపేందర్ రెడ్డి తరఫున 50 కిలోల బియ్యాన్ని కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కష్టకాలంలో బాధిత కుటుంబాలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. పార్టీ తరఫున కుటుంబానికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కొల్లూరు గ్రామ సర్పంచ్ జనగాం సుధారాణి శ్రీపాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు గాజుల ఆంజనేయులు, వార్డు సభ్యులు మస్తాన్, పార్టీ నాయకులు గ్యాదపాక మల్లేష్, లక్ష్మయ్య, గణేష్, బాలరాజు, నర్సింగ్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం జిల్లాలో యూరియా కొరత లేదు

**ఖమ్మం, జూలై 2:**

ఖమ్మం జిల్లాలో రైతుల అవసరాలకు సరిపడా యూరియా నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని జిల్లా వ్యవసాయ అధికారి ధనసరి పుల్లయ్య తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో 17,156.88 మెట్రిక్ టన్నుల (3.81 లక్షల బస్తాలు) యూరియా అందుబాటులో ఉందన్నారు. యూరియా యాప్ ద్వారా 56,926 మంది రైతులు బుకింగ్ చేసుకోగా, 1.60 లక్షల బస్తాలు కొనుగోలు చేసినట్లు తెలిపారు.

ఈవార్తలు
# వినోదవాణి CINEMA
శుక్రవారం 3-7-2026, జగిత్యాల | www.evarthalu.com 

## లవ్లీ చిత్రం



మాళవిక మోహనన్



## అక్టోబర్ 15న 'జైలర్2' రిలీజ్


రజనీకాంత్ కథానాయకుడిగా నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ థ్రిల్లర్ 'జైలర్2'. వీళ్లిద్దరి కలయికలో విజయవంతమైన 'జైలర్'కి సీక్వెల్ ఇది. కళానిధి మారన్ నిర్మిస్తున్నారు. మోహన్‌లాల్, శివ రాజ్‌కుమార్, రమ్యకృష్ణ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ విడుదల తేదీ ఖరారైంది. దసరా కానుకగా అక్టోబరు 15న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ విషయాన్ని తెలియజేస్తూ సన్ పిక్చర్స్ వీడియోను పంచుకుంది. మొదటి భాగం ఎక్కడ ఆగిపోయిందో అక్కడి నుంచే సీక్వెల్ ప్రారంభమవుతుందని తాజాగా విడుదల చేసిన వీడియోను బట్టి అర్థం అర్థమవుతోంది. 'జైలర్' క్లైమాక్స్‌లో దేవతా విగ్రహాల స్మగ్లర్ వర్మ.. మాజీ జైలర్ ముత్తువేలు పాండియన్‌ను హెచ్చరిస్తాడు. "నన్ను చంపి నువ్వు ప్రశాంతంగా ఉండలేవు. ఒక పెద్ద ప్రపంచం నా వెనకాల ఉంది జైలర్. ఇదొక పెద్ద నెట్‌వర్క్. ఎవరెవరు?ఎప్పుడెప్పుడు? వస్తారో నీకు తెలియదు. నీ జీవితం నరకం అవుతుంది" అంటాడు. అవే విజువల్స్ వీడియోలో చూపిస్తూ, మూవీలోని మిగిలిన పాత్రలను ఫ్లాష్ చేసుకుంటూ వెళ్లారు. 'జైలర్'తో పోలిస్తే, ఇందులో పాత్రలు మరింత బలంగా ఉండేలా కనిపిస్తున్నాయి. తొలి భాగంలో కనిపించిన వారితో పాటు, కొత్త వారు కూడా ఈసారి థ్రిల్ పంచనున్నారు. మరి ముత్తువేల్ పాండియన్‌కు ఎదురయ్యే సవాళ్లు ఏంటి? వాటిని ఎలా అధిగమించాడు? విగ్రహాల స్మగ్లింగ్ నెట్‌వర్క్‌ను ఎలా కనిపెట్టాడు? తన కుటుంబానికి ఆపద రాకుండా ఎలాంటి ప్లాన్ వేశాడు? అన్నది తెలియాలంటే సినిమా చూడాల్సిందే.




## అక్టోబర్ 16న 'విశ్వంభర' విడుదల

మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ సోషియో-ఫాంటసీ అడ్వెంచర్ మూవీ 'విశ్వంభర' విడుదలపై ఎట్టకేలకు ఒక స్పష్టత వచ్చేసినట్లు తెలుస్తుంది. ఈ భారీ బడ్జెట్ విజువల్ వండర్ సినిమాను రాబోయే దసరా కానుకగా 2026, అక్టోబర్ 16న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం సన్నాహాలు చేస్తుంది. ది వెయిట్ ఈజ్ ఓవర్! మెగాస్టార్ చిరంజీవి ఎపిక్ ఫాంటసీ 'విశ్వంభర' దసరా పండుగ కానుకగా ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి వస్తోంది అంటూ పలువురు మీడియా, సినీ ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా పోస్ట్‌లు పెట్టడంతో దసరా రాబోతుండటం పక్కా అని అర్థం అవుతోంది. బ్లాక్‌బస్టర్ హిట్ 'బింబిసార' చిత్ర దర్శకుడు వశిష్ట ఈ సినిమాను ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తుండగా, ప్రముఖ నిర్మాణ సంస్థ యువి క్రియేషన్స్ అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి ఈ చిత్రానికి అద్భుతమైన సంగీతాన్ని అందిస్తున్నారు. గతంలోనే ఈ సినిమా షూటింగ్ పూర్తయినప్పటికీ, అత్యుత్తమ అవుట్‌పుట్ కోసం భారీ విజువల్ ఎఫెక్ట్స్, గ్రాఫిక్స్ పనులపై చిత్రయూనిట్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది.

## ఈ నెలలోనే జననాయగన్ రిలీజ్!




తమిళ సినీ వర్గాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం జన నాయగన్ సినిమా సెన్సార్ కంప్లీట్ చేసి ఇదే నెలలో విడుదల కానుంది. తెలుగు మూవీ భగవంత్ కేసరికి కాస్త మార్పులు చేర్పులు చేసి జన నాయగన్ సినిమాను రూపొందించారు. బాలకృష్ణ పోషించిన పాత్రను విజయ్ పోషించగా, కాజల్ పోషించిన పాత్రను పూజా హెగ్డే పోషించినట్లు తెలుస్తోంది. సినిమాలో శ్రీలీల పాత్ర అత్యంత కీలకంగా ఉంటుంది. ఆ పాత్రను తమిళ్‌లో మమితా బైజు పోషించింది. తెలుగు సినిమాకు రీమేక్ అయినప్పటికీ చాలా మార్పులు చేయడంతో పాటు, నేటివిటీ సైతం మార్చడం వల్ల తెలుగు ప్రేక్షకులు న్యూ మూవీగా ఫీల్ అవుతారనే ఉద్దేశంతో తెలుగు రాష్ట్రాల్లోనూ భారీ ఎత్తున విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. జులై 23 లేదా 24న ప్రేక్షకుల ముందుకు జన నాయగన్ రావడం ఖాయం అంటూ తమిళ సినీ వర్గాల నుంచి సమాచారం అందుతోంది.

## నేడు ప్రైమ్‌లో 'ప్రాజెక్ట్ హెయిల్ మేరీ'

ఈ ఏడాది బాక్సాఫీస్ వద్ద వసూళ్ల సునామీ సృష్టించిన చిత్రం 'ప్రాజెక్ట్ హెయిల్ మేరీ'. ఫిల్ లార్డ్, క్రిస్టోఫర్ మిల్లర్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో హాలీవుడ్ హీరో ర్యాన్ గాస్లింగ్ ప్రధాన పాత్ర పోషించారు. ఇప్పుడీ చిత్రం ఓటీటీలోకి వచ్చేందుకు సిద్ధమైంది. అమెజాన్ ప్రైమ్ వేదికగా జులై 3 నుంచి స్ట్రీమింగ్ కానుంది. ఈ విషయాన్ని తెలుపుతూ సంస్థ వీడియోను విడుదల చేసింది. మార్చిలో విడుదలైన ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా ఆదరణ సొంతం



చేసుకుంది. ఈ ఎపిక్ సైన్స్ ఫిక్షన్ కామెడీ చిత్రం ఏకంగా రూ.6000 కోట్లకు పైగా వసూళ్లు చేసింది. ఇండియాలోనూ రికార్డులు సృష్టించింది. గతంలో విడుదలైన 'ఇంటర్‌స్టెల్లార్', 'డ్యూన్ 2' కంటే ఎక్కువ వసూళ్ల రాబట్టింది. 2025లో వచ్చిన 'అవతార్: ఫైర్ అండ్ యాష్' తర్వాత ఇండియన్ ప్రేక్షకులను ఈ స్థాయిలో మెప్పించిన అంతర్జాతీయ చిత్రం ఇదే కావడం విశేషం. గతం మర్చిపోయిన ఒక వ్యోమగామి అంతరిక్షంలో ఒంటరిగా మానవాళిని రక్షించేందుకు ఎన్ని సాహసాలు చేశాడనే కథతో ఈ చిత్రం రూపొందింది.



## కోలీవుడ్ ఎంట్రీపై జాన్వీ ఫోకస్

జాన్వీ కపూర్ దక్షిణాది చిత్ర పరిశ్రమపై గట్టిగానే దృష్టి సారించింది. ఇప్పటికే తన తల్లికి ఎంతో ఇష్టమైన టాలీవుడ్‌లో అడుగుపెట్టిన ఈ బ్యూటీ, ఇక్కడ వరుసగా రెండు పెద్ద సినిమాలతో భారీ విజయాలను దక్కించుకుంది. ఎన్టీఆర్ సరసన దేవర ఘనవిజయం సాధించగా, రామ్ చరణ్ స్పోర్ట్స్ డ్రామా -పెద్ది- బాక్సాఫీస్ వద్ద విజయం అందుకుంది. తెలుగులో సాధించిన సక్సెస్ జోష్‌తో ఇప్పుడు తమిళ పరిశ్రమ (కోలీవుడ్) పై కన్నేసినట్లు తెలుస్తోంది. తమిళంలో ఈ యంగ్ బ్యూటీ ఎంట్రీ ఇవ్వబోతోందనే వార్తలు ఇండస్ట్రీ వర్గాల్లో ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి. ప్రస్తుతం కోలీవుడ్ సర్కిల్స్ లో వినిపిస్తున్న కథనాల ప్రకారం.. ప్రముఖ దర్శకుడు పా రంజిత్‌కు చెందిన నీలం ప్రొడక్షన్స్ బ్యానర్‌పై..దర్శకుడు సర్జుణం తెరకెక్కించనున్న -కురత్తి- అనే వెబ్ సిరీస్ ద్వారా జాన్వీ కపూర్ తమిళంలోకి అడుగుపెట్టబోతోందని ప్రచారం సాగుతోంది. ఇందులో జాన్వీ ప్రధాన పాత్రలో నటిస్తుందని కథనాలొస్తున్నాయి. అయితే దీనిపై మేకర్స్ నుండి కానీ, జాన్వీ నుండి కానీ ఎలాంటి అధికారిక ధ్రువీకరణ రాలేదు.




## ఇళయరాజా 134 పాటల ప్రసారాలపై నిషేధం

సంగీత దిగ్గజం ఇళయరాజాకు ఢిల్లీ హైకోర్టు నుంచి గట్టి షాక్ తగిలింది. ఇళయరాజాకు మరియు ప్రముఖ మ్యూజిక్ లేబుల్ 'సరిగమ ఇండియా లిమిటెడ్' మధ్య జరుగుతున్న కాపీరైట్ వివాదంలో ఢిల్లీ హైకోర్టు బుధవారం కీలక తీర్పునిచ్చింది. 1976 నుండి వచ్చిన దాదాపు 134 సినిమాల్లోని వివాదాస్పద పాటలను ఇళయరాజా ఎక్కడా ప్రసారం చేయకుండా లేదా ఇతరులకు చేరవేయకుండా కోర్టు తాత్కాలిక నిషేధం విధించింది. ఈ కేసును విచారించిన జస్టిస్ తుషార్ రావు గెడెలా.. ఇళయరాజా తాను సృష్టించిన స్వరాలపై మాత్రమే కాపీరైట్ హక్కులను కలిగి ఉంటారని, సినిమాల్లో ఉపయోగించిన పూర్తి సౌండ్ రికార్డింగ్స్‌పై ఆయనకు హక్కులు ఉండవని స్పష్టం చేశారు. కాపీరైట్ చట్టంలోని సెక్షన్ 14(ఎ) ప్రకారం ఇళయరాజా హక్కులు కేవలం సాహిత్యం మినహాయించిన ట్యూన్స్ వరకే పరిమితమని, ఆ సౌండ్ రికార్డింగులను ఆయన సొంతంగా వాడుకుంటే అది కాపీరైట్ ఉల్లంఘనే అవుతుందని న్యాయస్థానం ప్రాథమికంగా నిర్ధారించింది.



## ఏజెంట్ తర్వాత నరకం అనుభవించా: అఖిల్

అక్కినేని యంగ్ హీరో అఖిల్ చాలా కాలం తర్వాత 'లెనిన్' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. అయితే గత మూడేళ్లుగా ఆయన వెండితెరకు ఎందుకు దూరమయ్యారనే సస్పెన్స్‌కు తాజాగా ఒక ఇంటర్వ్యూలో తెరదించారు. 'ఏజెంట్' సినిమా తర్వాత ఆయన బాత్రూమ్‌లో ప్రమాదవశాత్తు జారిపడటంతో ఎడమ చేతికి తీవ్ర గాయమైందట. ఏకంగా 48 కుట్లు పడటం, కోలుకోవడానికి 16 నెలల టైమ్ పట్టడం వల్లే ఈ గ్యాప్ వచ్చిందని అఖిల్ షాకింగ్ నిజాలు బయటపెట్టారు. 'ఏజెంట్' సినిమా విడుదలైన కొద్ది రోజులకే అఖిల్ ఒక పెద్ద ప్రమాదానికి గురయ్యారు. బాత్రూమ్‌లో ఉన్నప్పుడు అకస్మాత్తుగా జారిపడటంతో అక్కడున్న గాజు ముక్కలు ఆయన ఎడమ చేతికి గట్టిగా గుచ్చుకున్నాయి. ఇక దీంతో చేతి వేళ్లకు ఏకంగా రెండుసార్లు ఆపరేషన్ చేయాల్సి వచ్చింది. ఇక ఆ గాయం వల్ల దాదాపు 48 కుట్లు పడ్డాయని, 8 నెలల పాటు కనీసం బరువులు కూడా ఎత్తలేని పరిస్థితి ఏర్పడిందని అఖిల్ వివరించారు. ఈ ఘోరమైన గాయం నుండి అఖిల్ పూర్తిగా కోలుకోవడానికి ఏకంగా 16 నెలల సుదీర్ఘ సమయం పట్టింది. ఈ కారణం వల్లే సినిమాలు చేయలేకపోయానని ఆయన చెప్పారు. "మూడేళ్ల పాటు గ్యాప్ రావడంతో నా ఫ్యాన్స్ నాపై కాస్త కోపంగా ఉన్నారు. కానీ ఇలాంటి పరిస్థితి మళ్లీ రాదని, ఇకపై వరుసగా సినిమాలు చేస్తానని నా అభిమానులకు ప్రామిస్ చేస్తున్నాను" అని అఖిల్ ఎమోషనల్ అయ్యారు. మురళీకిశోర్ అబ్బూరు దర్శకత్వంలో అఖిల్ నటించిన 'లెనిన్' సినిమా జులై 10న థియేటర్లలోకి రాబోతోంది. ఇక ఈ సినిమాలో అఖిల్ సరసన టాలీవుడ్ లేటెస్ట్ సెన్సేషన్ భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటించింది. ఇప్పటికే విడుదలైన ఈ చిత్ర ట్రైలర్ యూట్యూబ్‌లో 10 మిలియన్లకు పైగా వ్యూస్ సాధించి సోషల్ మీడియాలో దుమ్ములేపుతోంది.



# లాస్ ఏంజిల్స్‌లో నైట్ రైడర్స్ క్రికెట్ గ్రౌండ్ ప్రారంభం..

బాలీవుడ్ సూపర్ స్టార్, కోల్‌కతా నైట్ రైడర్స్ సహ యజమాని షారుఖ్ ఖాన్ చిరకాల స్వప్నం సాకారమైంది. అమెరికాలోని లాస్ ఏంజిల్స్‌లో అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించిన 'నైట్ రైడర్స్ క్రికెట్ గ్రౌండ్' అధికారికంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా షారుఖ్ ఖాన్ ఆనందం వ్యక్తం చేస్తూ, ఇది తాను ఎప్పటినుంచో కంటున్న కల అని అన్నారు. పొమోనాలోని ఫెయిర్‌ప్లెక్స్‌లో నిర్మించిన ఈ స్టేడియంలో జూలై 1న మేజర్ లీగ్ క్రికెట్‌లో భాగంగా లాస్ ఏంజిల్స్ నైట్ రైడర్స్, వాషింగ్టన్ ఫ్రీడమ్ జట్ల మధ్య తొలి మ్యాచ్ నిర్వహించారు. దీంతో తమ సొంత దేశం వెలుపల అంతర్జాతీయ స్థాయి క్రికెట్ స్టేడియాన్ని నిర్మించిన తొలి గ్లోబల్ క్రికెట్ ఫ్రాంచైజీగా నైట్ రైడర్స్ గ్రూప్ చరిత్ర సృష్టించింది. ఈ సందర్భంగా షారుఖ్ ఖాన్ మాట్లాడుతూ, ఒకప్పుడు కలగా మొదలైన ఈ ప్రాజెక్టు నేడు నిజమైందని అన్నారు. ప్రపంచంలో అత్యధికంగా వీక్షించే రెండో క్రీడ అయిన క్రికెట్‌ను లాస్ ఏంజిల్స్‌కు తీసుకురావడం చారిత్రాత్మక ఘట్టమని పేర్కొన్నారు. ఇది కేవలం క్రికెట్ మైదానం మాత్రమే కాదని, సమాజం, వినోదం, కుటుంబాల కోసం రూపొం దించిన ప్రత్యేక వేదిక అని చెప్పారు. ఈ స్టేడియాన్ని లాస్ ఏంజిల్స్ ప్రజలకు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రికెట్ అభిమానులకు అంకితం చేస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు విజయవంతం కావడానికి సహకరించిన ఐసీసీ ఛైర్మన్ జై షాతో పాటు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. నైట్ రైడర్స్ స్పోర్ట్స్ సీఈఓ వెంకీ మైసూర్ మాట్లాడుతూ, ఈ స్టేడియం క్రికెట్ భవిష్యత్తుకు నిదర్శనమని అన్నారు. సుమారు 21 మిలియన్ డాలర్ల వ్యయంతో కేవలం 100 రోజుల్లోనే ఈ మైదానాన్ని నిర్మించామని వెల్లడించారు. ప్రస్తుతం 5,000 మంది ప్రేక్షకులు కూర్చునే సామర్థ్యం ఉన్న ఈ స్టేడియాన్ని, 2028 లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్ నాటికి 15,000 సీట్ల సామర్థ్యానికి విస్తరించనున్నట్లు తెలిపారు. టీ20 క్రికెట్ ఒలింపిక్స్ వేదికగా ఈ మైదానం నిలిచే అవకాశముందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# మూడు ఫార్మాట్లలోనూ వైభవ్..

## మాజీ సెలెక్టర్ సబా కరీమ్ ధీమా

ఐపీఎల్ 2026లో సంచలన ప్రదర్శనతో క్రికెట్ ప్రపంచం దృష్టిని ఆకర్షించిన యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీపై మాజీ భారత వికెట్‌కీపర్, మాజీ సెలెక్టర్ సబా కరీమ్ ప్రశంసలు కురిపించారు. త్వరలోనే వైభవ్ భారత జట్టు తరపున మూడు ఫార్మాట్లలోనూ ఆడతాడని తనకు పూర్తి నమ్మకం ఉందని ఆయన తెలిపారు.

ఐపీఎల్ 2026లో రాజస్థాన్ రాయల్స్ తరఫున ఆడిన వైభవ్ 776 పరుగులు చేసి, 237.30 స్ట్రైక్‌రేట్‌తో ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా నిలిచాడు. విరాట్ కోహ్లీ అత్యుత్తమ సీజన్ తర్వాత గుర్తుండిపోయే ఐపీఎల్ ప్రదర్శన ఏదైనా ఉంటే అది వైభవ్‌దేనని సబా కరీమ్ పేర్కొన్నారు. అగ్రశ్రేణి బౌలర్లను ఎదుర్కొన్న తీరు అసాధారణమని కొనియాడారు. ఐపీఎల్ 2025 వేలానికి ముందే వైభవ్ ప్రతిభ గురించి తనకు సమాచారం వచ్చిందని కరీమ్ గుర్తు చేసుకున్నారు. అతడికి కనీసం ఒక మ్యాచ్‌లోనైనా అవకాశం రావాలని కోరుకున్నానని, తొలి బంతినే ధైర్యంగా ఎదుర్కొన్న తీరు తనను ఆశ్చర్యపరిచిందని చెప్పారు. ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ఆడటమే వైభవ్ ప్రత్యేకత అని వ్యాఖ్యానించారు. రెండో సీజన్‌లో బౌలర్లు ప్రత్యేక ప్రణాళికలతో వచ్చినా అతడు విజయవంతంగా ఎదుర్కొంటాడని తాను ముందే భావించానని కరీమ్ తెలిపారు. రాజస్థాన్ రాయల్స్ బ్యాటింగ్ కోచ్ విక్రమ్ రాథోడ్ కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారని వెల్లడించారు.






# ఇంగ్లండ్ సిరీస్‌కు కోహ్లీ సన్నద్ధత..

## సంజయ్ బంగర్ పర్యవేక్షణలో ప్రత్యేక శిక్షణ

భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ఇంగ్లండ్‌తో జరగనున్న వన్డే సిరీస్ కోసం ముమ్మరంగా సిద్ధమవుతున్నాడు. టీమిండియా మాజీ బ్యాటింగ్ కోచ్ సంజయ్ బంగర్ పర్యవేక్షణలో కోహ్లీ ప్రత్యేకంగా నెట్ ప్రాక్టీస్ చేస్తుండగా, ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీంతో ఇంగ్లండ్ సిరీస్‌లో కోహ్లీ రీఎంట్రీపై అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది.

ఈ కీలక సిరీస్ కోసం కోహ్లీ ఇప్పటికే ముంబై, అలీబాగ్‌లో ప్రత్యేక శిక్షణ శిబిరాన్ని పూర్తి చేశాడు. బ్యాటింగ్ టెక్నిక్‌లో అవసరమైన మార్పులు చేసుకుంటూ, ఫామ్‌ను మరింత మెరుగుపర్చుకునే దిశగా సాధన చేస్తున్నాడు. జూలై 14 నుంచి ప్రారంభమయ్యే మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌కు ప్రకటించిన భారత జట్టులో కోహ్లీకి చోటు దక్కినప్పటికీ, తుది జట్టులో అతని ఎంపిక ఫిట్‌నెస్ క్లియరెన్స్‌పై ఆధారపడి ఉంది.

టెస్టులు, టీ20 అంతర్జాతీయ క్రికెట్‌కు ఇప్పటికే వీడ్కోలు పలికిన విరాట్ కోహ్లీ ఇకపై పూర్తిగా వన్డే ఫార్మాట్‌పైనే దృష్టి సారించనున్నాడు. 2027 వన్డే ప్రపంచకప్‌ను లక్ష్యంగా పెట్టుకుని ఇప్పటి నుంచే సన్నాహాలు ప్రారంభించినట్లు తెలుస్తోంది.

కోహ్లీ పునరాగమనంపై అభిమానులతో పాటు ఆయన చిన్ననాటి కోచ్ రాజ్‌కుమార్ శర్మ కూడా ఆశాభావం వ్యక్తం చేశారు. ఇంగ్లండ్ సిరీస్‌లో చివరి వన్డే మ్యాచ్‌ను లార్డ్స్ మైదానంలో ప్రత్యక్షంగా వీక్షించేందుకు ఆయన సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. కోహ్లీ నెట్ ప్రాక్టీస్ వీడియోలు ప్రస్తుతం భారత క్రికెట్ అభిమానుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతున్నాయి.





# అమెరికా ఆటగాడి రెడ్ కార్డ్‌తో ఫ్రీ పిజ్జా ఆఫర్

ప్రముఖ పిజ్జా సంస్థ డొమినోస్ అమెరికా ఫుట్‌బాల్ అభిమానులకు భారీ శుభవార్త ప్రకటించింది. ఫిఫా వరల్డ్ కప్ 2026లో అమెరికా జట్టుకు చెందిన ఆటగాడికి రెడ్ కార్డ్ రావడంతో 1 మిలియన్ డాలర్ల (సుమారు రూ. 9.49 కోట్లు) విలువైన ఉచిత పిజ్జాలను అందించనున్నట్లు వెల్లడించింది. బోస్నియా అండ్ హెర్జెగోవినాతో జరిగిన రౌండ్ ఆఫ్ 32 మ్యాచ్‌లో అమెరికా స్టార్ స్ట్రైకర్ ఫోలారిన్ బలోగన్‌కు రెడ్ కార్డ్ చూపడంతో ఈ ఆఫర్ అమల్లోకి వచ్చింది. టోర్నీ ప్రారంభానికి ముందే అమెరికా ఆటగాడికి రెడ్ కార్డ్ వస్తే అభిమానులకు ఉచిత పిజ్జాలు ఇస్తామని డొమినోస్ ప్రకటించింది. ఇప్పుడు ఆ హామీని నిలబెట్టుకుంటూ 60 వేలకుపైగా మీడియం పిజ్జాలను పంపిణీ చేయనుంది. రెడ్ కార్డ్ వచ్చినప్పటికీ అమెరికా జట్టు అద్భుత ప్రదర్శనతో బోస్నియాపై 2-0 తేడాతో విజయం సాధించింది. మ్యాచ్ 82వ నిమిషంలో మాలిక్ టిల్‌మాన్ చేసిన గోల్‌తో జట్టు రౌండ్ ఆఫ్ 16కు అర్హత సాధించింది. గత 24 ఏళ్లలో వరల్డ్ కప్ నాకౌట్ మ్యాచ్‌లో అమెరికాకు ఇదే తొలి విజయం కావడం విశేషం.

# హార్దిక్ ట్రేడ్‌పై సీఎస్‌కే క్లారిటీ..

## ఇప్పటివరకు ఎలాంటి చర్చలు లేవు



ఐపీఎల్ 2026 సీజన్ అనంతరం ముంబై ఇండియన్స్ స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా ట్రేడింగ్‌పై జోరుగా వినిపిస్తున్న ఊహాగానాలపై చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) స్పందించింది. హార్దిక్‌ను తమ జట్టులోకి తీసుకొచ్చే అంశంపై ఇప్పటివరకు ఎలాంటి చర్చలు జరగలేదని సీఎస్‌కే సీఈఓ కాశీ విశ్వనాథన్ స్పష్టం చేశారు. ఇటీవల హార్దిక్ పాండ్యాను దక్కించుకునేందుకు సీఎస్‌కే, కోల్‌కతా నైట్ రైడర్స్ సహా పలు ఐపీఎల్ ఫ్రాంచైజీలు ఆసక్తి చూపుతున్నాయంటూ కథనాలు వెలువడ్డాయి. అయితే ఈ ప్రచారంలో ఎలాంటి నిజం లేదని కాశీ విశ్వనాథన్ తెలిపారు. హిందుస్థాన్ టైమ్స్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ, మేజర్ లీగ్ క్రికెట్ (ఎంఎల్‌సీ) ముగిసిన తర్వాతే జట్టుపై పూర్తి స్థాయి సమీక్ష నిర్వహిస్తామని, ఆ తర్వాతే ట్రేడింగ్ వంటి అంశాలపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ప్రస్తుతం అమెరికాలో జరుగుతున్న ఎంఎల్‌సీ టోర్నీ జూలై 18తో ముగియనుంది. ఇదిలా ఉండగా, గత మూడు సీజన్లుగా సీఎస్‌కే ప్లేఆఫ్స్‌కు చేరడంలో విఫలమవుతోంది. 2025లో చివరి స్థానంలో నిలిచిన చెన్నై, 2026లో ఎనిమిదో స్థానంతో సరిపెట్టుకుంది. దీంతో జట్టులో నాయకత్వ మార్పు అవసరమనే చర్చలు జరుగుతున్న నేపథ్యంలో హార్దిక్ పాండ్యా పేరును పలువురు విశ్లేషకులు ప్రస్తావిస్తున్నారు. మరోవైపు, కొన్ని మీడియా కథనాల ప్రకారం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్ మినహా మిగతా ఫ్రాంచైజీలు హార్దిక్‌ను తమ జట్టులోకి తీసుకునేందుకు ఆసక్తి చూపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఇప్పటివరకు ఏ ఫ్రాంచైజీ కూడా దీనిపై అధికారిక ప్రకటన చేయలేదు. ప్రస్తుతం హార్దిక్ ట్రేడింగ్ వ్యవహారం ఊహాగానాలకే పరిమితమైంది.

ఈవార్తలు
# ప్రజావాణి
శుక్రవారం 3-7-2026, జగిత్యాల
www.evarthalu.com
నేటి ఈవార్తలు


నేటి ఈవార్తలు | సంపాదకీయం | Editorial

# చెరువు ఎండె.. ఆగిపోవట్టే రైతన్న గుండె!

తెలంగాణ రైతు ఆకాశం వైపు ఆశగా చూస్తున్నాడు. జూన్ ముగిసి, జూలై ప్రారంభమైనా ఆశించిన వర్షాలు లేక ఖరీఫ్ సాగు మందగించింది. పొలాలు దుక్కి చేసి, విత్తనాలు కొనుగోలు చేసి, అప్పులు చేసి సిద్ధంగా ఉన్న రైతుకు చినుకులే కనిపించడం లేదు. ఇది ప్రకృతి సృష్టించిన పరిస్థితి. కానీ ప్రకృతి అనిశ్చితిని ఎదుర్కొనేలా ముందస్తు ప్రణాళికలు రూపొందించడం ప్రభుత్వ బాధ్యత. దురదృష్టవశాత్తు ఆ బాధ్యత నిర్వహణలో అలసత్వం కనిపిస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. వర్షాలు కురిసినప్పుడు నీరు ఎక్కడికి వెళ్తోంది? చెరువుల్లోకి. కాల్వల్లోకి. వాగుల్లోకి. అదే చెరువులు పూడికతో నిండిపోతే, కాల్వలు ఆక్రమణలకు గురైతే, నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోతుంది. ఒకవైపు వర్షాలు లేవని బాధపడుతూనే, మరోవైపు పడిన కొద్దిపాటి వర్షపు నీటిని కూడా నిల్వ చేసుకోలేని పరిస్థితి ఏర్పడితే దానికి బాధ్యత ఎవరిది?

తెలంగాణ చెరువుల సంస్కృతికి ప్రసిద్ధి. కాకతీయుల కాలం నుంచి నిర్మించిన వేల చెరువులు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ప్రాణాధారం. వాటిని కాపాడి, పూడికతీత చేపట్టి, నిల్వ సామర్థ్యాన్ని పెంచడం ప్రతి ప్రభుత్వానికి నిరంతర బాధ్యత. కానీ అనేక ప్రాంతాల్లో చెరువులు ఇప్పటికీ పూడికతో నిండిపోయి కనిపిస్తున్నాయి. కాల్వల్లో మట్టి పేరుకుపోయింది. ఫీడర్ ఛానెళ్లు మూసుకుపోయాయి. వర్షం వస్తే నీరు నిల్వ కాకుండా వృథాగా వెళ్లిపోయే పరిస్థితి నెలకొంది. ప్రతి ఏడాది వర్షాకాలానికి ముందు ప్రీ-మాన్సూన్ పనులు జరగాలి. చెరువుల పూడికతీత, వాగుల శుభ్రత, డ్రైనేజీల మరమ్మతులు, చిన్నపాటి నీటి వనరుల పునరుద్ధరణ పూర్తి కావాలి. కానీ చాలా చోట్ల ఇవి కాగితాలకే పరిమితమయ్యాయనే విమర్శలు ఉన్నాయి. వర్షాలు ఆలస్యమైన ఈ సమయంలో అయినా యుద్ధప్రాతిపదికన ఈ పనులు చేపడితే, రానున్న వర్షాలను సద్వినియోగం చేసుకునే అవకాశం ఉంటుంది. వ్యవసాయం కేవలం వర్షాలపైనే ఆధారపడే పరిస్థితి నుంచి బయటపడాలంటే ప్రతి చుక్క నీటిని నిల్వ చేయాలి. భూగర్భ జలాలను పెంచాలంటే చెరువులు జీవించాలి. చెరువులు జీవించాలంటే పూడికతీత తప్పనిసరి. ఇది ఒక అభివృద్ధి కార్యక్రమం మాత్రమే కాదు; భవిష్యత్తు తరాలకు నీటి భద్రత కల్పించే కార్యక్రమం.

ఇంకో ఆందోళనకర అంశం పట్టణాలు. హైదరాబాద్ సహా అనేక నగరాల్లో వర్షాలు పడితే నీరు నిలిచిపోవడం, రోడ్లు చెరువులుగా మారడం ప్రతి ఏడాది పునరావృతమవుతోంది. వర్షాలు రాకపోతే నీటి కొరత, వస్తే వరదలు.. ఈ విరుద్ధ పరిస్థితులు ప్రణాళిక లోపానికే నిదర్శనం. డ్రైనేజీల నిర్వహణ, వర్షపు నీటి పారుదల వ్యవస్థలు ముందుగానే సిద్ధం చేయకపోతే ప్రజలే మూల్యం చెల్లించాల్సి వస్తుంది. ప్రభుత్వం చేసే ప్రతి పని ప్రకటనలతో కొలవలేం; ఫలితాలతోనే కొలవాలి. రైతు పొలంలో నీరు నిలిస్తేనే పథకానికి అర్థం ఉంటుంది. చెరువు నిండితేనే అభివృద్ధి కనిపిస్తుంది. భూగర్భ జలాలు పెరిగితేనే ప్రజలకు ప్రయోజనం చేకూరుతుంది. వాతావరణ మార్పుల కారణంగా వర్షపాతం అనిశ్చితంగా మారుతోంది. ఒకేసారి భారీ వర్షాలు, తర్వాత దీర్ఘకాలం ఎండలు సాధారణమవుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో నీటి నిర్వహణకు మరింత శాస్త్రీయ ప్రణాళిక అవసరం. ప్రతి చెరువు, ప్రతి కాల్వ, ప్రతి వాగును భవిష్యత్తు నీటి నిల్వ కేంద్రంగా చూడాలి. దీనికి రాజకీయ సంకల్పం, పరిపాలనా చురుకుదనం రెండూ అవసరం.

# హర్మ్యూజ్ తుఫానులో ఎదురీత




ఈ ఏడాది ఫిబ్రవరి నెలాఖరులో హర్మ్యూజ్ జలసంధి మూతపడినప్పుడు కేంద్ర ప్రభుత్వ అగ్ర ప్రాథమ్యం ఒక్కటే... అదేమిటంటే- మునుపెన్నడూ ఎరుగని సరఫరా-ధరల ఒడుదొడుకుల నుంచి దేశ పౌరులను... ప్రత్యేకించి నిరుపేదలను, అణగారిన వర్గాలను కాచుకోవడం ఎలాగన్నదే. తదుపరి పరిణామాలన్నీ తద్భవాలే! ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మదిలో స్వాభావికంగా పొటమరించిన ఒక ఆలోచన, ఆధునిక చరిత్రలో అత్యంత తీవ్ర ఇంధన సంక్షోభాన్ని దాదాపు నాలుగు నెలల పాటు ఎదురీది, దేశం గట్టెక్కడానికి ఆలంబనగా నిలిచింది.



**హర్దీప్ సింగ్ పూరి**
కేంద్ర పెట్రోలియం-సహజవాయువు శాఖ మంత్రి

అయితే, నిర్దిష్ట ఆధారాలేవీ వెలుగు చూడకముందే తీర్పునిచ్చిన రీతిలో భారత్ భవితవ్యంపై సందేహ మేఘాలు దట్టంగా కమ్ముకున్నాయి. ముడి చమురు అవసరాల్లో 85 శాతానికిపైగా దిగుమతి చేసుకునే దేశం కావడం, ప్రపంచ ఇంధన రవాణాలో 20-30 శాతం హర్మ్యూజ్ జలసంధి గుండానే సాగడం వంటి కారణాలతో ఈ సంక్షోభాన్ని తట్టుకోవడం దుస్సాధ్యమనే వాదన వినిపించింది. కొన్ని దేశాల తరహాలో స్వల్ప కాలంలోనే భారత్‌లోనూ పెట్రోలు పంపులు ఎండిపోయి, ధరలు విపరీతంగా పెరిగి, ఆర్థిక వ్యవస్థ కుప్పకూలే ముప్పుందని జోస్యం మొదలైంది. తద్భిన్నంగా దేశమంతటా నేడు నిల్వలు దండిగా, పెట్రోలు పంపులు ఎలాంటి రద్దీ లేకుండా కాలం సజావుగా సాగిపోతోంది. అన్నింటినీ మించి, ఈ సంక్షోభ సమయాన భారతీయులు ప్రపంచ దేశాల్లోని ఏ వినియోగదారుతో పోల్చినా తక్కువ ధరకే ఇంధనం కొనగలిగారు. ఈ నేపథ్యంలో గట్టెక్కడం దుస్సాధ్యమంటూ దురవగాహనను రగిలించే ప్రయత్నాలు కొనసాగిన నేపథ్యంలో ఆ కథనాల గుట్టును రట్టు చేయడం సముచితమేగాక సందర్భోచితం కూడా!

ఇరాన్‌పై ఫిబ్రవరి 28న దాడికి ఇజ్రాయెల్ నాంది పలకడంతో ప్రపంచ ఇంధన పటంలో అత్యంత కీలక ఇంధన రవాణా మార్గం మూసుకుపోయేంది. పర్యవసానంగా రెండు ప్రధాన వంటగ్యాస్ ఎగుమతిదారులైన అమెరికా, మధ్యప్రాచ్య దేశాల నుంచి భారత్‌కు ఎల్‌పీజీ సరఫరాలో గడ్డు పరిస్థితి ఎదురైంది. ముఖ్యంగా మన ఎల్‌పీజీ వినియోగంలో దాదాపు 60 శాతం మధ్యప్రాచ్యం నుంచి సరఫరా మీదనే ఆధారపడి ఉంది. ఈ నేపథ్యంలో ఇటు నుంచి సరఫరాలో సింహభాగం రాత్రికి రాత్రే సున్నా స్థాయికి పతనమైంది. ఇంతటి భారీ జనాభాగల మన దేశానికి ఆ హఠాత్పరిణామాన్ని జీర్ణించుకోవడం అంత సులభమేమీ కాదు. కానీ, దేశంలో ఇంటింటా వంటగదిలో మంట ఆరకుండా సరఫరా-డిమాండ్ రెండువైపులా రవాణా, చమురుశుద్ధి కర్మాగారం, గ్యాస్ నింపే ప్లాంట్ల కార్యకలాపాలు అన్నిటిపైనా నిశిత పర్యవేక్షణతో యుద్ధప్రాతిపదికన కార్యాచరణ మొదలైపోయింది.

ఈ క్రమంలో మొదట సరఫరా వైపు నుంచి మార్చి 8న ఎల్‌పీజీ నియంత్రణ ఉత్తర్వు జారీ అయింది. గరిష్ఠ స్థాయిలో వంటగ్యాస్ ఉత్పాదన పెంపు దిశగా 'సి3-సి4' కార్బన్ ప్రవాహాలన్నింటినీ మళ్లించాలని చమురుశుద్ధి కర్మాగారాలకు ఆదేశాలు వెళ్లాయి. అసలు ఎన్నడూ వంటగ్యాస్ ఉత్పత్తి చేయని కర్మాగారాలను రోజుల వ్యవధిలో పునర్వ్యవస్థీకరించారు. దీంతో రోజువారీ ఉత్పాదన 35 నుంచి 54 'టీఎమ్‌టీ'లకు పెరిగింది. యుద్ధం ఉధృతమై... హర్మ్యూజ్‌ను దాటి ఏ ఒక్క నౌక కదల్లేని తరుణంలోనూ 12కు పైగా భారతీయ ఎల్‌పీజీ నౌకలు సుంకాలతో నిమిత్తం లేకుండా దాటి వచ్చాయి. ప్రపంచంలోని మరే దేశానికీ ఇంతటి వెసులుబాటు లభించలేదు.

వంటగ్యాస్‌ను కొనుగోలు చేయడంతోపాటు ఒక నౌక నుంచి మరొకదానికి సరుకును మార్చుకుంటూ యాన్బు, ఫుజైరా రేవుల మీదుగా ఎర్ర సముద్ర మార్గంలో భారత్‌కు సజావుగా రప్పించాం. అమెరికా నుంచి సరకు కొనుగోలు చేస్తున్న సమయంలోనే ఖాళీ నౌకలను హర్మ్యూజ్ లోపలి వైపు పంపారు. సరకును వాటిలో నింపి అల్జీరియా, జపాన్, కెనడా వంటి అనేక దేశాల మీదుగా కొత్త సరఫరా మార్గాల్లో దిగుమతికి వీలు కల్పించారు. ఇదంతా సవ్యంగా సాగిపోయేలా వంటగ్యాస్‌ను ఎగుమతి చేసే ప్రతి దేశ ఇంధనశాఖ మంత్రితో అనేక సార్లు నేను స్వయంగా సంభాషించాను. గల్ఫ్ లోపల-వెలుపల సంప్రదింపులు, సహకారంలో భారత్‌తో వాణిజ్య లావాదేవీలు నిర్వహించే ప్రతి ఉత్పత్తిదారు మనకు అండగా నిలవడాన్ని నేనిక్కడ ప్రత్యేకంగా ప్రస్తావించడం అవశ్యం.

సంక్షోభం నుంచి గట్టెక్కడంలో సరఫరాను నిభాయించడమన్నది మన కృషిలో సగపాలు మాత్రమే... ఎందుకంటే రెండోవైపున డిమాండ్‌కూ ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఏర్పడింది. ఈ దిశగా మొదట గృహోపయోగ వంటగ్యాస్‌కు పూర్తి భరోసా ఇచ్చాం. ఈ విలువైన సరకును అక్రమ వ్యాపారులు నల్లబజారుకు తరలించకుండా సరఫరా నిర్ధారణ కోసం 'డిజిటల్ అథెంటికేషన్ కోడ్'ను తప్పనిసరి చేశాం. దీనికితోడు పౌరులందరి అవసరాలకు సరిపడా సిలిండర్లను అందుబాటులో ఉంచుతూ బుకింగ్ గడువును 25-45 రోజులుగా నిర్దేశించాం. వాణిజ్య సిలిండర్లపై నియంత్రణ లేదు కాబట్టి, ఎవరో ఒక కొనుగోలుదారు గంపగుత్తగా కొని, అక్రమంగా నిల్వ చేసే ముప్పుంది. అందుకే, అక్రమ నిల్వకు తావులేకుండా, ప్రతి ఒక్కరికీ సరిపడా అందేవిధంగా పారిశ్రామిక సంఘాలు, రాష్ట్ర పౌర సరఫరాల శాఖల ద్వారా నియంత్రించాం. పరిశ్రమలకు పైపుల ద్వారా ఎల్‌పీజీ స్థానంలో సహజ వాయువును సరఫరా చేశాం. భారీ వంటశాలలు, వాణిజ్య సంస్థలు వీలైనప్పుడల్లా ఇతర ఇంధనాలను వాడుకునేలా ప్రోత్సహించాం. గృహాలకు పైప్డ్ గ్యాస్, 'సీఎన్‌జీ'లను 'కోత రహిత' విభాగంలో చేర్చాం. పైప్డ్ గ్యాస్ కనెక్షన్లకు మార్పిడిని వేగిరపరుస్తూ పురపాలక సంస్థల అనుమతుల సత్వర మంజూరుకు ప్రభుత్వ యంత్రాంగం కలసికట్టుగా పనిచేసింది. వలస కార్మికులు సహా అనేకమంది వాస్తవ వినియోగదారులు దళారుల ద్వారా సిలిండర్లు కొనే పరిస్థితి ఉండేది. అయితే, డిజిటల్ గుర్తింపు సంఖ్యను తప్పనిసరి చేయడంతో అక్రమ విక్రయాలకు తావులేకుండా పోయింది. అయితే, వారందరి అవసరాలు తీర్చే దిశగా దేశమంతటా '5 కిలోల స్వేచ్ఛా వాణిజ్య సిలిండర్'ను అందుబాటులో ఉంచడంతో వాటి అమ్మకాలు దాదాపు రెట్టింపయ్యాయి. ప్రభుత్వం నిత్యం 'యుద్ధ వ్యూహం' ప్రాతిపదికన దేశంలో ఎక్కడా సరఫరా నిలిచిపోకుండా అనేక విప్లవాత్మక చర్యలు తీసుకుంది. అయితే, వినాశకాలపు విపరీత బుద్ధితో అనవసర భయాందోళనలు, గందరగోళం సృష్టించడానికి కొందరు వదంతులను, తప్పుదోవ పట్టించే వీడియోలను ప్రచారం చేయడం ప్రారంభించారు. ప్రధాన మంత్రి మోదీ దృఢ సంకల్పమే ఈ పకడ్బందీ వ్యూహానికి మూలసూత్రం. ఖజానా మీద ఎంత భారం పడినా, భారత పౌరుడిపై వీసమెత్తు బరువు పడరాదన్నది ఆయన నిర్దేశం. రష్యా-ఉక్రెయిన్ యుద్ధానంతర ఇంధన సంక్షోభం, ప్రాణాంతక కోవిడ్ మహమ్మారి విజృంభణ తదితర సందర్భాల్లోనూ 'భారత్ శైలి'ని ఇది తలపిస్తుంది. ఈ ఏడాది ఫిబ్రవరి-జూన్ నెలల మధ్య వంటగ్యాస్‌కు అంతర్జాతీయ ప్రమాణంగా నిలిచే 'సౌదీ కాంట్రాక్టు ధర' దాదాపు 50 శాతం పెరిగింది. ఆ దిగుమతి ఆధారిత ధర ప్రకారం 1,600కన్నా ఎక్కువ వెచ్చించాల్సిన సిలిండర్ 'ఉజ్వల' పథకం లబ్ధిదారులకు 642కే చేరింది. మోదీ ప్రభుత్వం ప్రతి ఉజ్వల సిలిండర్‌పై సుమారు □900, సాధారణ గృహోపయోగ సిలిండరుపై దాదాపు □600 వంతున నష్టాన్ని భరిస్తోంది. కాబట్టే, ఇరుగుపొరుగున గల పాకిస్థాన్, బంగ్లాదేశ్, నేపాల్ సహా స్పెయిన్ లేదా ఫ్రాన్స్ వంటి దేశాలతో పోలిస్తే భారతీయ కుటుంబాలు వంటగ్యాస్ కోసం చెల్లిస్తున్నది చాలా తక్కువనే చెప్పాలి!

మరోవైపు ఈ ఏడాది మార్చి నెలలో కేంద్రం ఓ సాహసోపేత నిర్ణయం ద్వారా లీటరు పెట్రోలుకు □10 వంతున ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించింది. దీంతో ముడి చమురు ధర దాదాపు రెట్టింపైన కారణంగా పెరిగిన ధరల భారం నుంచి జనం గణనీయంగా కుదుటపడ్డారు. అయితే, ఈ త్రైమాసికంలో ప్రభుత్వ రంగ చమురు కంపెనీలు నిత్యం రూ.500 నుంచి 1000 కోట్లకు పైగా నష్టాలను చవిచూశాయి. అదే సమయంలో అమెరికాలో పంపుల వద్ద పెట్రోల్ ధర 40 శాతానికిపైగా బ్రిటన్‌లో దాదాపు 20 శాతం దాకా పెరగడం గమనార్హం. ఐరోపాలోని చాలా దేశాల్లో పెరుగుదల రెండంకెల స్థాయికి చేరగా, భారత్‌లో మాత్రం సుమారు 7 శాతానికి పరిమితమైంది. వాస్తవాలు ఇలా ఉండగా- విదేశీ మారక నిల్వలు అడుగంటి, దేశ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతుందని, ఆర్థికంగా మన భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకుంటాయని తప్పుదోవ పట్టించే కథనాలను కొందరు ప్రాచుర్యంలోకి తెచ్చారు. అయితే, మన ప్రస్తుత విదేశీ మారకం నిల్వలే ఈ కువిమర్శలకు జవాబిస్తున్నాయి. ఈ సంక్షోభం మొదలైన తొలి వారంలో సర్వకాల గరిష్ఠ స్థాయికన్నా స్వల్పంగా మాత్రమే తగ్గుదల నమోదవగా, ప్రస్తుతం దాదాపు 690 బిలియన్ డాలర్ల వద్ద స్థిరంగా ఉంది. అంతేకాకుండా గత త్రైమాసికంలో భారత ఆర్థిక వ్యవస్థ 7.8 శాతం వృద్ధిని నమోదు చేయడం విశేషం. అంతేకాదు.. భారత్ ఇంధన నిల్వ సామర్థ్యంపైనా వదంతులను వ్యాప్తి చేశారు. దేశంలో 8 లేదా 9 రోజులకు సరిపడా మాత్రమే నిల్వలున్నాయని, అంతకన్నా ఎక్కువ నిల్వ చేసుకునే వాస్తవ సామర్థ్యం లేదని అపోహలు సృష్టించారు. కానీ, దాదాపు 150 కోట్ల జనాభాగల ఒక భారీ ఇంధన ఆర్థిక వ్యవస్థ ఎలా పనిచేస్తుందో ఇలాంటి శక్తులకు అర్థమయ్యే అవకాశం లేదు.

కేవలం కొన్ని భూగర్భ చమురు నిల్వ సదుపాయాలతో ఒక దేశాన్ని నడపడం అసాధ్యం. ఎందుకంటే- ఆ నిల్వల వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదు సరికదా... అందుకయ్యే వ్యయం భారీగా ఉంటుంది. సాధారణంగా దేశమంతటా విస్తరించిన దిగుమతి కూడళ్లు, డిపోలు, పైప్‌లైన్లు, రిఫైనరీలు, నిల్వ కేంద్రాల వ్యవస్థ ద్వారా చమురు నిల్వలను నిర్వహిస్తారు. ఈ మేరకు ప్రస్తుతం దేశంలో 24 రిఫైనరీలు సహా 47,000 కిలోమీటర్లకు పైగా చమురు-గ్యాస్ పైప్‌లైన్లు, నిత్యం దాదాపు 8 కోట్ల మందికి సేవలందించే లక్షకు పైగా పెట్రోల్ పంపులు ఉన్నాయి. ప్రళయమేదో ముంచుకొస్తున్నట్లు భయపెట్టే అంకెల గారడీ ఈ వ్యవస్థకు నిజమైన గీటురాయి కానేకాదు. నేటి ఆధునిక శకంలో అత్యంత తీవ్ర ఇంధన సంక్షోభానికి నాలుగు నెలలు దాటుతున్నా దేశం తన ప్రజల వినియోగంపై ఆంక్షలు విధించాల్సిన దుస్థితి వచ్చిందా? సరి-బేసి నంబర్ ప్లేట్ల ప్రకారం ఇంధన వాడకాన్ని నియంత్రాల్సి వచ్చిందా? ఇంటి నుంచే పనిచేయాల్సిన పరిస్థితి కల్పించిందా? నిత్యం సాయంత్రం 5 గంటలకే పెట్రోలు పంపులను మూసివేసే అవసరం వచ్చిందా? ఇత్యాది అంశాలే సామర్థ్యాన్ని నిర్ణయించే కొలబద్ద. భారత్‌లో ఇలాంటి ఏ ఒక్క దురవస్థ తలెత్తలేదు... ఇదంతా ఎలా సాధ్యమైందంటే- భవిష్యత్తుపై దూరదృష్టితో రంగం సిద్ధమైంది కాబట్టే! మన ముడిచమురు కొనుగోలును 27 దేశాల నుంచి 41 దేశాల స్థాయికి విస్తరించాం.

దిగుమతి కూడళ్ల సంఖ్యను రెట్టింపు చేశాం. జలసంధి మూసివేత వేళ కూడా దేశంలో దీపాలు వెలుగుతూనే ఉన్నాయంటే నిస్సందేహంగా- ప్రధానమంత్రి మోదీ హయాంలో దశాబ్దం నుంచీ నిర్మించిన పైప్‌లైన్లు, నిల్వలే కారణం.

ఇలాంటి సంక్షోభ సమయాన్ని ఒక దేశం నిభాయించిన తీరే దాని వాస్తవిక సామర్థ్యం, ఆత్మస్థైర్యాన్ని చాటిచెబుతుంది. ఆ విధంగా చూస్తే- హర్మ్యూజ్ జలసంధి మూసివేత తుఫానులో ఎదురీత తప్పకపోయినా, దేశీయంగా ఎక్కడా... ఎలాంటి కొరత లేకుండా సమస్యనే సాధనంగా మార్చుకుని, ఇంధన సరఫరాకు అంతరాయం లేకుండా చూసుకోగలిగింది. ఈ సుడిగుండం నుంచి గట్టెక్కిన అనుభవంతో మన ఇంధన పునరుత్థాన స్థితిని బలోపేతం చేసుకునే దిశగా అదనపు సామర్థ్యాన్ని సంతరిచుకుంటాం. "మన జీవితకాలంలో అత్యంత తీవ్ర ఇంధన సంక్షోభం చుట్టుముట్టినా, 150 కోట్ల మంది భారత పౌరుల జీవనం స్తంభించకుండా కేంద్ర ప్రభుత్వం పటిష్ఠ రక్షణ వలయం సృష్టించింది" అనే వాక్యం మాత్రం ఈ సంఘర్షణ చరిత్ర రచనలో చిరస్థాయిగా నిలిచిపోతుంది.

## రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!

పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.